క్షత్రియుల వంశావళి

వేలూరు, 1903

Record no. 742

Kṣatriyula Vaṃśāvaḷi

Vēlūru, 1903

Record no. 742

క్షత్రియుల వంశావళి / విద్వాన్ వేంకటాచార్యులవారిచే పరిష్కరించబడినది. - వేలూరు: వాణీ ముద్రాక్షరశాల, 1903.

74 p. ;21 cm.

Record no. 742

Kṣatriyula Vaṃśāvaḷi / Vidvān Vēṅkaṭācāryulavāricē pariṣkariñcabaḍinadi. - Vēlūru: Vāṇī Mudrākṣaraśāla, 1903.

74 p. ;21 cm.

Record no. 742

742

స్త్రీల వంగావళి

124
5173



శ్రీరస్తు.

శ్రీకృష్ణాయనమః

చంద్ర వంశాలంకారులగు

యయాతి మహారాజుయొక్క వంశంబునందుపుట్టి

జమదగ్ని మహామునిచేత వ్యాకులమువారని పేరుపొంది

పిమ్మట వీరి మూలపురుషుడైన అంభోధిరాజు ప్రభావమువల్ల

పాలవ్యాకులమువారని ప్రసిద్ధిపొందిన

క్షత్రియుల వంశావళి.

మొదటిభాగము.

శ్రీమన్నారాయణునివల్ల బ్రహ్మాదులసృష్టిక్రమము.

అఖిలాండకోటి బ్రహ్మాండనాయకుడై వేయితలలతో వెలుగుచున్న శ్రీనారాయణునియొక్క బొడ్డులోపుట్టిన తామరపువ్వునందు నాలుగు మొగములుగల బ్రహ్మదేవుడు పుట్టెను. ఆబ్రహ్మదేవునియొక్క అంగములయందు మునులు, మనువులు మొదలుగాగలవారలనేకులు జనియించిరి. వారలకు పెక్కుమంది కొడుకులు కూతుండ్లు కలిగి దేవ, రాక్షస, మనుష్య, పక్షి, మృగాది, నానావిధజీవరాసులను సృష్టిచేసి లోకమంతటనున్ను తమవంశమే నిండియుండునట్లుగా చేసిరి.

వీరిలో బ్రహ్మయొక్క కంటియందు పుట్టినవాడు అత్రిమహాముని. ఇతడు స్వాయంభువమనువుయొక్క కూతురున్ను కర్దమప్రజాపతికి భార్యయున్ను అయిన దేవహూతియనుదానియందుపుట్టిన అనసూయయనే కన్యకామణిని పెండ్లిచేసుకొనెను.

ఈ దంపతులొకరినొకరు మిక్కిలి ప్రీతితో చూచుచుండగా పెనిమిటియైన యత్రిమహామునియొక్క కడకంటిచూపులయందు బ్రహ్మదేవుని యంశమువల్ల చంద్రుడుపుట్టెను. ఆచంద్రునికొడుకు బుధుడు. ఇతడు సకలశాస్త్రపారంగతుడై లోకంబులంతటనున్ను ప్రసిద్ధిపొందెను. ఇతనికి వైవస్వతమనువుయొక్క కూతురైన ఇళాకన్యకయందు పురూరవుండను రాజచంద్రుండు కోటి మన్మథసుందరుండైపుట్టి సమస్త

భూమండలంబునకు నేకచక్రాధిపతియై పురూరవచక్రవర్తియను నామంబునొంది జగత్ప్రసిద్ధుఁడాయెను.

అట్టియెడనక్కాలంబున దేవలోకంబునందు ఇంద్రసభలో పురూరవచక్రవర్తి యొక్క సౌందర్యలావణ్యంబులనుద్దేశించి భగవంతుండగు నారదమునీంద్రుండు శ్లాఘించిపలుకుచుండగా అప్సరస్త్రీలందరికంటె మిక్కిలి సౌందర్యవతియగు నూర్వశియమ్మాటలువిని యారాజుపై మనస్సుతగిలి మోహపరవశురాలై యుండెను.

ఊర్వశికి మనుష్య స్త్రీరూపంబు కలుగునట్లు శాపము.

ఇట్లుండగా నొకానొక సమయంబున మిత్రావరుణులను పేరుగల దేవతల యూర్వశికి మనుష్య స్త్రీరూపంబు కలుగునట్లు శాపంబిచ్చుటయు నదియువారల శాపంబుమేరకు మనుష్య స్త్రీరూపంబు పొందిన్ని జగన్మోహనంబైన తన స్వభావ సౌందర్యలావణ్యంబులయందు కొంచెమైనను తక్కువలేక అత్యంత శృంగారవతులగు మనుష్య స్త్రీలను పరిహాసము చేయునట్టిదై వెలుంగుచు భూలోకంబునకు వచ్చి పురూరవచక్రవర్తి యెదురుగా నిలిచి మున్ను ఇంద్రసభలో తాను నారదువలన విని నంతకంటె నూరింతలు వర్ణించతగినదై వెలుంగుచున్న యారాజ శ్రేష్ఠుని సౌందర్య లావణ్యంబులను కన్నులారఁజూచి మితిలేని మోహంబుచేత దేహంబుమరచి నిలచి యుండెను.

ఊర్వశి పురూరవచక్రవర్తిని వరించుట.

అప్పుడారాజు దాని రూపలావణ్యంబులమూచి మోహ పరవశుండై మృదు మధుర వచనంబులచేత నాదరించి పలికించి దాని తీయని మాటలచేత నది యూర్వశి యగుటయు తనపై మోహంబువల్ల నిట్లు వచ్చియుండుటయు నెఱింగి యిద్దరునేక చిత్తంబుతో కలిసి యిష్టోపభోగంబుల బహుకాలమనుభవింపుచుండిరి.

తరువాత నారాజు సకల శాస్త్రంబులనున్ను పరిశీలనచేసి వేదంబులకు విభాగంబులు కల్పించి యనేక యజ్ఞములుచేసి మిక్కిలి ప్రసిద్ధిజెందెను.

ఊర్వశీ పురూరవ చక్రవర్తుల సంతతి.

ఇట్టి పురూరవచక్రవర్తికి ఊర్వశీగర్భమందు మిక్కిలి శ్రేష్ఠబుద్ధిగల కొడుకు లార్వురుపుట్టిరి.

అందు మొదటివానిపేరు ఆయువు.
౨-వ వానిపేరు శ్రుతాయువు.
౩-వ వానిపేరు సత్యాయువు.
౪-వ వానిపేరు రయుడు.
౫-వ వానిపేరు జయుడు.
౬-వ వానిపేరు విజయుడు.

వీరిలో కడపటివాడైన విజయుని వంశంబున పెక్కు తరములుగడచిన వెనుక గాధియనురాజు పుట్టెను. అతనికి విశ్వామిత్రుడను కొడుకుపుట్టి తన దివ్య తపోమహత్త్వంబుచేత దేవతలకెల్ల నాశ్చర్యంబును భయంబును కలుగఁజేసి బ్రహ్మవరము వసిష్ఠవాక్యము ఈ రెంటివల్లనున్ను బ్రాహ్మణ శ్రేష్ఠుడై సకలలోకంబులందున్ను మిక్కిలి ప్రఖ్యాతి వహించెను.

మొదటివాడైన ఆయువుకు ఐదుగురుకొడుకులు పుట్టిరి.

అందు మొదటివానిపేరు నహుషుడు.
౨-వ వానిపేరు క్షత్రవృద్ధుడు.
౩-వ వానిపేరు రజి.
౪-వ వానిపేరు రంభుడు.
౫-వ వానిపేరు ఏనస్సు.

ఈప్రకారముగా జనియించిన అయిదుగురిలో రెండవవాడైన క్షత్రవృద్ధునికి సుహోత్రుండను కొడుకుపుట్టెను.

వానికి ౧-కాశ్యుడు
౨-కుశుడు
౩-కృత్స్నమదుడు

అని ముగ్గురుకొడుకులు జనియించిరి. ఈముగ్గురిలో పెద్దవాడైన కాశ్యునకు కాశియనురాజు పుట్టెను. ఈరాజు మిక్కిలి ప్రసిద్ధుడై భూమండలము నేలుటవలన యితనివంశము వారికి కాశిరాజులని ప్రసిద్ధమైనపేరు కలిగెను. ఈకాశిరాజుకు

౧-సురాష్ట్రుండను వాడుపుట్టె
౨-అతనికి దీర్ఘతముండుపుట్టెను
౩-అతనికి శ్రీమన్నారాయణాంశమున ధన్వంతరి జనియించెను.

ఇతడు వైద్యశాస్త్ర ప్రవీణుడై మిక్కిలి గౌరవమును వహించి యజ్ఞములయందు దేవతలతో సమానముగా హవిర్భాగములు తీసుకొనుచుండెను. మరియు నితని నామంబును స్మరణచేసినవారికి సమస్త దుఃఖములున్ను పరిహారమగునని శాస్త్రమందు చెప్పబడియున్నది. ఈ ధన్వంతరియొక్క వంశంబున ౧-దివోదాసుడు ౨-అలర్కుడు మొదలైన రాజశ్రేష్ఠులు జనియించి పరమధర్మిష్ఠులై ప్రజలరక్షించిరి.

మరియు వీర్లకు మూలపురుషుడున్ను క్షత్రవృద్ధుని కొడుకున్ను అయిన సుహోత్రునియొక్క రెండవకుమారుని వంశమందు పెక్కుమంది రాజశ్రేష్ఠులు జన్మించిరి.

మూడవవాడైన కృత్స్నమదునివంశమందు శౌనకుండుపుట్టి తపోనియమంబు పొందెను. ఇది ఆయువుకొడుకులలో రెండవవాడైన క్షత్రవృద్ధునివంశము.

ఆయువుకొడుకులలో మూడవవాడైన రజియనువానికి యేనూరుమంది కొడుకులుకలిగి లోకమందెట్టివారికిన్ని జయింపకూడని అతిబలపరాక్రమంబులు గలవారై వృద్ధిపొందుచుండిరి.

రజికి యింద్రుడు దేవరాజ్యంబునిచ్చుట.

ఇట్లుండగా నొక్కసమయంబునందు దేవరాజ్యంబునకు దైత్యులవల్ల మిక్కిలి బాధకలిగినందుచేత దేవేంద్రుండారజియొద్దకువచ్చి మొరపెట్టుకొనెను. అప్పుడారజి దేవేంద్రునికి ప్రియంబుగా ననేకదైత్యులను చంపి స్వర్గలోకంబునకు కలిగినట్టి శత్రుబాధలను తప్పించి దేవరాజ్యంబును దేవేంద్రునకిచ్చెను. అప్పుడతండు తనకు రజిచేసినమేలుకు మిక్కిలి సంతోషించి యతనిపాదంబులకు తన కిరీటంబుసోకునట్లుగా సాష్టాంగదండప్రణామంబాచరించి దేవరాజ్యంబు నతనికేయిచ్చి తానాతని బూజింపుచుండెను.

ఇంద్రుడు రజి కొడుకులను (జంపి దేవరాజ్యంబు గొనుట.

తరువాత కొంతకాలంబునకు రజిచచ్చుటయు అతని కొడుకులేనూరుమందిన్ని మదోన్మత్తులై దేవేంద్రుండెంతప్రార్థించియడిగినను దేవరాజ్యంబునాతనికివ్వక తామే యేలుచు అంతకంతకు మిక్కిలిగర్వించి యజ్ఞభాగములనుకూడా దేవతలకందనివ్వక తామే యపహరింపుచుండిరి. ఇట్లు నానాటికి నత్యధికముగా వృద్ధిపొందుచున్న రజికొడుకుల చెడ్డతనములవల్ల దేవేంద్రుడు మిక్కిలి భయంబును కోపంబును బొంది దేవగురుండైన బృహస్పతిచేత రజిపుత్రుల వినాశార్థంబుగా నొక్క హోమంబు చేయించి యాహోమ మంత్రశక్తిని వజ్రాయుధంబు నందావాహనచేయించి అట్టి

వజ్రాయుధముచేత రజిపుత్రుల నందరినిన్ని నిర్మూలంబుచేసి తనకెదురులేక దేవరాజ్యంబు నేలుచుండెను. ఇది ఆయువుకొడుకులలో మూడవవాడైన రజియొక్క వంశము.

ఆయువుకొడుకులలో నాల్గవవాడైన రంభునివంశమందు నాలుగవతరము వానికి బ్రాహ్మణకులము కలిగెను. ఇది నాలుగవవాడైన రంభునివంశము.

ఆయువుకొడుకులలో అయిదవవాడైన ఏనస్సుయొక్క వంశమందు ఆరవతరమున కృతకృత్యుండనువాడు జనియించి శాంతము విజ్ఞానము ఇవిగలవాడై విరక్తి పొందెను. ఇది ఆయువుకొడుకులలో ఐదవవానివంశము.

నహుషుని సంతతి.

ఆయువుకొడుకులలో పెద్దవాడు నహుషుడు ఇతనికి ఆర్గురుకొడుకులుపుట్టిరి.

వీరిలో మొదటివాని పేరు యతి.

౨-వ వాని పేరు యయాతి.

౩-వ వాని వేరు సంయాతి.

౪-వ వాని పేరు ఆయాతి.

౫-వ వాని పేరు వియతి.

౬-వ వాని పేరు కృతి.

ఈరీతిగా నహుషమహారాజు ఆర్గురుకొడుకులనుగాంచి మహావైభవంబుతోడ నీభూమండలమంతయు నేకచ్ఛత్రాధిపత్యముగా నేలి నూరశ్వమేధయాగములుచేసి తరువాత పెద్దకొడుకైనయతికి పట్టాభిషేకంబుచేసి తాను ఇంద్రపట్టమునకుపోయెను.

అటుతరువాత యతి జ్ఞానవైరాగ్యవంతుండై తనమనస్సులో సకల పాపంబులకున్ను మూలకారణంబైన ఈరాజ్యంబునాకేల దొరతనము చేయువారలందరున్ను రాజ్యమదమువలన నొడలెఱుంగక పెద్దలు పిన్నలు అను తారతమ్యమునుకూడావదలి యకృత్యములనాచరించి నశించిపోవుచుండుట యీలోకమందంతటనున్న ప్రసిద్ధిగానుండలేదా. కాబట్టి నేనీప్రతిబంధకములన్నిటినిన్ని వదలి యడవులకఱిగి శాంతుండనైయుండెదనని తలపోసి యపరిమితైశ్వర్యసమృద్ధంబైన రాజ్యభోగంబులనువిడచి తపోవనంబున కరిగెను.

యయాతి మహారాజు చరిత్రము.

తరువాత నహుషుని రెండవకొడుకైన యయాతిమహారాజు ఈభూమండలమునకెల్ల నేకచ్ఛత్రాధిపతియై యేలుచు సంపూర్ణ దక్షిణలతోడ బహువిధ యజ్ఞం

బులు విధానంబు తప్పక ననుష్ఠింపుచు సకల ప్రజలనున్ను తనబిడ్డలవలె పెంచి ధర్మ మార్గముదప్పక మిక్కిలి ప్రీతితోడఁ గాపాడుచుండెను.

వృషపర్వుఁడను దైత్యరాజు శుక్రాచార్యులవలన చచ్చినవారిని బ్రతికించుకొనుచుండుట.

ఆట్టియెడనక్కాలంబున వృషపర్వుండను దైత్యరాజు దైత్యసమూహంబులకెల్ల నధిపతియై ప్రభుత్వముచేయుచుండెను. ఇతనికి గురువు శుక్రాచార్యులు. వీరు రాజనీతి శాస్త్రంబునందు మిక్కిలి ప్రవీణులు. శుక్రనీతియనుపేరుగల యొక రాజనీతి శాస్త్రమును నిర్మించియున్నారు. సూర్యాది నవగ్రహములలో వీరు ఆరవగ్రహముగా గొప్పవహించినవారు.

ఇట్టి శుక్రాచార్యులు తననీతి కౌశల్యముచేత నాదైత్యరాజుకు నిరంతరమున్ను ప్రియమైన హితకార్యములనే చేయుచుండును. మరియు నీశుక్రుడు మృతసంజీవనీవిద్య (చచ్చినవారిని బ్రతికించునట్టివిద్య) నెఱింగినవాడు కాఁబట్టి దేవదానవ యుద్ధములయందు దేవతలచేత చచ్చిన దైత్యులనెల్ల నప్పటికప్పుడే తన సంజీవనీ విద్యచేత బ్రతికించుచుండెను.

దేవతలు మృతసంజీవనిందెచ్చుటకు బృహస్పతి కుమారుఁడగు కచునింబంపుట.

ఇట్లుండఁగా దేవతలీమృతసంజీవనీవిద్యయొక్క మహత్త్వంబునుచూచి మిక్కిలి భయపడి యసురుల జయించుటకుపాయంబుగానక ఖిన్నులైయుండఁగు నొక్క యేకాంతస్థలంబునచేరి యాలోచింపుచు యెట్లుచేయుదము మనకాసంజీవని లభించు వరకున్ను జయముకలుగుట దుర్లభము శుక్రుననుసరించి సేవించి సంతోషపరచితేఁగాని యస్మహనీయవిద్య లభించదు. అట్లు శుక్రుని సంతోషపరచి కార్యమును సాధించువాడు మిక్కిలి బుద్ధిమంతుడుగా నుండవలయు మనవారిలో నట్టిపుణ్యుండెవ్వడో యని విచారించి దేవగురువైన బృహస్పతికి పుత్రుండగు కచునియొద్దికరిగి సవినయ భక్తిపూర్వకంబుగా సాష్టాంగదండ ప్రణామంబాచరించి యిట్లనిరి.

స్వామీ మీరధిక తపోమహత్త్వము కలిగినవారలు మాకు కలుగునట్టి యాపదలు నివర్తించుటకు మీతపోమహత్వంబుదక్క వేరుగతిలేదు ఇప్పుడు మాకుకలిగియుండే యాపదలను చెప్పుచున్నాము వినుడు. మాకు శత్రువులైన యసురులకు శుక్రాచార్యులు కులగురువుగానుండుటవల్ల మాకున్ను ఆదైత్యులకున్ను యుద్ధంబు కలిగినప్పుడు మాచేత చచ్చిన దైత్యభటులనెల్ల శుక్రుడు తన సంజీవనీవిద్యచేత బ్రతికించుచున్నాడు. దైత్యభటులలో నొక్కొక్కవీరుడే లోకములనన్నిటినిన్ని జయించగలిగిన జగజెట్టిగానుండుటవల్ల నిట్టివీరులలో నొక్కొక్కని చంపుటకే మేమందరము నెంతో పాటుపడవలసియుండఁగా చచ్చిన వారలందరున్ను ఈరీతిగా మృతసంజీవనిచేత బ్రతుకుచు వచ్చిరేనియసుర సమూహములనెల్ల మనమెట్లు జయించబోవుచున్నాము మనకా మృతసంజీవనిలేనికారణంబుచేత దైత్యులచేత చచ్చిన మన సైనికులయందొక్కడైనను మరల జీవించువాడులేదు. పగవార్లకు మరణభయమే లేకుండుటవల్ల మనవారికెంత పరాక్రమముండియు ప్రయోజనమేలేకయున్నది. కావున మీరలాశుక్రునియొద్దికరిగి మీగుణంబులచేత నతనిమెప్పించి సంజీవనిఁజేకొనివచ్చి దేవసమూహంబులను కాపాడవలయు. బాలుండును నియమవ్రతశీలుండునగు మిమ్ము చూడగానే శుక్రుడు మిక్కిలి ప్రియంబుతోడ నాదరించును.

కచుడు శుక్రాచార్యులయొద్ద శిష్యుడుగానుండుట.

మరియు నొక్కయుపాయంబుగలదు వినుడు ఆశుక్రునకు దేవయానియనియొక్క కుమారికకలదు. దానియందుగల ప్రేమాతిశయంబువల్ల శుక్రుడు దానిమాట జవదాటకుండును కావున మీరు మిక్కిలి నేర్పుతోడ దానిచిత్తంబు మెప్పించుచు నతని నారాధించితిరేని కార్యంబు నిక్కంబుగా సిద్ధించును అని యీప్రకారంబుగా దేవతలు కచునిప్రార్థించి సమ్మతిపరచుటయు నతండు దేవగణప్రీత్యర్థంబుగా దైత్యనివాసంబైన వృషపర్వరాజధానికరిగి యచ్చట నిత్యవేదాధ్యయనతత్పరుండును దానవగణోపాధ్యాయుండునై వెలుంగుచున్న శుక్రాచార్యులనుచూచి సాష్టాంగదండప్రణామంబాచరించి స్వామీ నేను దేవగురువైన బృహస్పతియొక్క కుమారుఁడఁగుదుంబనువాఁడ మహాత్ములరైనమీయొద్ద శిష్యుఁడనై యుండవలయునని యిటవచ్చినాఁడ అని మృదుమధుర వచనంబులతో వినయపూర్వకంబుగా విన్నవించుటయు శుక్రుండు నమ్మాటలువిని తనమనంబునందా కచునియొక్క శాంతగుణమునున్ను వినుటకింపైన తియ్యనిమాటలనున్ను వినయమునున్ను మెచ్చుచు మిక్కిలి స్నేహముతోడ ప్రియవచనపూర్వకంబుగా నతనిచేరఁబిలచి తనమనంబున నీతనిఁబూజించితినేని వీనితండ్రియైన బృహస్పతిని పూజించినట్లే సరియనియెంచి అతిథులు నభ్యాగతులునుగా వచ్చు పెద్దలను పూజించునట్లుగా నక్కచునింబూజించి సంతుష్టుంజేసి వానికోరికమేరకు తన శిష్యునిగాఁజేసుకొనెను.

తరువాత నక్కచుండు తనగురువుయొక్క మనస్సుకు మిక్కిలి సమ్మతిగా పనులుచేయుచు నంతకంటే మిక్కిలి ప్రీతితో నాతనికూతురగు దేవయానికి పువ్వులు పండ్లు మొదలగు కోరిన వస్తువులనెల్ల దెచ్చియిచ్చుచు ప్రియముగా మాటలాడుచు సంతోషముఁజేయుచుండెను.

రాక్షసులు కచుని జంపిన శుక్రాచార్యులు వానిం బ్రతికించుట.

ఇట్లు నిర్మలచిత్తంబుతోడ ననేకసంవత్సరములు శిష్యవృత్తి చేయుచుండగా వారలిద్దరికిన్ని యక్కచునియందు నానాటికి మిక్కిలి ప్రీతిపుట్టి వృద్ధిపొందుచుండెను. ఇట్లుండుటనుచూచి దానవులు సహింపజాలక యొక్కనాడు కచుడు శుక్రుని హోమధేనువులను మేపుటకై యొంటిగానడవికి పోయియుండగా నాతనింజంపి యొక్రమానికిఁగట్టి వెళ్లిపోయిరి. అంత సూర్యాస్తమానంబగుటయు హోమధేనువులు మరలి యింటికివచ్చెను. అప్పుడు దేవయాన వాటింజూచి వాటివెంటకచుఁగానక మిక్కిలి దుఃఖించుచు తన తండ్రియొద్దకుపోయి నాయనా గోవులుమాత్రము వచ్చినవిగాని కచుడు రాడయ్యె ప్రొద్దు అస్తమించె దిక్కులంతట చీకటిగ్రమ్ముకొనియె అరణ్యమందు దుష్టమృగరాక్షసపన్నగాదులచేత జిక్కెనో తెలియదయ్యె. అని విలపించుటయు శుక్రుండు తనదివ్యదృష్టిచేత అసురులచేఁజంపఁబడియుండుకచునిఁజూచి యతనిఁ బ్రతికించి తోడ్కొనిరమ్మని మృతసంజీవనింబంపించుటయు నది మహాప్రసాదంబనియతనియాజ్ఞను శిరసావహించి యతిత్వరితగతింబోయి కచునిఁ బ్రతికించి తోడ్కొనివచ్చెను. అంతశుక్రుండును దేవయానియు సంతుష్టాంతరంగులై కచునితోడ నిష్టగోష్ఠీ సల్లాపంబులుచేయుచు మందరికంటే నెక్కుడైన ప్రీతితోనుండి తరువాత కొన్నిదినంబులు గడచినవెనుక మరల నొక్కనాడు దానవులరణ్యంబునందు పువ్వులుగోయుచున్న కచునిఁగనిపెట్టి యధిక మాత్సర్యంబుతోడ వానింబట్టి చంపి కాల్చి బూడిదెచేసి యాబూడిదెను కల్లుతోడకలిపి శుక్రుండు మదిరాపాన ప్రియుండగుటచేత నాకల్లు నాశుక్రునకు తెచ్చి యిచ్చి త్రాగించిరి. అంత శుక్రుండును మదిరాపానమత్తుండైయుండ దేవయాని మునుపటివలెనే కచుంగానక దుఃఖించుచు తండ్రియొద్దకువచ్చి గద్గద కంఠంబుతోడ తండ్రీ నేడును కచుండురాడయ్యె. దానవులచేతఁ జంపఁబడియుండవలయు అని ప్రలాపించుచున్న దానింజూచి శుక్రుండు ఓదేవయానీ నీవేలయిట్లు యేడ్చెదవు ఆకచుడు నాయొద్దనుండి సంజీవనింగొనిపోవునేమోయను సందేహముచేత దానవులు మచ్చరంబుపెట్టి యీరీతిజేయుచున్నారు. ఇకవానికి పుణ్యలోకంబులు కలుగునుగాని నీవు దుఃఖంబుమానుము అనిన విని దేవయాని యిట్లను స్వామీ వినుడు మహాబుద్ధిశాలియైన బృహస్పతికి పుత్రుండును మీకు ప్రియశిష్యుండును బ్రహ్మచర్యాశ్రమంబందు మిక్కిలి నిష్ఠగలవాడును నయిన కచుడు నిష్కారణంబుగా దానవులచేత నీరీతిఁజంపఁబడుటను చూచి నేనెట్లు దుఃఖింపకుందు. పరమధర్మిష్ఠులరైన మీకైననిది యెట్లుసమ్మతమయ్యె నేనాతనింజూచిగాని యన్నపానంబుల్లొల్లనని గొంతెత్తి యేడ్చుచున్న కూతురింజూచి శుక్రుండు పెద్దయుంబ్రొద్దునకువెనుక కరుణించి తనయోగదృష్టిచేత వెతికి చూచి

భూమండలంబునం దెచ్చటనున్ను కచుంగానక కల్లుతోడఁగలసిన భస్మరూపంబుగా తనకడుపులో నుండుటంగని కల్లువల్ల కలిగిన దోషమున్ను దానవులుచేసిన నీచకృత్యమున్ను ఆలోచించి తనలోతానిట్లను.

శుక్రాచార్యులు కల్లుత్రాగినవారిని మహానరకంబునంబడునట్లుగా శాపంబిచ్చుట.

సకలజనులకున్ను పూర్వపు సేక జన్మములనుంచి సంపాదించిన పుణ్యముల వల్ల జ్ఞానము కలుగునుగాని యట్టిజ్ఞానమును క్షణమాత్రము నందీమద్యపానము నశింపఁజేయును కాబట్టి యిట్టిమద్యపానంబు సేయతగునా? ఇదిమొదలుకొని బ్రాహ్మణులు మొదలుగాగల సకలజనులున్ను యీకల్లుత్రాగిరేని మహానరకంబులందు పడుదురు ఇది నేడునేఁజేసిన నిబంధన. దీని నెవ్వరు నతిక్రమింపతగదు. అనియీరీతిగా శుక్రాచార్యులు సురాపానంబు మహానరకకారణంబగునట్లుగా శాపంబుపెట్టెను.

శుక్రాచార్యులు కచుని బ్రతికించి యతనికి మృతసంజీవనీ విద్యనుపదేశించుట.

తరువాత తనకడుపులోనున్న కచుని తత్క్షణంబున బ్రతికించుటయు నాతడచ్చటనుండె యేశుక్రునకిట్లను స్వామీ మీయనుగ్రహమువల్ల దేహము, ప్రాణము, బలము, అన్నియుఁ కలిగెను. ఇకమీకడుపునుండి వెలువడివచ్చుటకు ఉపాయము నెఱింగింపుడు అనుటయు శుక్రుండు తనమనంబున నాకడుపు పగిలితేనేగాని యితడు వెలువడిరానేరడు. కడుపు పగిలినప్పుడు నేను మూర్ఛపోవుదును కావున అప్పుడునన్ను బ్రతికించుటకై వీనికిప్పుడు సంజీవని యుపదేశింపవలయు అని నిశ్చయించి సంజీవినీవిద్యను యథాక్రమంబుగా వానికుపదేశించి దానిప్రయోగ క్రమంబంతయు నెఱుంగఁజెప్పి యాతనిఁ దనయుదరంబు భేదించుకొని వెలువడిరమ్మనియు తరువాత తన్ను సంజీవనిచేత బ్రతికించుమనియు నాజ్ఞయిచ్చెను. తరువాత కచుండు శుక్రుని యుదరంబు భేదించుకొని వెలువడివచ్చి తత్క్షణంబున తనగురుని సంజీవితుంజేయుటయు నతండును తానును దేవయానియును సంతసిల్లి యెప్పటియట్ల సుఖంబుననుండిరి.

ఈప్రకారంబుగా కచుండతి ప్రయాసచేత శుక్రునియొద్ద సంజీవనింబడసి తరువాత కొంతకాలమువరకున్ను అచ్చటనేయుండి యొక్కనాడు దేవలోకంబునకుబోవ సమకట్టి శుక్రునికి సాష్టాంగదండ ప్రణామంబాచరించి ప్రియవచనంబులతోడ వీడ్కొని దేవయానకడకేగి మృదువచనంబులతో-అమ్మరో-నేపోయి వచ్చెదనని చెప్పుటయు నమ్మాటలు వినినమాత్రమున దేవయాని వెలవెలఁబోయి వాని విడువంజాలక దుఃఖింపుచునిట్లను. ఓయి, నీవు బ్రాహ్మణశ్రేష్ఠుడవు బ్రహ్మచారివి నేను కన్య

కను మనకిద్దరికిన్ని వివాహము కావడము సజ్జనసమ్మతముగానున్నది కాఁబట్టి మన్మథుని ప్రేరణవల్ల నేను ముందే నిన్ను పతిగాభావించినాను ఇకనీవృత్తాంతమును శుక్రున కెఱింగించి వారి యనుజ్ఞచేత సంజీవనితోడ నన్నున్ను పరిగ్రహించి నాకు సంతోషంబుఁజేయుము. అని పలుకుచున్న దానిమాటలువిని కచుండు మిక్కిలి వ్యసనముతో, ఓచెల్లెలా, నీవాక్కులో యిట్టిలోకనిందితమైనమాట చెప్పఁదగునా గురువులకు శిష్యులు పుత్రసమానులనునది మిక్కిలి గొప్పధర్మము లోకంబునందు పసిపిల్లలు మొదలుకొనియందరికిన్ని యీవిషయము చక్కఁగా తెలసేయున్నది. ఇట్లుండఁగా పరమ ధర్మజ్ఞులయిన శుక్రాచార్యులవారి కూతురున్ను నాకు గురుపుత్రియున్నైన నీవిట్టి ధర్మవిరుద్ధంబైనమాట చెప్పఁతగునా? అనిపలుకుచున్న యప్పుణ్యచరిత్రుని మాటలు వినినమాత్రమున దేవయాని మిక్కిలి కోపించి ఓయి నీవు నామనోరథంబు నిష్ఫలంబుచేసితివి కావున నీకు సంజీవని ఫలించక పోవునుగాక యనిశాపంబిచ్చుటయు నతండును ఓసీ నేను ధర్మమార్గంబునుఁదప్పకున్నాఁడ యిట్లున్ననాకు నీశాపంబు చేత సంజీవని ఫలింపకుండినను నాయొద్ద యుపదేశమునుఁబొందిన యితరులకైనను ఫలించునుగాక యని దానిశాపంబునకు బదులు నిబంధన యేర్పరచి యంతట నిలువక దాని యధర్మబుద్ధిని యాలోచించి మిక్కుటి క్రోధంబు హెచ్చిరాగా ఓసీ నీకు పుట్టినట్టి యీయధర్మబుద్ధివల్ల నిన్ను బ్రాహ్మణుఁడు వివాహము చేసుకొనక పోవునుగాకయని దేవయానికి ప్రతిశాపంబిచ్చి యచ్చోటువిడచి యతివేగంబున దేవలోకంబున కరిగి దేవతలకు సంజీవని నుపదేశించి దేవకార్యంబు నెరవేర్చెను.

అంత నిక్కడ దైత్యేశ్వరుండైన వృషపర్వునియొక్క కూతురు శర్మిష్ఠయను కన్యకామణి యొక్కనాడు తన చెలికత్తెలగు వేయిమంది కన్యకలు వెంటగొలిచిరాగా తనప్రియ సఖియగు దేవయానితోడ వనవిహారార్థంబు వెడలి యప్పట్టణంబునకు చేరువ మిక్కిలి రమణీయంబైన యొక్క వనంబుఁగాంచి యచ్చట నొక్క నిర్మల జలపూర్ణంబైన సరోవరంబుఁజూచి యందరున్ను దానియందు జలక్రీడ సేయందలంచి తమతమ కట్టియున్న వస్త్రంబులను విప్పి గట్టునపెట్టి జలక్రీడలాడుచుండగా ఆచీరలన్నియు సుడిగాలిచేత నొక్కటిగా కలసెను అట్టి యెడనక్కన్యకలందరున్ను కొలను వెలువడి యొకరినొకరు మించి పరుగులిడుచు వచ్చి యతిరభసంబుతోడ నొకదాని వస్త్రంబును మఱియొక్కతెయు దానిచీరను వేరొక్కతెయు నిట్లు చీరల గురుతులుకూడ కనిపెట్టక కట్టుకొనుచుండగా నట్టి రభసంబులో దేవయాన కట్టిన వస్త్రంబు శర్మిష్ఠకును శర్మిష్ఠవస్త్రంబు దేవయానకును చిక్కినవి. వాటిలో దేవయాన వస్త్రంబును శర్మిష్ఠ కట్టుకొనియెనుగాని దానివస్త్రంబును దేవయాని కట్టుకొనుట కసహ్యపడి శర్మిష్ఠనుఁజూచి ఓసీ నేను బ్రాహ్మణ కన్య

కను పరమ పుణ్యమూర్తియయిన శుక్రాచార్యులకు కూతురను నీచేతఁ బూజింపఁబడునంతటి దానను యిట్టినేను నీవు కట్టివిడచిన మైలచీరను కట్టుదునా అనుటయు శర్మిష్ఠ యిట్లను ఓసీ మీయయ్య యెల్లప్పుడున్ను మాయయ్యకు పనులుచేయుచు సేవించుచు ప్రియమైన మాటలాడుచు ఆశ్రయించి జీవించుచుండగా నీప్రభావము నీలాగున గొప్పగాఁ జెప్పుకొనుటకు నీకు సిగ్గుకూడా లేదా నేను కట్టునంతటి పట్టువస్త్రంబును నీకు గట్టఁగూడదకేమి అని గర్వంబుతోడ హీనవాక్యంబులు పలికి నిందించి దేవయాన నొక్కబావిలో పడద్రోసి తనచెలులు వేయిమందితోడ మరలి పట్టణంబు ప్రవేశించి తనయంతఃపురంబున నుండెను.

అంతనక్కడ దేవయాన బావిలోపడియుండగా ముందుఁజెప్పఁబడిన నహుష మహారాజేంద్రుని కుమారుడగు యయాతిమహారాజు తనపగవారలందరున్ను పాదసేవ కులగునట్టి మహామహిమతోడ రాజ్యపరిపాలనంబుఁ జేయుచుండి వేటాడవలయునని కుతూహలముచేత విల్లునమ్ములు చేత ధరియించి యాయడవికివచ్చి కడకున్ను సంచారముఁజేసి మిక్కిలి యలసి జలము నపేక్షించి యిట్టట్టు వెదకుచు దేవయాన పడియున్న బావిగట్టున చల్లని వనంబుగా నుండుటవల్ల నచ్చటికి వచ్చిచేరి కొంత యలసటఁదీర్చుకొని యాబావియొక్క నలుదిక్కులున్ను వేడుకతోఁ జూచుచుండగా నందు గట్టుచుట్టు ప్రదేశములనుండి అల్లుతూవచ్చి బావిలోపలికి దిగఁజారి యల్లియుండునట్టి ఘనమైన తీగెలను పట్టుకొని యుండునదియు కన్నీరు కాలువలై దొరుగునట్లుగా నేడ్చుచుండునదియు తన సమీపంబున కెవ్వరైనను వత్తురాయని యెదురుచూచుచుండు నదియునైయున్న దేవయానింగని దాని సౌందర్యాతిశయంబువల్ల నిది వరుణదేవునియందుగల మిక్కిలి కోపంబువల్ల జలంబునందు వసియింపనొల్లక భూతలంబునకు రావలయునని నీళ్లనుంచి పైకి యెగబడుచుండు వరుణదేవుని భార్యగా నుండవచ్చునని యాశ్చర్యమందుచు నీవెవ్వరిదాన విట్లేల నొంటిగా నీయరణ్యమందున్న బావిలో పడియున్నావు అని యడిగిననదియు నింతకు మునుపున్ను తాము వనవిహారంబుఁజేయుచున్న యవ్వనంబున కప్పుడప్పుడు యయాతి మహారాజు వేటాడు వేడుకను గాను వచ్చుటంజేసి యతని నెఱింగినదై యిట్లను.

ఓ రాజేంద్రుడా వినుము నేను దేవాసుర యుద్ధములయందు చచ్చినట్టి దైత్యులనెల్ల తన సంజీవనీ విద్యచేత బ్రతికించునట్టి మహామహిమగల శుక్రాచార్యుల కూతురను దేవయాని యనుదానను ఏమరుపాటువల్ల నిట్టి బావిలోపడి వెలువడ నేరకున్నదాన నన్ను వెలుపలికిఁదీసి రక్షింపుమనుటయు సర్వ ప్రాణులయందున్ను నిష్కారణముగా దయచేయునట్టి యారాజశ్రేష్ఠుడు ఆచిన్నది బ్రాహ్మణ కన్యక

యగుటవల్ల మిక్కిలి కరుణించి చతుస్సముద్ర మధ్యభూమండలమును భరించునట్టి మహిమతోడ నొప్పుచున్న తనకుడిచేతిచేత యద్దేవయానియొక్క చెమటనీళ్ల బిందువులతోడ నొప్పుచున్న సుందరమగు చేయిపట్టి యాబావివెలుపల దీసివిడచి తాను తనపట్టణంబున కరిగెను.

తరువాత దేవయానియు శర్మిష్ఠవల్ల కలిగిన యాపదనిట్లుగడచి తన్ను వెతకుచు వచ్చుచున్న ఘూర్ణికయనే దానిసెకత్తెను చూచి ఓసీ నేను వృషపర్వుని పట్టణంబును చొరనొల్ల శర్మిష్ఠచేత నేను పడినపాటును మా తండ్రికెఱింగింపుము వేవేగ పొమ్ము అని తాను శర్మిష్ఠచేతపడిన పాట్లెల్ల నెఱింగించుటయునదియు నతిత్వరితంబుగా నరిగి యావృత్తాంతంబంతయు సవిస్తారంబుగా శుక్రున కెఱుంగజేయగా నతండక్షణంబునవచ్చి కోపంబువల్ల కనుగ్రుడ్లుత్రిప్పుచు కన్నీరు నించుచున్న కూతురిని చూచి యిట్లను.

తల్లీ యిదియేల యింతకోపించియున్నావు తక్కువలేని దక్షిణలిచ్చి మిక్కిలి నియమముతో వెయ్యియజ్ఞములు చేసినవారికంటె కోపములేనివారు మిక్కిలి పెద్దలని పెద్దలు చెప్పుదురు మరియు నితరులు తనపైకోపించినను తాను కోపింపతగదు తనకు కీడగుమాటలుచెప్పినను విననియట్లుండవలయును తన్ను అవమానము చేసినా దానిని తలచనేకూడదు ఇట్టి గుణములు గలవారే ధర్మజ్ఞులనబడుదురు. కావున బుద్ధిమంతు లెప్పుడున్ను కోపింపదగదు మరియు శర్మిష్ఠరాచకూతురు పసిది దానితో నీకు విరోధంబేల రమ్ము అనుటయు దేవయాన యిట్లను.

తండ్రీ వినుము లోకంబునందు హీనజనులు తమయందు మిక్కిలి ప్రీతికలిగి మిక్కిలి యుత్సాహముతో తమపనులను కావించుచున్న హితజనులనుకూడా నిరాకరింతురు అట్లు నిరాకరించు వేళలలో తమయొక్క యవివేకమువల్ల వారినేర్పును కూడా మెచ్చరు కావున బుద్ధిమంతులకట్టి వారియొద్ద నుండుటకంటె హీనవృత్తి మరియొకటికద్దా ఈవృషపర్వుని పురంబేను చొరనొల్లయొక్కడికైనను పోయెదను అనినవిని శుక్రుండు తనకు కూతురియందుగల మిక్కిలి ప్రేమచేత దాని బాయజాలక తల్లీ నాకు నీవేగతివి నిన్ను విడచియుండజాలను నీవెక్కడికిపోయినా నీవెంట యిదిగో నేనున్ను వచ్చెదను అని తనముద్దుకూతురి నొడంబరుచుచుండెను.

అంతలోవృషపర్వుడంత వృత్తాంతమునున్ను తనచారులవల్లనెఱింగి శుక్రునొద్దకువచ్చినమస్కరించి స్వామీ మీయొక్క సంజీవనీ మహత్వంబుచేత నేగదా దానవులు దేవతలను జయించుచు స్థిరమైన వైభవంబుకలిగి వర్థిల్లుచున్నవారు అట్లుగాకుండెనేని

యమునివంటి కోపముగల యాదేవసేనానాయకులు ప్రయోగించినట్టి వాడిగల మహాయుధంబుల దెబ్బల కోర్వజాలక సముద్రంబులోజొచ్చి పాతాళంబునందణగిపోరా కాబట్టి మాయొక్క చతురంగబలములు బొక్కసము మొదలుగాగల మాయందఱున్ను మీమూలకంబుగా వృద్ధిబొందిన వారమేగాని వేరేకాదని నిశ్చయింపుడు ఈదేవయానికేమియిష్టమో దానినేనిచ్చెద నాజ్ఞాపింపుడు అని విన్నవించుచుండగా దేవయాని యమ్మాటలువిని సంతోషంబునొంది ఓరాజశ్రేష్ఠుడా అట్లయితే శర్మిష్ఠను దానిచెలులు వేయిమందితోడ నాకు దాసిగానిమ్ము ఇదే నాకిష్టము అనుటయు వృషపర్వుండాక్షణంబున కూతురిని రావించి వేయిమంది కన్యకలతోకూడా దేవయానికి దాసిగానిచ్చి శుక్రుని మనస్సుకు ప్రియముచేసెను శర్మిష్ఠయు తనతండ్రియొక్క యాజ్ఞను జవదాటక తనచెలులుందానును నిత్యంబు నద్దేవయానిని కొలుచుచుండెను.

ఇట్లు కొన్నిదినంబులైనవెనుక నొక్కనాడు దేవయాన తన్ను శర్మిష్ఠ మొదలుగాగల చెలులెల్లగొలుచుచుండగా మహావైభవంబుతోడ వనవిహారార్థంబుగా మున్ను తానుబావిలోపడిన వనమునకరిగి పుష్పములుకోయుచు నిర్మల జలప్రవాహంబుతో నొప్పుచున్న యొక్క సెలయేటిసమీపంబున అప్పుడు వికసింపుచున్న పుష్పగుత్తులు నిండియున్న వృక్షములయొక్క దట్టమైన చల్లని నీడయందు రమ్యంబైన యిసుకదిన్నెచేరి యిష్టవినోదంబులతోడ నుండునంత నక్కన్యకలు పూసుకొనియుండు సుగంధ చందనములయొక్కయు వారలు ధరియించియుండు పుష్పములయొక్కయు వారలు కట్టుకొనియుండు వస్త్రములకు వాసనకట్టుటకై వేసినట్టి ధూపములయొక్కయు వారలు వేసుకొనుచుండు పచ్చకర్పూరము చేర్చిన తాంబూలములయొక్కయు దివ్యపరిమళములతోడ కలసిన మందమారుత మవ్వనమంతయు పరిమళపూర్ణముగునట్లు వీచుచుండెను.

ఇట్లుండగా నొప్పటివలె వేటాడుటకై యవ్వనంబునకు వచ్చియున్న యయాతిమహారాజు వేటాడి యలసి తిరుగుచుండి యాపరిమళంబు నాఘ్రాణించి యది యెచ్చటినుంచి వచ్చుచున్నదో కనిపెట్టవలయుననే కుతూహలంబుతో దాని గాలి వచ్చుజాడనుపట్టివచ్చుచు క్రమంబున నక్కన్యకలున్నచోటికి వచ్చిచేరెను అట్టియెడ నక్కన్యామణులు నవమన్మథాకారుండైన యారాజచంద్రుని మిక్కిలి ప్రీతితోడజూచుచు. అప్పుడు విడుగుచున్న పుష్పములచేత హారములు భుజకీర్తులు కిరీటము మొదలయిన యాభరణములుచేసి వాటి నారాజునకు కానుకలుగానిచ్చిరి అంతట నాతండును కొంతప్రొద్దు సుఖముగా కూర్చుండి యక్కన్యకలలో దేవయానిని తానుముందే యెఱింగినవాడై యుండియు మిక్కిలి రూపలావణ్యములతో

నొప్పుచున్న శర్మిష్ఠనుచూచి దీనివెఱుంగవలయునని కోరి వారలఁజూచి మీరెవ్వరి వారలు మీకులగోత్రనామంబు లెఱుంగవలయుఁ జెప్పుడనిన యారాజునకు దేవయాని యిట్లను.

ఓరాజశ్రేష్ఠుఁడా నన్ను మున్నే యెఱుంగుదువుగదా ఇక్కన్యకనాకు దాసి వృషపర్వుఁడను దానవేంద్రునికూతురు యెల్లప్పుడున్ను నాయొద్దనేయుండును దీనిపేరు శర్మిష్ఠయని చెప్పుదురు అది యట్లుండనిమ్ము మున్ను మీరు నన్ను బావినుంచి వెలువఁదీసిననాడు సూర్యుఁడు సాక్షియై చూచుచుండఁగా మీకుడిచేతిచేత నాకుడిచెయ్యి పట్టితిరి కావున నన్ను మున్నే పాణిగ్రహణంబు చేసినారుగదా దాని నిప్పుడు మఱచిపోవుటన్యాయము ఇక నన్ను యథావిధిగా వివాహంబుచేసుకొని దేవతాస్త్రీలతో సమానమయిన సౌందర్యముగల యిక్కన్నియలందఱున్ను మీకు ప్రీతిఁజేయుచుండఁగా దేవభోగముల ననుభవించునట్టి దేవేంద్రునివలె ఈభూలోకమునందుఁగల సమస్తభోగములనున్ను అనుభవింపుడు.

అనుటయు యయాతియిట్లను క్షత్రియకన్యకలను బ్రాహ్మణులు వివాహంబు చేసుకొనవచ్చునేగాని యిట్లు ధర్మమునుచేఁబట్టి బ్రాహ్మణకన్యకలను క్షత్రియులు వివాహము చేసుకొనఁదగునా? నీమాటలు ధర్మమునకు విరోధములుమఱియు సమస్తములైన వర్ణాశ్రమ ధర్మములనున్ను సంకరంబుగాకుండ రక్షించునట్టి నేనేయిట్టి యధర్మంబున కొడంబడితినేని లోకాచారములన్నియు తలక్రిందౌను అనిపలుకు నయ్యయాతికి దేవయాని యిట్లను.

ఓరాజా సమస్తధర్మాధర్మంబులను నిర్ణయించుటకు తానే ముఖ్యకర్తగా జగత్ప్రసిద్ధిఁబడసి సకలలోకపూజ్యుఁడైయుండు మాతండ్రి మీకాజ్ఞాపించెనేని నన్ను వివాహము చేసుకొనియెదరా అనుటయు యయాతి యమ్మహానుభావుడువచ్చి యిది ధర్మవిరుద్ధంబుకాదని చెప్పెనేని నేను నిన్ను వివాహంబు చేసుకొనియెదనని యొడంబడియె.

అంతనక్షణంబున దేవయాని శుక్రుని పిలువనంపిన నతండును తనయొక్క దివ్యతేజస్సుచేత నవ్వనమంతయుఁ బ్రకాశింపఁజేయుచు తనకూతురికి ప్రియంబుఁజేయుటకై వచ్చుచుండ యయాతియు నమ్మహాత్ముని కెదురేగి యత్యంతభక్తితోడ సాష్టాంగదండప్రణామంబాచరించెను తరువాత దేవయానయు శర్మిష్ఠయు దాని వేయిమంది చెలులున్ను క్రమంబుగా నొకరివెంటనొకరు మిక్కిలి భక్తితోడ నమస్కరించిరి అప్పుడు దేవయాని శుక్రున కిట్లను.

తండ్రీ నేను బావిలోఁబడినప్పుడు నన్నుద్ధరించినవాఁడీరాజచంద్రుఁడు కాఁబట్టి యట్లు బావినుండి యెత్తునప్పుడీరాజుచేత పాణిగ్రహణంబు చేయఁబడిన నాచేతిని యికమీఁద నితరులు పాణిగ్రహణంబు సేయతగునా కావున నాకీజన్మంబునందీ యయాతిరాజేంద్రుఁడేపతిగానుండఁదగును. ఇతఁడును మీయనుజ్ఞఁబొంది నన్ను వివాహంబు చేసుకొనియెదనని చెప్పెను మీరీవివాహమునందు ధర్మవిరోధములేదని యాజ్ఞ దయచేయవలయును.

అనినవిని శుక్రుండు కూతురియందుఁ దనకుఁగలప్రీతిచేతఁ గరుణించి నీకున్ను యయాతికిన్ని జరిగినట్టి యీవివాహమునందు. అక్రమదోషంబు లేకుండునుగాకయని వరంబిచ్చి వారలిద్దరికిన్ని పరమోత్సవంబుగా వివాహంబుఁజేసి యనంతరంబున యయాతికి శర్మిష్ఠంజూపి యిది వృషపర్వునికూతురు దీనికి ప్రీతితోడ అన్నపాన భూషణవస్త్ర మాల్యగంధాదులగు సమస్తభోగంబులున్ను యిచ్చి సంతోషింపఁజేయుము సంభోగ మొక్కటిమాత్రము పరిహరించుము అని యాజ్ఞాపించి కూతురినిన్ని యల్లునిన్ని యనేక వస్త్రాభరణాదులచేత మన్ననచేసెను.

తరువాత యయాతిమహారాజు శుక్రుని వీడ్కొని దేవయానిని శర్మిష్ఠనుం గన్యకాసహస్రంబునుందోడ్కొని తన పట్టణంబునకరిగి యంతఃపురంబునందు రమ్యంబగు మేడలో దేవయానినిన్ని దానియొక్క సమ్మతిప్రకారముగా నశోకవనముయొక్క సమీపమందొక్క గృహంబున వేయిమందికన్యకలతోడ శర్మిష్ఠనున్ను వుంచి దేవయానియందభీష్టోపభోగంబుల ననుభవింపుచున్నంతఁ గొంతకాలంబునకు దేవయానికి యదు దుర్వసులని యిద్దరు కొడుకులుపుట్టిరి.

అంతలో శర్మిష్ఠకు యౌవనంబువచ్చి ఋతుమతియై తనమనంబునఁ బరితాపముఁబొందుచు నిట్లనుకొనెను అతిరమణీయంబైన యీ నాయౌవనమెవ్వరికిన్ని నుపయోగముకాకనే పోవునేమో నాకు పతి దొరకనందుచేత నేను పుష్పవతికావడ మగోచరమయిన యొక గొప్పయడవిలో నొక్కరమణీయంబగు తీగె పుష్పించినట్లుగానే యగునేమో ఈదేవయాని యేమి తపంబుఁజేసి యింతమంచిపతినిఁ బడసెనో లోకంబునందు స్త్రీలందరు నుత్తముఁడైన పతినిఁబడసి పుత్రులఁబడయవలయునని కోరుదురు ఇట్టి కోరికలుమాత్రమేగాని యామేరకందరికిన్ని లభించుట దుర్లభము ఈదేవయానిమాత్రము తాను కోరినమేరకు పతినిఁబడసి పుత్రులనున్ను పడసెను కాఁబట్టి లోకంబునందుఁగల స్త్రీలెవ్వరున్ను భాగ్యసంపదలో దేవయానికి సమానముకానేరరు మరియు నీరాజునందు నామనసెప్పుడున్ను కోరికగలదిగానున్నది

ఈతడున్ను మిక్కిలి కారుణ్యముతోడ నాయందు ప్రీతిగలవానివలె నన్ను జూచుచున్నాడు కాఁబట్టి దేవయాన యీతని యేలాగు తానేకోరి పతిగాఁజేసుకొనియెనో అట్లనే నేనున్ను అఖండమండలాధిపతియైన యీరాజచంద్రుని నేనేకోరి పతిఁజేసుకొనియెదను అనియిట్లు శర్మిష్ఠ తలపోసుకొనుచుండఁగా నొక్కనాడు దానియదృష్టము ఫలించివచ్చినట్లుగా యయాతి మహారాజయ్యశోకవనంబు జూచుటకై వచ్చుచునచ్చట నొంటిగానున్న శర్మిష్ఠను జూచిననదియు మిక్కిలి సంతోషంబునొంది వినయంబుతోడమ్రొక్కి యారాజుయొక్క ముఖభావంబుచేత తనయందతనికి మిక్కిలి కనికరంబు కలిగియున్నదని యెఱింగి చేతులుమోడ్చుకొని యిట్లను.

స్వామీ మీరు మాయేలికసానియైన దేవయానికి పెనిమిటిగా నుండుటవల్ల నాకున్ను మీరే పెనిమిటియగుట ధర్మమార్గము భార్య దాసి పుత్రిలు అనునివి పురుషునికి గుటుంబమనునిది పరమధర్మమని పెద్దలు నిశ్చయించేయున్నారుగదా మఱియు నద్దేవయానిని పరిగ్రహించినప్పుడే దానిసొమ్మయిన నేనున్ను మీచేత బరిగ్రహింపఁబడినాను కావున నాయందు కరుణించి నాకు ఋతుకాలోచితంబైన గర్భాధానంబు దయచేయవలయుననుటయు నయ్యయాతియిట్లను.

ఓ మోహనాంగీ నేను దేవయానిని వివాహముచేసుకొనునపుడు శుక్రాచార్యులు నాకు నిన్నుఁజూపి దీనికి సంభోగమొక్కటితప్ప తక్కిన భోగములు దేనియందున్ను కొదువలేకయిచ్చి సంతోషపరుచుచుండుమని యాజ్ఞాపించెను నేనమ్మహాముని మాటలకప్పుడు సమ్మతించితిని ఇప్పుడమ్మాటతప్పి యసత్యదోషంబునకెట్లుపాత్రమగుదును అనినవిని శర్మిష్ఠ యిట్లను.

స్వామీ॥ ఆ: వె: వారిజాక్షులందు వైవాహికమునందు
ప్రాణవిత్తమాన భంగమందు
చకితగోకులాగ్ర జన్మరక్షణమందు
బొంకవలయునఘము బొందదధిప॥

కం॥ చనుబొంకఁగఁ బ్రాణవ్యయ
మునసర్వధనాపహరణ మునవధగావ
చ్చినవిప్రార్థమునగవా
శనయానంబుల వివాహసమయములందున్॥

వివాహ కాలములయందున్ను సర్వధనమున్ను కొల్లపోవునట్టిసమయమునందున్ను ప్రాణహాని కలుగునంతటి సమయమునందున్ను బ్రాహ్మణ సంరక్షణసమయమునందున్ను గోవులు మేయుచున్న మేపుకు భంగము కలుగునట్టి సమయమునందున్ను గోవులభీతియందున్ను స్త్రీల సల్లాపములందున్ను మానహానియందున్ను ఆయా సమయములకు తగినంత యసత్యంబుపలికినా వీటియందసత్యదోషంబులేదని మునివచనప్రమాణంబుగలదు మీరు వివాహసమయమునందు శుక్రుని యాజ్ఞకొడంబడితిరి కావున నిట్టియొడంబడికను తప్పిపోయిన మాత్రమున మీకసత్యదోషంబు కలుగదు అనినవిని యయాతి దానిమాటలకొడంబడి దానితోడ యిష్టవినోదంబుల మదనకేళి సుఖంబుననుభవించిదాని కోరికె నెరవేర్చెను.

తరువాత కొన్నిదినంబులకారాజువల్ల శర్మిష్ఠ గర్భమునుధరియించి కొడుకునుఁగనుటయు తద్వృత్తాంతంబంతయు దేవయాని వినియాశ్చర్యంబునొంది దానియొద్దికి వచ్చి యిట్లను. ఓ చెలియా నీవు వయస్సులో పసిదిగానుండినా ఉత్తమమైన నడవడికె, వినయంబు, గొప్పతనము, యిట్టి గుణములుకలిగి కొంచమైనను మనశ్చాంచల్యము లేనిదైయున్నావు యిట్టినీకు పుత్రుడుకలుగుట మిక్కిలి చోద్యముగానున్నది దీనికి కారణంబేమో తెలియజెప్పుమనుటయు శర్మిష్ఠ సిగ్గుచేత తలవంచుకొని యిట్లను ఎక్కడనుండియో సకల వేదవేదాంగములనున్ను సంపూర్ణముగా జదివినట్టి యొక్కమునీశ్వరుండువచ్చి ఋతుమతినైయున్న నన్నుజూచి నాకుపుత్రోత్పత్తిని దయచేసెను అనుటయు దేవయాని దానిమాటలు సత్యముగా నమ్మితనయంతఃపురంబునకరిగెను.

శర్మిష్ఠయు రహస్యంబున నయ్యయాతితోడ నిష్టోపభోగంబులననుభవించుచు నాతనివలన క్రమంబుగా,

౧ ద్రుహ్యు.

౨ అను.

3 పూరు.

అనిపేర్లుగల ముగ్గురు కొడుకులను బడసెను.

ఇట్లు కొంతకాలము జరిగిన వెనుక నొక్కనాడుత్తమ రాజలక్షణంబులుగలిగి యధిక తేజస్సుతోడ వెలుంగుచు స్వర్ణరత్నాభరణాలంకృతులైయున్న యాశర్మిష్ఠ కొడుకులు యయాతియొద్ద నాటలాడుచుండగా నా సమయంబునందు శర్మిష్ఠయు వేయిమంది కన్యకలున్ను తోడరాగా మహా వైభవంబుతో నొప్పుచు దేవయాని యచ్చోటికివచ్చి యయాతియొక్క పోలిక కలిగి మిక్కిలి తేజస్సుతో వెలుగుచున్నయబ్బాలకులనుజూచి యిక్కుమారులెక్కడివారలెవ్వరి కొడుకులని యయాతి నడిగి యాతడుత్తరమే చెప్పకుండుటయు పిమ్మట నక్కుమారులనుచూచి మీ తల్లి

తండ్రులెవ్వరని యడిగిన వారు తమ చూపుడువ్రేళ్లతో యయాతిని తండ్రియనియు శర్మిష్ఠను తల్లియనియు చూపించిరి అదిచూచి శర్మిష్ఠయొక్క చెలులైన కన్యకలందఱున్ను మిక్కిలి సంతోషించిరి.

అట్టియెడ దేవయాని తన్నెఱుంగకుండ యయాతి శర్మిష్ఠయందు సంతానంబు బడసినాడని యప్పుడెఱింగి యతండు తనయందు మిక్కిలి ప్రీతిగలవానివలె నడుచుకొనుచు తన్ను వంచించి దానవరాజ పుత్రికకు చేసిన ప్రీతినిచూచి సహింపక యత్యంత కోపంబును దుఃఖంబును పైపైన నిండుకొనుచురాగా తత్‌క్షణంబున తన తండ్రి పాలికి వెడలుటయు యయాతి దానివెంటనే అనేక విధంబులుగా ప్రార్థించుచుచని ఓ కమలాక్షీ ఈ మాటను నా మామగారికిచెప్పనేల దానవరాజ పుత్రికను నేను పొందిచేసిన తప్పును మన్నించుము కామంబువల్ల నిట్లుచేసిన నాయందు కరుణించుము. స్త్రీలకు తండ్రిమాటవినుటకంటే పతిమాటవినవలసినది యత్యావశ్యకమైన ధర్మముకదా అని యిట్లు బహువిధంబులఁ బ్రార్థించెను. అప్పటికిన్ని ఆమూర్ఖురాలొడంబడక హఠంబుగా నేడ్చుచుచని తన తండ్రియొక్క పాదములపైఁబడి ప్రలాపించుచు నతనికిట్లను.

తండ్రీ ఈ రాజు అధర్మంబును చేపట్టుటవల్ల ధర్మంబును పాడుచేసి నన్ను వంచించి దానవరాజ పుత్రికయందు మోహముగలవాడై ముగ్గురు కొడుకులనుపడసి నాకవమానముచేసెను అనినవిని శుక్రుడు యయాతిపై మిక్కిలి కోపించి ఓయి నీవు యౌవన గర్వంబున మోహాంధుడవై నా కూతురికప్రియంబు చేసితివికావున ముసలివాడవగుమని శాపమిచ్చెను అంతట యయాతి శుక్రునకు మ్రొక్కి యిట్లను స్వామీ భార్య ఋతుమతియై గర్భము ధరియించుటకు యోగ్యమయిన ఋతుకాలమునందు పుత్రార్థముగా పతిని ప్రార్థించినప్పుడతడు దానికి ప్రతికూలుడై యా ఋతుకాలమును వ్యర్థముగా పోగొట్టెనేని యతనికి భ్రూణహత్యా దోషము (అనగా గర్భనాశము చేసినట్టి దోషము) కలుగునని పెద్దలు చెప్పుచున్నారుకావున నేనట్టి పాపమునకు భయపడి యా శర్మిష్ఠయొక్క ప్రార్థనమేరకు దానియందు సంతానంబు వడసితిని మీరు సర్వధర్మసూక్ష్మములను నెఱింగినట్టి మహాత్ములుగానుండియు నీవిషయంబునందు కోపింపతగునా నాకీ దేవయానియందు విషయోపభోగంబులనుభవించి తృప్తికాలేదు ముసలితనంబును భరింపఁజాలను అని విన్నవించుటయు శుక్రుండయ్యయాతియందు కరుణించి ఓ రాజా నీ ముసలితనమును నీ కొడుకులలో నొక్కనికిచ్చి వాని యౌవనమును నీవు తీసుకొని రాజ్యసుఖములనుభవించి నీకు విషయభోగములయందు తృప్తి కలిగినతరువాత మరల నీ ముసలితనమును నీవే తీసు

కొని వాని యౌవనంబును వానికిమ్ము ఈ నిబంధనకొడంబడి నీ ముసలితనమును తీసుకొనిన పుత్రుడే రాజ్యార్హుడున్ను వంశకర్తయున్ను అగును అని యనుగ్రహించుటయు యయాతి సంతోషించి శుక్రుని వీడ్కొని దేవయానీసహితుండై తనపట్టణంబునకు వచ్చెను.

తరువాత నతనికి శుక్రశాప ప్రకారంబుగా ముసలితనంబువచ్చుటయు తల వడవడ వడంకసాగెను. కన్నులు చెవులు మొదలగు నింద్రియములకు పాటవమణగి పోయెను. అంగములన్నియు సడలెను దేహచర్మమందంతటనున్ను ముడతలుపడెను. వెంట్రుకలు నరిసెను పొడిపొడిదగ్గు వుబ్బసము తలసూపి ఇవి ప్రారంభించెను. ఇట్లసహ్యంబైన ముసలితనంబు వచ్చుటయు యయాతి కొడుకులనెల్లరావించి పుత్రులారా వినుడు నాకు విషయసుఖానుభవంబునందు తృప్తికలుగలేదు కావున మీలో నొక్కడు నా ముసలితనంబును తీసుకొని తనయౌవనంబును నాకివ్వవలయుననినవిని యదు, దుర్వసు, ద్రుహ్యు, అను, అనే నలువురున్ను తండ్రికిట్లనిరి.

తండ్రీ యివియెక్కడివెఱ్ఱిమాటలు లోకమునందెవ్వరైనను ముసలితనము రోగము అనే ఈ రెండున్ను దైవవశంబున తమకే సంభవించినప్పుడుమాత్రమనుభవించుదురుగాని యెఱిగియెఱిగి యిట్టి సంకటములను యెంతటి బుద్ధిహీనులైనా యితరులయొద్దినుంచి తీసుకొందురా? మఱియును మన్మథునివంటి సౌందర్యముగలపురుషుడైనా ముసలితనమును పొందెనేని వానిని చూడగానే స్త్రీలసహ్యపడుదురు ఎంత ధనవంతుడైనా ముసలితనమును పొందెనేని వానికి తాను కోరిన సుఖభోగములననుభవించునట్టి యోగ్యతలేకనేపోవును అని చెప్పుచు తనమాటలకొడంబడకున్న పుత్రులంజూచి యయాతి మిక్కిలి కోపించి వారలు నలుగురికిన్ని ప్రత్యేకముగా శాపమివ్వదలంచి అందు దేవయానకొడుకులైన యదు, దుర్వసు, వీరలిద్దరిలో యదు అనిపేరుగల పెద్దకొడుకుయొక్క వంశంబునందు పుట్టినవారు రాజ్యంబునకర్హులుగాకుందురుగాకయనియు.

రెండవ కొడుకైన దుర్వసు అనేవానియొక్క వంశంబునందుపుట్టినవారు ధర్మాధర్మ వివేకశూన్యులై (సంకీర్ణవర్ణ కిరాతదేశంబులకు) అనగా సంకరజాతి మనుష్యులు బోయవారు వీరలుండే దేశములకు రాజులగుదురుగాకయనియు.

శర్మిష్ఠ కొడుకులైన ద్రుహ్యు, అను, వీరలిద్దరిలో ద్రుహ్యు అని పేరుగల మొదటి కొడుకుయొక్క వంశమందు పుట్టినవారు నీళ్లుగాని నీళ్లుపడునట్టి ప్రదేశముగాని లేనిదేశంబులకు రాజులగుదురుగాక యనియు.

అను, అని పేరుగల రెండవ కొడుకు పైఁజెప్పిన ముగ్గురికంటే ముఖ్యముగా ముసలితనమును దూషించినవాడు కావున వానియొక్క వంశమునందుపుట్టినవారు యౌవనంబునందే ౘత్తురుగాకయనియు ఘోరంబుగా శాపంబులిచ్చి.

తరువాత అన్నలుగురికంటే చిన్నవాడున్ను శర్మిష్ఠయొక్క మూడవకొడుకున్ను అయిన, పూరు, అని పేరుగల కడపటి పుత్రునింబిలిచి యిట్లను.

నాయనా నీవు వయస్సులో పిన్నవాడుగానుండినా బుద్ధివల్ల నందఱికంటే పెద్దవాడవు, వినయమే స్వభావముగా గలవాడున్ను నాకు ప్రియపుత్రుడున్ను అయిన నీవు మీ యన్నలుచెప్పినట్లుగా నడ్డగింపు మాటలుచెప్పి నామాటల నతిక్రమింపక నా ముసలితనంబును నీవు తీసుకొని నీ వయస్సును నాకిమ్ము అనుటయునతండు స్వభావంబుగా పెద్దలయందు భక్తిగలవాడు కాఁబట్టి మిక్కిలి వినయంబుతోడ తండ్రికిట్లను స్వామీ నన్నింతదూరము వేడుకొనవలయునా మీ యాజ్ఞనతిక్రమించియుండే నిమిత్తంబుగా మీకడ్డగింపుమాడలు చెప్పుటకు నేనన్యాయినా ఇదిగో యీక్షణంబున ప్రియంబుతోడ మీ ముసలితనంబును తీసుకొని నా యౌవనంబును మీకిచ్చెదను మరియు విన్నవించెదవినుడు తండ్రి యాజ్ఞాపించిన మాటలకడ్డంబుచెప్పి వివాదము చేయునట్టి పుత్రుడు కడుపులోపుట్టి మలద్వారమార్గముగా వెలుపలికి వచ్చినపురుగు వంటివాడు కాడా? అదియునుంగాక సద్గతి కావలయునని యపేక్షించువారడవుల వెంబడితిరిగి కాయలు గడ్డలు భక్షించి దేహమును యెండవానలయందు హింసపెట్టి మునివృత్తితోడ సంకటపడనేల తనతండ్రి యాజ్ఞాపించినమాటను జవదాటకుండా నడచుకొనిరేని అట్టిపుణ్య పురుషులకు సద్గతియనునది కొంగులోమూటకట్టుకొనియుండే బంగారువంటిది కాదా? మరియులోకంబునందు ఉత్తమపుత్రులు తమతండ్రి యాజ్ఞాపించుటకుముందే యతనికిష్టమైన కార్యములనభిప్రాయంబెరింగి చేయుదురు మధ్యమపుత్రులు తమతండ్రి యాజ్ఞాపించేవరకున్ను పూరకయుండి యతడాజ్ఞాపించినవెనుక నక్కార్యమునుపొందికగా చేయుదురు అధమ పుత్రులు తమతండ్రి తమ్మే కార్యనిర్వాహకులుగా కోరి పనిచెప్పినా పలుమాటికినడ్డగింపుమాటలే పలుకుదురు అని పలుకుచు ప్రీతిపూర్వకంబుగా తన యౌవనంబునతనికిచ్చి యతని ముసలితనంబును తాను తీసుకొనియెను.

తదనంతరంబునయయాతి సంప్రాప్తయౌవనుండై వేయిసంవత్సరములవరకున్ను ఇష్టసుఖంబులననుభవించి సంతుష్టుండై పూరుని యౌవనంబునతనికిచ్చి తనజరాభారంబును తానే తీసుకొని, తనయాజ్ఞను శిరసావహించునట్టివారై యఖండమహీమండల మంతటనున్ను వర్తింపుచుండు బ్రహ్మక్షత్రియాదులగు పెద్దమనుష్యుల

నెల్లరావించి మంత్రులు పురోహితులు సమీపదేశ రాజులు పట్టణమందుండుజనులు వీరల సమక్షంబునందఖండ మహీమండల సామ్రాజ్యంబునకు పూరుని పట్టాభిషిక్తుఁగాఁజేసినంజూచి దేశజనులందరున్ను ఆరాజునకిట్లనిరి.

ఓ మహారాజా నీవు సమస్తధర్మములనున్ను చక్కగా తెలిసినవాడవు కాఁబట్టి నీవు చేసినకార్యము, ఇదిధర్మమా అధర్మమా అని విచారించక చేయఁబడినదని చెప్పుటకు భయపడుచున్నాము. శుక్రాచార్యులకు దౌహిత్రుడున్ను నీకు జ్యేష్ఠపుత్రుడున్ను అయిన యీ యదువు మిక్కిలి పరాక్రమముగలవాడుగానున్ను ప్రభుత్వము చేయుటకు తగిన సామర్థ్యముగలవాడుగానున్ను ఈ రాజ్య పట్టాభిషేకమునకు పాత్రుడుగానున్ను లోక ప్రసిద్ధిగానుండ వానినివిడచి చిన్నకొడుకైన పూరునికి పట్టాభిషేకముచేయుట తగునా అనిననయ్యయాతి యిట్లను.

సజ్జనులారా వినుడు మీరు పలికినది యుక్తమే యదుడు ధర్మసంతానముగా పుట్టిన జ్యేష్ఠపుత్రుడైయుండినా నేను చెప్పినమాటను పితృవచనంబెట్టిదైనను అడ్డమాడక చేయడము తనకు పరమధర్మమని యెంచక నిరాకరించి దురహంకారముచేత నామాటమేరకు పనిచేయడమునుమాని నాకవమానంబుచేసెను లోకమందెచ్చటనైనను పుత్రుడైనవాడు తల్లితండ్రులు చెప్పినపనులు చేయకుండినను వారలమాటలువినకుండినను వానింబుత్రుడనఁదగునా? అట్టివాడు తండ్రిసొమ్ముకు బాధ్యుడగునా? ఈపూరుడు చిన్నవాడుగానుండినా తనయందు గలిగియుండు పెక్కుసద్గుణంబులచేత తక్కిన నా పుత్రులందరికంటే జ్యేష్ఠుడనతగినవాడుగానున్ను సుపుత్రుడుగానున్ను ఈభూమిని పరిపాలించుటకు తగినవాడుగానున్ను వున్నాడు మరియు నీతడు నేను కోరినకార్యమును చేసి రాజ్యమును తానే సంపాదించుకొన్నాడు. నా జరాభారంబునుఁ దాల్చిన పుత్రుడే రాజ్యార్హుఁడున్ను వంశకర్తయున్ను అగును శుక్రాచార్యులున్ను నాకిట్లనేయాజ్ఞాపించియున్నారు అనియిట్లు యయాతిమహారాజు తన రాజ్యంబునందుగల ప్రకృతి జనంబులు చెప్పిన యాక్షేపణలకు సమాధానవాక్యంలుపలికి యందరినిన్ని సమ్మతింపజేసి పూరునిరాజ్య పట్టాభిషేక మహోత్సవంబును సర్వజనసమ్మతంబును నిర్విఘ్నంబునుగా నెరవేర్చి యదు దుర్వసు మొదలగు తక్కినకొడుకులను సమీపభూములకు రాజులుగాఁజేసి తాను వేదవేదాంగ పారంగతులైన బ్రాహ్మణులతోడఁదపోవనంబునకరిగెను.

ఇట్టి మహిమగల యయాతిమహారాజుయొక్క ప్రభుత్వకాలంబునకు తరువాత శర్మిష్ఠయొక్క కడపటికొడుకైన పూరుడఖండమండలాధిపతియై రాజ్యంబునేలెను. వానికి కౌసల్యయను పేరుగల భార్యయందు,

జనమేజయుండను రాజు పుట్టె
అతనికి ప్రాచీనుడు పుట్టె
ప్రాచీనునకు శర్యాతి పుట్టె
వానికి సహంయాతి పుట్టె
అతనికి సార్వభౌముడు పుట్టె
సార్వభౌమునికి జయత్సేనుడు పుట్టె
జయత్సేనునకు సురాచీనుండు పుట్టె
వానికి మహాభౌముండు పుట్టె
మహాభౌమునకు అయుతానీకుడు పుట్టె
అతనికి అక్రోధనుడు పుట్టె
వానికి దేవాపి పుట్టె
దేవాపికి ఋచీకుడు పుట్టె
అతనికి ఋక్షుండు పుట్టె
వానికి మతివరుండు పుట్టె
మతివరునకు త్రసుండు పుట్టె
అతనికి ఇలుండు పుట్టె

ఆ యిలునకు దుష్యంత మహారాజు పుట్టి యపార వీర్య ధైర్య శౌర్యాది గుణంబులుగలవాడై ప్రసిద్ధిలో భూమండలము నేలెను. వానికి విశ్వామిత్రమహాముని యొక్క కూతురగు మిక్కిలి రూపలావణ్యంబులుగల శకుంతలయందు భరతుండు పుట్టి తండ్రికంటే మిక్కిలి యధికమైన ప్రభావముగలవాడై సామ్రాజ్యపట్టము నొందెను ఈ భరతునియొక్క ప్రఖ్యాతివల్లనే వీనివంశమునకు భరతవంశము భారత వంశము అని పేర్లుకలిగినది,

ఇట్టి భరతునకు హుతమన్యుడు పుట్టె
అతనికి అజామీఢుండు పుట్టె

ఆయ్యజామీఢునకు ముగ్గురు భార్యలుగలరు వారియందు నూటయిరువది నాలుగుమంది పుత్రులు పుట్టిరి వారిలో సంవరణుండనువాడు పెద్దవాడుకావున పట్టాభిషేకమును పొంది సూర్యుని కూతురైన తపతియను కన్యకను వివాహము చేసుకొనెను,

ఆ సంవరణునకు తపతియందు కురు అనే రాజుపుట్టె ఆ కురువుయొక్క ప్రఖ్యాతివల్ల నీ వంశంబువారికి కౌరవులని పేరుకలిగెను,

వానికి పరీక్షితుండనువాడు పుట్టె
ఆ పరీక్షితునకు భీమసేనుండనువాడుపుట్టె
అతనికి ప్రదీపుండను రాజు పుట్టె
ఆ ప్రదీపునకు ౧-దేవాపి
౨-శంతను
౩-బాహ్లీకులనగా ముగ్గురుకొడుకులు పుట్టిరి,

అందుదేవాపి బాల్యంబున దపోవనంబునకరుగుటయు శంతనుండు రాజయ్యె వానికి గంగాదేవియందు భీష్ముండు పుట్టి నిత్యబ్రహ్మచర్య వ్రతంబుపూనెను మరియు నాశంతను మహారాజుకు యోజనగంధియని ప్రసిద్ధురాలయిన సత్యవతియందు
౧-చిత్రాంగద
౨-విచిత్రవీర్యులని పేర్లుగల యిద్దరు కొడుకులు పుట్టిరి.

అందు చిత్రాంగదుండు తానే బలవంతుండని గర్వించి దేవగంధర్వాదులను లక్ష్యంబుచేయక యెదిరించుచుండినందుచేత చిత్రాంగదుండను పేరుగల యొక గంధర్వపతిచేత యుద్ధంబునందు మడిసెను,

తరువాత భీష్ముండు వాని తమ్ముండైన విచిత్రవీర్యునకు పట్టాభిషేకంబుచేసి కాశిరాజపుత్రికలైన అంబిక అంబాలిక అని పేర్లుగల కన్యకలనిద్దరిని తెచ్చి యతనికి వివాహంబు చేయుటయు నధికరూపలావణ్యవతులైన యక్కన్యామణులయం దెల్లప్పుడు నతండు కామోపభోగపరవశుండైయుండి, యందువల్ల క్షయరోగంబు సంభవించి మరణమొందెను.

అంతకుముందే వాని తండ్రియైన శంతనుమహారాజు స్వర్గంబునకరిగి యా శంతనుని భార్యయగు సత్యవతిమాత్రము దైవయత్నంబువల్ల పతితోడ సహగమనంబు చేయక బ్రతికియుండెను కావున నామె ఈ భరతవంశంబీలాగున నిలచిపోవుటకు మిక్కిలి దుఃఖించి తన కోడండ్రైన అంబిక అంబాలికలకు దేవరన్యాయంబున ధర్మ సంతానంబు దయచేయుమని తన ప్రథమ పుత్రుండైన వేదవ్యాసమునీంద్రునకాజ్ఞా పించుటయు నతని యనుగ్రహంబువల్ల నంబికయందు ధృతరాష్ట్రుడున్ను అంబాలిక యందు పాండురాజున్ను అంబికయొక్క పరిచారికయందు విదురుడున్ను పుట్టిరి,

అందు ధృతరాష్ట్రునకు గాంధారియందు దుర్యోధనాదులున్ను పాండురాజునకు కుంతీమాద్రులయందు పాండవులున్ను పుట్టిరి. ఇట్లు పూరునివంశంబునకు పౌరవవంశం బనియు కౌరవవంశంబనియు భారతవంశంబనియు భరతవంశంబనియుప్రసిద్ధికలిగెను,

యయాతిమహారాజుయొక్క రెండవ భార్యయగు శర్మిష్ఠకొడుకులలో రెండవ వాడైన అనువుయొక్క వంశంబునందు రోమపాదుండనురాజు పుట్టి సంతతిలేక దశరథమహారాజుయొక్క కూతురైన శాంతను తనకు కూతురుగా తీసుకొనిపెంచెను తరువాత కొంతకాలంబునకద్దేశంబునందనావృష్టి దోషంబుసంభవించుటయు ఆ దోష ముపరిహారమగుటకుగానారాజు విభండకముని పుత్రుండైన ఋశ్యశృంగమహామునిని రావించి తనకూతురగు శాంతనమ్మునికిచ్చి పెండ్లిచేసెను అటువెనుకనమ్మహాముని యను గ్రహంబువల్ల నారాజుకు చతురంగుండను కొడుకు పుట్టెను ఆవెనుక నా వంశంబు నందతిరథుండనువాడు పుట్టి, కుంతీదేవి కన్యకగానుండునప్పుడు ఆమెకు సూర్యుని వరంబువల్ల పుట్టి గంగా ప్రవాహంబునందనకు చిక్కినట్టి కర్ణునిదన కొడుకని భావించుకొని ప్రేమతోపెంచెను.

యయాతి మహారాజుయొక్క రెండవ భార్యయగు శర్మిష్ఠయొక్క కొడు కులలో మొదటివాడైన ద్రుహ్యునియొక్క వంశంబునందెనిమిదవ తరమున ప్రచేత సుండనువాడు పుట్టెను వానికి నూర్వురు కొడుకులు పుట్టి మ్లేచ్ఛదేశంబులకు రాజు లయిరి.

యయాతిమహారాజుయొక్క జ్యేష్ఠభార్యయగు దేవయాని కొడుకులలో మొదటివాడైన యదువుయొక్క వంశంబునందు శ్రీమన్నారాయణుండు కృష్ణ మూర్తిగా నవతరించెను.

ఇదివరకు పాలవ్యాకులమువారి వంశావళియందు

మొదటి భాగము సంపూర్ణము.



శ్రీ

పాలవ్యాకులమువారి వంశావళి రెండవభాగము.

———:o:———

దేవయాని కొడుకులలో ౨-వవాడైన దుర్వాసుని వంశము.

శ్రీ యయాతి మహారాజుయొక్క జ్యేష్ఠ భార్యయైన దేవయాన కొడుకులలో రెండవవాడైన దుర్వాసునకుపుట్టిన కొడుకులయందు పెద్దవాడు కాంచనాంభోధి.

వాని కొడుకులలో పెద్దవాడు కనకాంభోధి
,, రాజాంభోధి
,, రత్నాంభోధి
,, దేవాంభోధి
,, అంభోధిరాజు

మరియు నీ కాంచనాంభోధి మొదలగువారి తోడబుట్టినవారల వంశంబుల నంతంబులైయుండెను.

అంభోధిరాజు చరిత్రము.

ఇట్టి యంభోధిరాజొకనాడు తన మనస్సులో “పంచితంబులులేక పాతకం బులుపోవు” పాలు, నెయ్యి, మొదలగునవిలేక దేవకార్య పితృకార్యములు నడువ నేరవు. గోవులులేక లోకక్షేమంబు కలుగదు కాబట్టి యీ భూలోకంబునందు గోవులు మెండుగా కలుగునట్లు యత్నించెదనని యాలోచించి,

అంభోధిరాజు గోవులకుగాను తపస్సు చేయుట.

గోవుల కొండలో గజాశూలంబువేసి గజాశూలంబుమీద గాండీవంబుపెట్టి గాండీవంబుమీద శిరస్సుమోపి పదునాలుగేండ్లు పరమేశ్వరుని గురించి ఘోర తపంబాచరించి,

అంభోధిరాజుకు ఈశ్వరుడు ప్రత్యక్షమగుట.

యంతట సుప్రీతుండైన యీశ్వరుండు ప్రత్యక్షంబగుటయు నతని పాదంబులకు మ్రొక్కి నాకుపలువన్నెలుగలగోవులు మెండుగాకావలయునిమ్మని ప్రార్థించుటయు నా గౌరీవల్లభుండు ఓ యంభోధీ నీ తపంబునకు మెచ్చితిగావున నీవు కోరినట్లు గోవులనిచ్చెదను.

ఈశ్వరుడంభోధిరాజుకు గోవులు మేపవలసిన నేమంబులు చెప్పుట.

ఆ గోవులను నీవు మేపేటప్పుడుగాని మరి యొకరిచేత మేపించేటప్పుడు గాని పైడిసెలగోలచేతనే తోలవలసినది వెన్నెతోనే వేయవలసినది వెండియురి

త్రాడుతోనే ఆవును కట్టిపిండవలసినది. ఈ నియమంబులు తప్పకూడదని నేమించిన విని యయ్యంభోధియు స్వామీ నేనీనేమంబులలో నొక్కటి తప్పినా యీ భూలోకంబునందుండడములేదని విన్నవించి పరమేశ్వరుని పాదంబులంటిన నగౌరీ వల్లభుండు ఓయంభోధీ నీవు నీయింటికి పోవునప్పుడు వెనుకకు తిరిగిచూడక పొమ్మని వెనువెంట కామధేను వంశంబునందుపుట్టి దేవలోకంబునందుండే నానావర్ణములు గలగోవులు మెండుగావచ్చును తిరిగిచూచితివేని యెన్నిమార్లు తిరిగిచూచెదవో అన్ని వర్ణంబుల గోవులంతర్ధానములై పోవును అని నేమించుటయు నయ్యంభోధిరాజు పరమేశ్వరుని యాజ్ఞను శిరసావహించి తన నివాసస్థానమునకెదురై వచ్చుచుండెను.

అంభోధిరాజువెంట పలువన్నెల గోవులువచ్చుట.

అప్పుడు శివునియాజ్ఞ మేరకు, ఎఱ్ఱావులు, పసిడియావులు, కరియావులు, జన్నిమట్టియావులు, చంగటావులు, నల్లావులు, పాడావులు, బూదావులు, మొదలగు గోగణంబులు ఒక్కొక్కవర్ణమునకనేకసంఖ్యల గోవులుగా దేవలోకంబునుండి దిగివచ్చి యంభారవంబులును, హుంకారంబులును, గొరిజెలధ్వనులును, ఆకాశభూభాగంబులందంతటనున్ను నిండిమ్రోవగా నయ్యంభోధిరాజును వెంబడించి వచ్చుచుండెను.

అంభోధిరాజు గోవులశబ్దంబువిని మరలిచూడగా
పసిడియావులు మాయమైపోవుట.

అప్పుడతండు, వాటికోలాహలంబు చెవులుపట్టకూడనట్లుగావిని మనసుపట్టచాలక మరలి చూచుటయు తత్క్షణంబున పసిడియావులు భూమిలోనికి దిగఁబడిపోయెను, అప్పుడారాజు వాటిని పోనివ్వక నిలుపవలయునని కొమ్ములుపట్టిలేవనెత్తపోవగా కొమ్ములుమాత్రము చేతికివూడివచ్చినవేగాని యయ్యావులు నిలువకపోయెను.

అంభోధిరాజు ప్రాణత్యాగంబునకు యత్నించగా హరిహరాదులు వచ్చుట.

దానింజూచి యారాజు పసిడియావులు భూమిలో నిలువక పోయినవిగదా యని మిక్కిలి చింతపొంది శరీరత్యాగంబునకు యత్నించగా నతనికి గోవులయందుగల ప్రీతివిశేషంబునుచూచి హరిహరాదులుమెచ్చి ప్రత్యక్షమై యతనిమరణప్రయత్నమును వారించి అయ్యా భూలోకమందీవుండేవర్ణములగోవులేచాలును పసిడియావులు వలవదని నియమించిరి గనుకనే భూలోకమందు పసిడియావులులేకపోయెను.

హరిహరాదులంభోధిరాజుకు దీర్ఘాయుస్సున్ను బిరుదులున్ను యిచ్చుట.

మరియు నాదేవతలతనికనేక యుగములు బ్రతికియుండునట్టి యాయుస్సున్ను కుంచ, సెలగోల, విభూతి, రుద్రాక్షలు, కంచుతోళ్లు, అతనిచేతికి, ఊడివచ్చియుండు పసిడియావులకొమ్ములు, శంఖచక్రములు, వెండితిరుమణి, బంగారుతిరుచూర్ణము, ఇవి మొదలయిన యనేకబిరుదులున్ను ప్రసాదించి ఓ యంభోధీ నీవంశంబునకు యయాతి శాపమువల్లకలిగిననీచత్వమును పోఁగొట్టగల కొడుకులనిద్దరినిఁబడయుదువు గాక, మరియు వారలిరువురిచేత నీవంశము నిత్యాభివృద్ధిగా ప్రసిద్ధిపొందునుగాక, యని యాజ్ఞాపించి యద్దేవతలంతర్ధానంబునొందిరి.

తరువాత నయ్యంభోధిరాజు ప్రసన్నచిత్తుండై వారలయాజ్ఞమేరకు తనకు వారలయనుగ్రహంబువల్ల నివ్వబడిన గోవులను మేపుచు ననేకయుగములు జీవించియుండెను.

అంభోధిరాజు అప్సరస్త్రీనిచూచి మోహించుట.

ఇట్లుండగా, మహాత్ముండైన యయ్యంభోధిరాజొక్కనాడడవిలో గోవుల మేపుచుండగా నాకాశమార్గంబున విమానంబునందు కూర్చుండి పోవుచున్న యొక్క యప్సరస్త్రీనిచూచి దానిరూపలావణ్యంబులయందు మనసుతగిలి మదనపరవశుండై ధైర్యంబువదలి స్ఖలితేంద్రియుండగుటయు నాతని యింద్రియంబొకచోట లేతపచ్చికలయందు పడెను.

జింక అంభోధిరాజు శుక్లంబును మ్రింగి గర్భిణియై బిడ్డనుకనుట.

అప్పుడొక యాడుజింక దైవవశంబున నచ్చోటికివచ్చి యాపచ్చికలను శుక్లంబుతోకూడామేసి గర్భంబుదాల్చి ప్రసవకాలంబగుటయు నయ్యడవిలో నొకచోట ప్రసవించి యా జింకతనంతట వెడలిపోయెను.

జింక కడుపులో పుట్టిన, అంభోధిరాజపుత్రునికి ఋశ్యశృంగుండని
పేరుపెట్టి విభండకముని పెంచుట.

అంతనాశిశువు రక్షకులులేక నయ్యడవినడుమ యాకలికోర్వక యేడ్చుచుండగా దైవవశంబున నచ్చోటికి సమిత్కుశాహరణార్థియై విభాండకమునివచ్చి యా బాలకుని రోదనంబువిని దగ్గరకువచ్చిచూచి మిక్కిలి దయతో నాశిశువును యెత్తుకొనిపోయి తనయాశ్రమంబున పెట్టుకొని సంరక్షణచేయుచు నాశిశువుయొక్క శిరస్సుమీద జింక కొమ్మొక్కటియుండిన కారణమువల్ల నతనికి ఋశ్యశృంగుండని పేరుపెట్టి పోషింపుచుండ నాబాలుడు తల్లిముఖమునుకూడా గురుతెరుంగనివాడు గనుక స్త్రీ పురుష భేదజ్ఞానమే యెఱుంగక తండ్రియొద్ద శుశ్రూషయు తపస్సున్ను తప్ప వేరే, యేపనిన్ని తెలియనివాడై విభండకపుత్రుండనిపించుకొని మహామునియై వర్థిల్లుచుండెను.

అంభోధిరాజుకు వృషపర్వుడను కొమారుడు పుట్టుట.

మఱియు నయ్యంభోధిరాజుకు సరసయను భార్యయందు వృషపర్వుడనే కొడుకు కలిగి వాడున్ను దినదిన ప్రవర్ధమానుండైయుండెను.

నారదముని బోధనవల్ల అంభోధిరాజపుత్రులు జమదగ్ని నాశ్రయించుట.

అంతనొక్కనాడు నారదముని సదాశివునిచేత నాజ్ఞాపింపఁబడి వృషపర్వుని సమీపంబునకేతెంచి, ఓ వృషపర్వుడా మీయన్న మునివృత్తితో నడవిలోనేకాంతముగా పెరుగుచున్నాడు మీరిద్దరు నొకటిగాచేరి యసాధ్యమైన కార్యమును సాధించవలసియున్నది గనుక రమ్ముపోదామని వృషపర్వుని వెంటఁబెట్టుకొనివచ్చి ఋశ్యశృంగునాతనికిఁజూపి ఋశ్యశృంగునికిన్ని యీ వృషపర్వుడు నీకు తమ్ముడని చెప్పిచూపి ఋశ్యశృంగుని జన్మవృత్తాంతమునుపన్యసించి అన్నలారా మీరిద్దరున్ను జమదగ్నిమహాముని నాశ్రయించి మీకులంబునకు సంభవించియుండే యయాతి శాపంబును పరిహరించగలవారలని సదాశివుని యాజ్ఞయైయున్నది అచ్చటికిపొండని చెప్పి నారదమహాముని చనినతరువాత నాయన్నదమ్ములిద్దరున్ను ఆమ్మహామునియాజ్ఞ మేరకచ్చటినుంచివెడలి పాలకొలనిగట్టున తపస్సుచేయుచున్న జమదగ్ని మహాముని నాశ్రయించి కొన్నిదినంబులు శుశ్రూషచేసి యతనికి తమయందనుగ్రహంబు కలుగునట్లుగా చేసుకొనుటయు నమ్మునివరుండు వారలయందు మిక్కిలి ప్రీతిగలవాడై మీకేమికావలయుననియడుగగా వారలు స్వామీ మావంశంబును యయాతిశాపంబు నుంచి యుద్ధరించవలయునని ప్రార్థించిన నమ్మునియు అన్నలారా యిదికష్టసాధ్యమైన వరము, మమ్ముమీకులగురువులుగా పెట్టుకొంటిరేని యీకార్యమును సమయమువచ్చి నప్పుడు నెరవేర్చుచున్నానుని సెలవిచ్చిరి. అందుకు వీరలిరువురున్ను సమ్మతించి యమ్మునివరునే గురువుగా నాశ్రయించుకొనియుండగా.

జమదగ్నియొక్క యిఱ్ఱికామధేనువులు కార్తవీర్యార్జునుని యుద్యానవనంబు చెరచుట.

కొన్నిదినంబులు గడచినవెనుక నా జమదగ్నియొక్క హోమసాధనంబైన కామధేనువు, ఇఱ్ఱిపోతు, ఈ రెండున్ను చక్రవర్తియైన కార్తవీర్యార్జునునియొక్క యుద్యానవనంబునందు ప్రతి దినంబును రాత్రికాలంబులందు నవసురభిదివ్యపుష్పల తానికుంజాదులనుమేసి కూరాడసాగెను.

అంతట కార్తవీర్యార్జునుడుకోపించి యేజంతువులు నిత్యమున్ను మనయుద్యానవనమును చూరబుచ్చుచున్నవో వాటిని చూచిపట్టుమని తలవరుల కాజ్ఞాపించెను.

పిమ్మట వారు రాత్రికాలమందుద్యానవనమునందు కావలియుండి యా యిఱ్ఱి కామధేనువులు రెండున్ను రాగానేచూచి పట్టఁబోయిన నవి వాయువేగముతో పరుగెత్తిపోయెను. ఈ ప్రకారముగా మూడు నాలుగు రాత్రులుచూచి వారలు పట్టలేక కార్తవీర్యునిపాలికివచ్చి యీ వృత్తాంతమును చెప్పిననతడు.

కార్తవీర్యార్జునుడు వేటబోయి జమదగ్ని యాశ్రమంబునకు వచ్చుట.

మహాకోపముతోడ చతురంగ బలములఁగూర్చుకొని వేటాడి వాటినిఁబట్టవల యునని పూని యుద్యాన వనమునుంచి యరిపోయిన జాడలవెంబడితగిలి యడవు లందంతట తిరిగితిరిగి గాలి యెండ మొదలగువాటివల్లనలసి యాకలిదప్పులవల్ల బడలిక పడుచుండగా నప్పుడు కార్యవిశేషార్థంబుగా సదాశివునిచేత నాజ్ఞాపింపఁబడిన వరుణుండు, వాడువచ్చు మార్గాంబులందున్న జలంబులనెల్ల మాయముచేయుటవల్ల నెచ్చటనున్ను నీళ్లుగానకఁదిరుగుచు దైవవశంబున జమదగ్నియాశ్రమంబు దగ్గరకు వచ్చి నీళ్లుండుచోటు తెలుసుకొనుటకుగాను జోణంగులను నీరుగాలికి విడువగా నవి జమదగ్ని యాశ్రమముననున్న పాలకొలనుచేరెను అంత నాదోవపట్టుకొని కార్త వీర్యుండు తనపరివారములతోకూడా పాలకొలనుచేరి దాని తీరంబున జమదగ్ని మహామునింగనుంగొని సాష్టాంగదండప్రణామంబుచేసి యాతనిచేత యథావిధిగా పూజింపఁబడినవాడై యొకరినొకరు కుశలప్రశ్నంబులుచేసికొనగానే.

జమదగ్ని మహాముని కార్తవీర్యునికి విందుచేయుట.

జమదగ్ని యా రాజునుచూచి అయ్యా రాజశ్రేష్ఠుడా మేము నీకున్ను నీ పరివారమునకున్ను విందుచేయుచున్నాము దాని నంగీకరించవలయుననుటయు నతండు దానికి సమ్మతించెను.

తరువాత నా జమదగ్ని తన హోమసాధనంబైన కామధేనువునున్ను యిఱ్ఱి నిన్ని పిలచి యీ రాజుకున్ను యీతని పరివారములకున్ను మృష్టాన్నభోజనంబుగా విందుచేయుడని యాజ్ఞాపించుటయు నవి వారలు కోరినట్లెల్ల భోజనంబులును దేవత లకు తగినంతటి భోగంబులును కలుగఁజేసి యేనుగలు గుఱ్ఱములు మొదలగు సకల జంతువులకున్ను మేపులు నిర్మించి మిక్కిలి తృప్తికలుగఁజేసెను.

అప్పుడా రాజుయొక్క తలవరులా యిఱ్ఱికామధేనువులు రెంటినిన్ని గురుతు పట్టి యివియే మన యుద్యానవనంబును చూరఁబుచ్చినవని నిశ్చయించి రాజుసమీ పంబునకరిగి స్వామీ దేవరయుద్యానవనంబును చెడఁగొట్టినట్టి జంతువులివియేయని చెప్పుటయు.

కార్తవీర్యుని పుత్రులు యిఱ్ఱికామధేనువులను పట్టుకొనిపోవుట.

తత్క్షణంబున కార్తవీర్యుని పుత్రులు మిక్కిలి కోపించి గోబ్రాహ్మణ విషయంబులయందు రాజపుత్రులకింత కోపంబు తగదుతగదని తండ్రియెంతఁజెప్పినా వినక యారెంటినిన్ని పట్టుకొని పోవుచుండఁగాఁ జూచి యమ్మునివరుండు మిక్కిలి సాత్వికుండుగావున నేమియుననక యూరకుండెను.

పరశురాముడు కార్తవీర్యునిఁ జంపెదనని ప్రతిజ్ఞ చేయుట.

తరువాత నాజమదగ్ని పుత్రుండగు పరశురాముండు గురుకులవాసంబుచేయ పోయియుండి యచ్చట ఈశ్వరునియొద్ద ధనుర్విద్య నేర్చుకొనివచ్చి తండ్రివల్ల కార్తవీర్యార్జునుని వృత్తాంతంబులనెఱింగి మహాకోపంబుతోడ నీక్షణంబున వానిఁ జంపివచ్చెదనని యసాధ్య ప్రతిజ్ఞఁజేసి తండ్రివద్దనినా నిలువక యొక్కడే కార్తవీర్యార్జునునిపై పోవుచున్నంత జమదగ్ని తనపుత్రునకు సహాయముగా నెవ్వరింబనుపుదునని యాలోచింపుచుండెను.

జమదగ్ని మహాముని భార్య గంధర్వునిచూచి మోహించుట.

అంతలో నాజమదగ్ని భార్యయైన రేణుకాదేవి యిదివరకున్న తన పాతివ్రత్య మహిమవల్ల యేటి యిసుకచేత నిత్యంబునొకకుండచేసి యందులో నీళ్లు తెచ్చి పతికిచ్చుచుండినది యాదినంబునందొక్క గంధర్వునిం జూచి యతని సౌందర్యంబున కాశ్చర్యపడి చలితచిత్తయై, యదితన పాతివ్రత్యంబునకు లోపంబగుటచేత నెప్పటియట్లయేటి యిసుకచేత కుండచేయఁజాలక తత్క్షణంబున తెలివిఁదెచ్చుకొని తన యక్రమంబు నెఱింగియందుకు ప్రాయశ్చిత్తంబుగా తన పతిపాదంబుల స్మరణజేయుచు మరల శుచిస్నాతయై యెప్పటియట్ల యిసుకకుండచేసి నీళ్లుయెత్తుకొని వచ్చెను.

పరశురాముడు తండ్రియాజ్ఞవల్ల తల్లినిచంపుట.

అప్పుడాజమదగ్ని తనదివ్యజ్ఞానంబువల్ల నామెయొక్క చర్యల నెఱింగి మిక్కిలి కోపించి కార్తవీర్యార్జునునిఁ జంపఁబోవుచున్న పరశురామునిఁబిలచి ఓ ప్రియ పుత్రుడా నీ తల్లిని ముందుగాఁజంపి తరువాత కార్తవీర్యుని చంపుమనియాజ్ఞాపించిన నతండు తనతండ్రియాజ్ఞను శిరసావహించి తత్క్షణంబునఁ తల్లిని చంపఁగా,

జమదగ్ని, శక్తిరూపమును పొందిన తన భార్యకు యెల్లమ్మయని పేరుపెట్టి పరశురామునికి సహాయముగాఁ బంపుట.

నదియునాక్షణంబునందొక్క మహాశక్తియై యెల్లలోకములనున్ను మ్రింగునట్లుగా జమదగ్ని యెదుటనిలచి నాకేమియాజ్ఞయని యడుగుటయు జమదగ్నియు

నాశక్తికి యెల్లమ్మయని పేరుపెట్టి నీవు కార్తవీర్యుని శరీరంబునందెవ్వరు నెఱుంగక యుండి యతని బలంబును నశింపఁజేసి యుద్ధంబునందు పరశురామునిచేత నతండు చచ్చునట్లుగాఁ జేయుము అనినేమించిపంపెను.

జమదగ్ని ఋశ్యశృంగ వృషపర్వులను పరశురామునికి సహాయముగాఁ బంపుట.

తరువాత పరశురాముండు యుద్ధోత్సాహంబుతో వెడలిపోవ మరల జమదగ్ని తనలోనాలోచించి యెల్లమ్మను సహాయముచేసి పంపినమాత్రముతో తృప్తిపొందక తన శిష్యులైన ఋశ్యశృంగ వృషపర్వులను పిలచి అన్నలారా మీకోరికె నెరవేరునట్టి సమయమువచ్చెను, మీదుర్వాసు వంశమువారలనెల్ల మన యిఱ్ఱికామధేనువుల గర్భంబులందు సమభాగంబులుగా పుట్టించి మీరిద్దరు నారెండుభాగములకున్ను కులపతులుగా నారెంటి గర్భములందున్ను పుట్టి మీ బలంబులతోకూడా సన్నద్ధులై పరశురామునికి సహాయముగా కార్తవీర్యునిమీదికి దండెత్తివెడలుడు, అనియాజ్ఞాపించుటయు వారలట్లనే కానిమ్మని తదాజ్ఞను శిరసావహించిపరమసంతోషంబుతో మాహిష్మతీ పురంబునకరిగి యచ్చట పగవారికిలోఁ బడియుండునట్టి యిఱ్ఱికామధేనువుల గర్భంబులయందు తమ దుర్వాసు వంశంబువారలనెల్ల సమభాగంబులుగా జమదగ్ని మహామునియొక్క మహిమవల్ల నావాహనచేసి తరువాత ఋశ్యశృంగుడు తన యంశంబును యిఱ్ఱియందున్న వృషపర్వుడు తనయంశంబును కామధేనువందున్నగా, నావాహనచేసుకొనియుండిరి.

దుర్వాసు వంశమువారలైన ఋశ్యశృంగ వృషపర్వులు యిఱ్ఱికామధేనువుల గర్భములందు పుట్టుట.

పిమ్మట పరశురామునకున్ను కార్తవీర్యునికిన్ని యుద్ధంబుకలుగగా వీరలు పిలపిలమని లెక్కలేనిపరివారములతోడ నారెంటి గర్భములనుండివెడలి పరశురామునకు సహాయముగా కార్తవీర్యునితోడ యుద్ధంబుసేయ దలపడిరి, యెల్లమ్మయున్ను జమదగ్ని యాజ్ఞమేరకు సహాయముగానుండెను.

ఋశ్యశృంగ వృషపర్వుల యంశమునందుపుట్టినవారు కార్తవీర్యుని జంపి జయంబుగొనివచ్చి జమదగ్నికి నమస్కరించుట.

ఇట్లు తలపడి మిక్కిలి భయంకరమైన యుద్ధంబుచేసి పరశురాముని ముందుఁ బెట్టుకొని కార్తవీర్యార్జునుని సంహరించి తరువాత యెల్లమ్మయున్ను పరశురాముండును పరమసంతోషంబుతోడ సింహగర్జనంబులు గావించుచు ముందరనడువగా

నా రెండు దళంబులవారున్ను జయలక్ష్మింజేకొని పరమానందంబుతోడ యిట్టికామ ధేనువుల మరలించుకొనివచ్చి గురువునకు సాష్టాంగవందనంబులు గావించుటయు వారలంజూచి జమదగ్ని యానందించి

జమదగ్ని, ఋశ్యశృంగ వృషపర్వులయంశ పురుషులకు
యిట్టినాయండనియు కామనాయండనియు పేర్లు పెట్టుట.

ఇట్టి గర్భంబునందుపుట్టిన ఋశ్యశృంగునియంశంబిట్టినాయండని ప్రసిద్ధుండై యిట్టి గర్భంబునందుపుట్టిన దుర్వాసు వంశంబువారలందరికిన్ని కులకూటస్థుండుగా నుండుననిన్ని

కామధేనుగర్భమునందు పుట్టిన వృషపర్వుని యంశంబు కామనాయండని ప్రసిద్ధుండై కామధేనుగర్భంబునందుపుట్టిన దుర్వాసు వంశంబువారలందరికిన్ని కుల కూటస్థుండైయుండుననిన్ని

ఈ యిరుతెఱంగులవారున్ను ఇట్టివారు కామవారు అని ప్రసిద్ధులై యొకరి కొకరు భావమరుదులైయుండుదురనిన్ని, ఇట్టివారికి సనాశివగోత్రము, కామవారికి, అచ్యుతగోత్రముగా మేము నేమించియున్నామనిన్ని, మీ యిరుదెరంగులవారికిన్ని యెల్లమ్మ కులదైవమై పరశురాముడు కులాచార్యుడైయుండుననిన్ని

యయాతి శాప విమోచనము.—వ్యాకులమువారని పేరు కలుగుటకుకారణము.

ఇది మొదలు మీకు యయాతి శాపంబులేదనిన్ని ఇదియునుంగాక యీ ఋశ్యశృంగుడు వృషపర్వుడు యిద్దరున్ను మా యిట్టికామధేనువులను కార్తవీర్యు డపహరించినప్పుడు మిక్కిలి వ్యాకులపడిరిగనుక వీరి కులస్థులైన యిరుదెఱంగుల వారున్ను (వ్యాకులమువారని) ప్రసిద్ధులగుదురనిన్ని ఇట్టినియమంబులు నియమించి వారలయందు మిక్కిలి యనుగ్రహంబుచేసెను.

పరశురాముడు వ్యాకులమువారితోకూడా తీర్థయాత్రపోవుట.

తరువాత చక్రవర్తిని చంపిన పాపము పరిహారమగుటకై వ్యాకులమువారినిన్ని పరశురామునిన్ని తీర్థయాత్రచేసిరమ్మని జమదగ్నిమహాముని యాజ్ఞాపించిపనుపి తన యాశ్రమంబున తాను తపస్సుచేయుచుండగా

కార్తవీర్యుని కొడుకులు జమదగ్ని మహామునిని చంపుట.

కార్తవీర్యుని కొడుకులు తమతండ్రిని పరశురాముడు చంపిన చలమునుఁబట్టి యెుఁతండులేని సమయమందేకాంతముగా తపస్సుచేయుచున్న పరమసాధుండగు జమదగ్ని మహామునినిఁబట్టి చంపిరి.

పరశురాముడు వ్యాకులమువారిని సహాయముగా పెట్టుకొని
క్షత్రియులను నాశముచేయుట.

పిదప పరశురాముడు వ్యాకులమువారితోకూడా తీర్థయాత్రచేసి మరలివచ్చి తండ్రిపాటువిని మహాక్రోధావేశంబునొంది వ్యాకులమువారినిన్ని యెల్లమ్మనున్ను సహాయభూతులుగాఁజేకొని ఇరువదియొక్కమారు క్షత్రియ వంశంబులను నిర్మూలంబుగాఁజేసి జయంబునొంది తనకు సహాయముచేసినట్టి యీ వ్యాకులమువారికి

పరశురాముడు వ్యాకులమువారికి బిరుదులిచ్చుట.

౧-స్వామి ముద్రలు
౨-గండపెండారంబులు
౩-ఉభయ వింజామరలు
౪-మోకోటి పంజులు
౫-ఢాకాల అంకుశము
౬-దవణ ముద్రలు
౭-గంద్రగొడ్డలి

యివి మొదలయిన బిరుదులను ప్రసాదించి యనుగ్రహించెను.

రేణుకాశక్తియనే యెల్లమ్మయొక్క ప్రభావము.

ఇట్లు ప్రబల క్షత్రియవధకు కారణభూతురాలైన రేణుకాదేవి

శ్లో॥ కృతేతురేణుకాశక్తిః। త్రేతాయాం ధర్మదేవతా।
ద్వాపరే ద్రౌపదీశక్తిః। కలౌశక్తిర్గృహేగృహే॥

అని పొగడఁబడియుండెను.

గొల్లవారిలో మారుమనువులు చేయుటకు కారణము.

అప్పుడు. అనువంశంబునందు పుట్టిన గొల్లలు తమవారైన వ్యాకులమువారి యెక్కువనుచూచి తామున్ను అదివరకు నడవులలో నిడుములుఁబడుచుండినవారు గనుక తమకున్ను, వృత్తమదశకలుగుటకై పరశురామునిన్ని తమవారైన వ్యాకులము వారినిన్ని మిక్కిలి యనుసరించి ప్రార్థించగా వారలున్ను ఆ గొల్లలయందు మిక్కిలి కరుణించి మాహిష్మతీ పట్టణములో చెరచిక్కినట్టి విధవల నాగొల్లలకిచ్చి పెండ్లిచేసి యిండ్లునిలిపిరి గనుక గొల్లజాతివారిలో మారుమనువులుకద్దు.

కార్తవీర్యుని వంశపురాజకన్యకలను వ్యాకులమువారుపెండ్లి చేసుకొనుట.

మరియు నామాహిష్మతీ పట్టణములోనుండిన రాజకన్యకలను వ్యాకులమువారు

పెండ్లిచేసుకొనినందున వ్యాకులమువారిలో ఆవవార్లు కార్తవీర్యుని వంశమువారు, మొగవారు దుర్వాసు వంశమువారు,

ఈ ప్రకారంబుగా కృతయుగంబున జమదగ్నిమహామునియొక్క యనుగ్రహంబువల్ల యయాతిశాపదోష విముక్తులైన దుర్వాసు వంశమువారు వ్యాకులము వారని ప్రసిద్ధిపొంది యనేక బిరుదులతోడ వృద్ధిఁబొందుచుండిరి,

ఋశ్యశృంగుని ప్రభావము.

ఇట్లు ఋశ్యశృంగుడు తనయంశంబువల్ల నిత్తినాయనింబుట్టించి దుర్వాసు వంశంబునుద్ధరించి తానుమునుపటివలెనే యఖండిత బ్రహ్మచర్యవ్రతంబుతో పితృశుశ్రూషణాదికార్యతత్పరుండై తండ్రియైన విభండకముని యాశ్రమంబునఁ దపంబు సేయుచుండి త్రేతాయుగంబునందంగదేశంబునకు సంభవించిన ద్వాదశవర్షక్షామంబు నివర్తించుటకై యద్దేశాధీశుండైన రోమపాదమహారాజుచేత ప్రార్థింపఁబడినవాడై యంగదేశంబునకు సంభవించియుండిన యనావృష్టిదోషంబును నివర్తింపఁజేసి యారాజుకూతురైన శాంతాదేవిని పెండ్లిచేసుకొని పిమ్మట దశరథమహారాజు సంతానార్థంబుతన్ను ప్రార్థించగానయోధ్యకరిగియతనిచేత పుత్రకామేష్టిఁజేయించి పుత్రులఁగలుఁగఁజేసి

దశరథమహారాజు ఋశ్యశృంగునికి బిరుదులిచ్చుట.

లబ్ధసంతానుండైన యారాజు భక్తితోడ సమర్పించిన

౧-పగలుదీవిటీలు

౨-కాళి అందె

౩-బొడ్డు ఘంట

మొదలైనబిరుదులను తనవంశస్థులైన వ్యాకులము వారలకిచ్చెను.

అంభోధిరాజుయొక్క గోవులను శ్రీకృష్ణుండు మేపుట.

ఇట్లు మహా ప్రభావముగల పుత్రులచేత బయలుపరచబడిన మహిమగల యంభోధిరాజు తన తపస్సువల్ల ప్రీతుండైనట్టి యీశ్వరుండు తనకిచ్చిన గోవులకెల్ల, నధిపతియై శివుని యాజ్ఞమేరకు వాటిని మేపుచుండగా ద్వాపరయుగంబునందు శ్రీవిష్ణువు కృష్ణావతారమెత్తి రేపల్లెవాడలో నందుని మందలో గోవులను మేపుచుండి సమస్తగోవర్గంబులకున్ను తానొక్కడే యధిపతిగానుండఁదగిన గోవింద పట్టాభిషేకమును పొందవలయునని యపేక్షించి గోవులకెల్ల నధిపతియైన యంభోధి రాజువుంటే తనకాపట్టము ఘటించదుగనుక నా యంభోధిరాజును భూమియందుండ

నివ్వకఁజేయుటకుపాయమును వెదకి యాతనియొద్దకరిగి, ఓ యంభోధీ నీవీగోవులను బహుశ్రమపడి తపస్సుచేసి సంపాదించితివని వినినాను. ఇట్టి నీ గోవులనుమేపితే మిక్కిలి పుణ్యములభించును కాఁబట్టి, నీవు చెప్పినట్లు వినుచుఁ గొన్నిదినంబులు నీ గోవులను నేను మేపుచున్నాను. నాయందు దయచేసి గోవులను నా స్వాధీనంబుగానిమ్ము, అని యడిగినందుకయ్యంభోధియు సమ్మతించి సదాశివుడు నేమించియుండే మూడు నియమములనున్ను కృష్ణునకు తెలియఁజెప్పి యా నియమములు తప్పక నీవు మేపవలసినదని చెప్పెను.

అదివిని కృష్ణుడున్ను అట్లనే మేపుచున్నానని యొప్పుకొని యా యావులను మేపుచుండి యొక్కనాడు మోసముచేసి వెన్నలో రాయిపెట్టివేయుగా చెంగటావు కాలువిరిగెను,

అంభోధిరాజు పుట్టలోపలికి దిగఁబడిపోవుట.

అదితెలిసి యంభోధిరాజు మిక్కిలి దుఃఖించి కృష్ణుని మోసమునుదూరి తాను గోవులవిషయమందు సదాశివుడాజ్ఞాపించినట్టి యీనియమంబులను తప్పితే భూమియందుండేదిలేదని శివుని పాదములంటి ప్రతిజ్ఞచేసియిచ్చినవాడు కావున నా ప్రతిజ్ఞ నెరవేర్చేకొరకు తాను భూమియందుండక పుట్టలోపలికి దిగఁబడిపోయెను.

పాలవ్యాకులమువారని పేరుకలుగుటకు కారణము.

అప్పుడతని కులస్థులయిన వ్యాకులమువారతడు పోవుటకు దుఃఖించి యా పుట్టలో నతనికి ప్రీతిగా పాలుపోయగా నది అశనమయెను గనుక, అదిమొదలా వంశమువారికి పాలవ్యాకులమువారని ప్రసిద్ధికలిగెను.

శ్రీకృష్ణుని గోవిందపట్టాభిషేకము.

శ్రీకృష్ణుండు నీయుపాయంబుచేత నంభోధిరాజును భూమియందులేకుండా చేసి భూమండలంబునంగల గోవులనెల్ల తనస్వాధీనపరచుకొనెనని ఇంద్రుడు కోపించి కృష్ణుడు శ్రీమన్నారాయణమూర్తి యగుటమరచి వర్షంబు కురిపించినప్పుడు గోవర్ధన పర్వతము నెత్తియు, అడవిలో కార్చిచ్చు చుట్టుకొనినప్పుడు దానిని మింగియు ఇట్లుమనుష్యులకశక్యములైన వ్యాపారములుచేసి యాగోవులను సంరక్షణ చేసెను అందుచేత కామధేనువు సుప్రీతురాలై సమస్త దేవతలతోడ వచ్చి శ్రీకృష్ణునకు గోవింద పట్టాభిషేకముచేయుగా శ్రీకృష్ణుడు సకల గోగణంబులకున్ను అధిపతియాయెను.

ఇదివరకు పాలవ్యాకులమువారి వంశావళియందు

రెండవ భాగము సంపూర్ణము.

పాలవ్యాకులమువారి వంశావళి ౩-వ భాగము.

———:o:———

ఇట్లు పాలవ్యాకులమువారనే పేరుతో ప్రసిద్ధిపొందిన యీరాజవంశమునందనేక రాజశ్రేష్ఠులుపుట్టి ధర్మమార్గముతో ప్రభుత్వము చేయుచుండిరి.

పిమ్మట నీ కలియుగమునందు కొంతకాలము గడచినవెనుక నా వంశంబునందిట్టిమల్లినాయడు కామమల్లినాయడు, అను పేర్లుగల యిద్దరు రాజులుపుట్టి హస్తినాపుర ప్రాంతరాజ్యములందు మహావిభవంబుతో దొరతనముఁజేయుచు పుత్రపౌత్రాద్యష్టైశ్వర్యములతో నొప్పుచుండిరి.

కామమల్లినాయడు, చచ్చినపక్షినిన్ని, ఇట్టిమల్లి నాయని కూతురినిన్ని బ్రతికించుట.

వీరిలోనిట్టిమల్లినాయనికి సమస్త సద్గుణంబులుగలయొక్క కూతురుపుట్టి తల్లిదండ్రులకు మిక్కిలి ప్రియముగా బెరుగుచుండి విధివశంబున కన్యకగానే మరణమునొందెను.

అప్పుడామెయొక్క తల్లిదండ్రులధిక దుఃఖాతురవశులై ప్రలాపించుచుండివారిలోతండ్రియైన యిట్టిమల్లినాయడు మంత్రశక్తివల్ల, నాముద్దు కూతురిని బ్రతికించెదనని తలపోసి పరిశుద్ధజలంబులందు స్నానంబుఁజేసి విభూతి రుద్రాక్షలు ధరించుకొని మృత్యుంజయ మహామంత్రంబు జపించుచు నాశవంబుడాయంజేరునంతలో బాలుండయ్యును మంత్రసిద్ధిగల కామమల్లి నాయడు తద్వృత్తాంతంబు నెరింగి యచ్చటికివచ్చి యిట్టిమల్లినాయనింజూచి చచ్చినకూతురిని బ్రతికించుటకు ముందుగా నీపక్షిశవమును బ్రతికించమనిచెప్పి యొక్క చచ్చినపక్షినాతని ముందునచెను.

అదిచూచి యిట్టిమల్లినాయడు మృత్యుంజయ మహామంత్రంబుచే నాపక్షిశవంబు నభిమంత్రించెనుగాని యాపక్షి బ్రతుకదయ్యె.

తరువాత కామమల్లినాయడు నిర్మలనదీ ప్రవాహంబున స్నానంబుఁజేసి శుచిర్భూతుండై తడిగుడ్డతోనొక్క చొంబునీళ్లు ముంచుకొనివచ్చి మృత్యుంజయ మహామంత్రంబుచే నాజలంబు నభిమంత్రించి పక్షిశవంబుపై ప్రోక్షించగా నాపక్షితక్షణంబున బ్రతికెను.

అంతట యిట్టిమల్లి నాయడత్యాశ్చర్య సంతోషభరితుడై కామమల్లినాయనింజూచి నాకూతురిని నీమంత్ర మహిమవల్ల బ్రతికించితివేనినే నీసుందరీ రత్నమును నీకే వివాహముఁజేసి యిచ్చెదనని చెప్పెను.

అప్పుడు కామమల్లి నాయడు ముందటివలెనే మృత్యుంజయ మహామంత్రంబుచే నభిమంత్రించిన జలంబులాకన్యకపై ప్రోక్షించుటయు నక్కన్యకామణి నిద్రమేల్కొంచిన చందంబునలేచి యందరికినానందంబుఁగలుగఁజేసెను.

పిమ్మట, యిట్టిమల్లినాయడు పరమానందంబుతోడ ముహూర్తమునిశ్చయంబుఁజేసి మహోత్సవంబుగా నా వధూవరులకు వివాహంబుగావించెను.

పాలవ్యాకుల పట్టభద్రులు తమచేతి వ్రేళ్లలో పాలుపిండుట.

పిదప కొంతకాలమునకీరాజులు పాలవ్యాకుల పట్టభద్రులని మిక్కిలి ప్రఖ్యాతివహించియుండగానప్పటి దేశాధిపతి దానివిని సహింపక వార్లనుబిలువనంపి మీదేహములోపాలును చూపించనిపక్షమందు పాలవ్యాకుల పట్టభద్రులనే పేరును మీరు వహించకూడదని యాక్షేపించెను.

అప్పుడు కామమల్లి నాయడాదేశాధిపతి సముఖమందు తనచేతి వ్రేళ్లనుపిండియొక చొంబునిండునంతపాలును వ్రేళ్లనుండి తీసెను.

అప్పుడాదేశాధిపతి యాశ్చర్యపడి వీర్లయందుండు మహిమనుఁబట్టి పాలవ్యాకుల పట్టభద్రులనే బిరుదు మీకుతగుననియుత్తరవిచ్చి యనేక బహుమానములిచ్చెను.

తరువాత కొన్నిదినంబులకు దైవవశంబున నా పట్టణంబుపై మ్లేచ్ఛులు దండెత్తివచ్చి పట్టుకొనుటయు నప్పుడచ్చటనుండిన వ్యాకులమువారు తమ బంధుమిత్రాదులయిన సమస్త జనములనున్ను పదియారువేల కంపణమువారినిన్ని తోడ్కొనియప్పురమునుండి వెలువడి రాత్రింబవలు నెడలేక నడుచుచు కొన్నిదినంబులకు శ్రీశైలమునందు వచ్చిచేరిరి.

‡ అప్పుడు శాలీవాహన శక సంవత్సరములు ౯౨౨-అగుననియెడి వికారినామసంవత్సరమునకు ముందు ప్రౌఢదేవరాయలువారు ప్రభుత్వముచేయుకాలమునందువారీపాలవ్యాకులమువారి సమూహమునున్ను పరాక్రమమునున్ను చూచి మెచ్చివీరిలోనిట్టివారికి శ్రీశైలముతోచేరిన తొమ్మిదిలక్షల డెబ్బదివేల దేశములనిచ్చి వీటికి శ్రీశైలము రాజధానిగానేర్పరచి యందువీరిని నిలిపిరి.

కామవారికి పచ్చార్లపట్టణముతో చేరిన మూడులక్షల రాజ్యములనిచ్చి వీటికాపట్టణమును రాజధానిగానేర్పరచి యందువీరిని నిలిపిరి.

వీర్లకు పచ్చార్లపట్టణము రాజధానిగానుండినా యెల్లప్పుడున్ను శ్రీశైలమునందే నివాసముగానుండిరి.

‡ ఈ రాయవంశాను క్రమణిక ౪-వ భాగమునందు వివరింపబడుచున్నది.

ఇట్లుండునట్టి పాలవ్యాకులమువారిలో ‡కశినికోట తిమ్మానాయనివారి కుమారులగు కశినికోట పెద్దమల్లాభక్తుల వారలచ్చట కొండమీద పంచగుహలను కనిపెట్టినారు, ఊరియందు

౧-నందుల మఠము
౨-సారంగమఠము
౩-తోటమఠము
౪-మూలమఠము
౫-కవిమఠము

అని పేర్లుగల పంచమఠములున్ను, మరియు

౧-మహానందీశ్వరుని రుద్రమఠము
౨-యాగంటీశ్వరుని మహంతుమఠము
౩-విరక్తులమఠము

అని పేర్లుగల యితర మఠములున్ను కట్టించినారు.

ఇట్టి కశినికోట మల్లాభక్తులవారొకప్పుడు డెబ్బదిరెండు బిరుదులతోడ వోరుగంటి శంభుని సేవించపోయినారు. అప్పుడు వోరుగంటి పట్టణమునకు ప్రతాపరుద్రుడు దొరగావుండినాడు. మరియునచ్చట సమస్తవిద్యలును నేర్చి సకల బిరుదులున్ను కలిగినవారుండిరి. భక్తులవారి బిరుదులన్నియు వెలుపటనే పెట్టి వూరిలోపలికివచ్చి శంభుని సేవించి పొమ్మని పట్టణపువార్లు చెప్పినారు. ఆ మాటవిని భక్తుడు రౌద్రాకారుడై ౫౦-కోట్ల విస్తీర్ణముగల యీ భూమండలములోగా నాకు అడ్డము వచ్చినవారులేరు. అడ్డమువస్తే వర్ధిల్లేదిలేదు అనిపలికి వోరుగంటి శంభుని ప్రార్థించినారు. అంతట వోరుగంటిశంభుడుపురము వెడలి భక్తులకు యెదురొచ్చి తన సన్నిధానమునకు పిలుచుకొని పోయినాడు. పిమ్మట స్వామికి భక్తులుచేసిన పూజాక్రమమెట్టిదనిన, వ్రేళ్లలోనుంచి పాలుపిండి అభిషేకము చేసినారు. మరియు నా వ్రేళ్లలోనుండియే రాజనపుబియ్యముకురిపించి తళిగనైవేద్యముచేసినాడు. గుండెలు నైవేద్యముచేసి కనుగుడ్లు దీపాలుపెట్టి వట్టికాలు వత్తిగా జగజ్జోతిమలిగించి శరాసనమందు తోరణాలు కట్టించిరి. అప్పుడా పట్టణమందు కలిగినట్టి యుపద్రవమెట్టిదనిన ఏనుగలు హూంకారముతో నరచెను. గుఱ్ఱములాహారనిద్రలుమానెను. పట్టణము గడగడమని వణకెను. ఇట్టి యుత్పాతములనుచూచి ప్రతాపరుద్రుడు మిక్కిలి భయపడి భక్తులవారి సముఖానకువచ్చి సాష్టాంగ దండప్రణామంబుచేసి మా దొరతనము నిలుపవలయును. మమ్మురక్షించవలయును. ఈ పవాడమంలేపవలయునని ప్రార్థించినాడు. అందుకు భక్తులవారు దయతోడ సమ్మతించి వారివారి శిరస్సులను మొండెములయొద్దబెట్టించి శంభుని

‡ కశింకోట—ఇది విశాకపట్నం జిల్లాకుచేరిన పఖు జమీన్దారి పేష్కస్తి రూ. ౧౩౯౦౧-౯-౦.

ప్రార్థనసేయగా శంభుడు పవాడం లేపేట్టుచేసెను. అప్పుడు ప్రతాపరుద్రుడు మిక్కిలి సంతోషించి తనకొప్పియుండునట్టి,

౧-డెబ్బదిరెండు బిరుదులు
౨-శంఖచక్రాలు
౩-ధవళశంఖము
౪-వజ్రిబెత్తము
౫-రవణ మలహరి.

మొదలయిన బిరుదులు వాద్యములు; మరియు

౧-పంచవన్నెల బిరుదులు
౨-పగలు దీవిటీలు
౩-మోకాటి పంజులు
౪-డాకాల పెండారములు మొదలయినబిరుదులున్ను
౫-గండభేరుండమనే ధ్వజమున్ను యిచ్చినాడు.
అంతట శంభుడు మెచ్చి
౬-కుతారపద్దు యిచ్చినాడు.

నీకు సకలబిరుదులున్ను చెల్లును. యిందుకు ఆకాశవాణి, భూదేవత, వోరుగంటి శంభుడు, కల్యాణవీరభద్రుడు, కశినికోట చెన్నరాయడు వీరలేసాక్షులు. ఇదినిశ్చయము అని శాలివాహన శకవర్షంబులు ౧౦౨౦ అగుననేటి ఈశ్వరనామ సం॥రం అశ్వయుజశుద్ధ సోమవారమునాడు వోరుగంటి పట్టణమునకు దొరయగు ప్రతాపరుద్రుడు వోరుగంటి శంభుని సన్నిధానమందుచెప్పి బిరుదులిచ్చినాడు.

ఇట్టి మహిమలుకలిగి మహాప్రభావంబుతో ప్రఖ్యాతివహించియుండు పాలవ్యాకులమువారలనేక పుణ్యకార్యంబులఁజేయుచు వా శ్రీశైలమునందు నిత్యవాసముగా బహుకాలమువరకు తమతమ రాజ్యములను పరిపాలనఁజేయుచుండిరి.

పిమ్మటనొక సమయమునందు కర్నూలునవాబు శ్రీశైలమునకువచ్చి వీరిచేత సత్కారమునుపొంది వీరి యైశ్వర్యమున్ను ధర్మమార్గవృత్తియుంజూచి మెచ్చుచు కొన్నిదినములచ్చటనే వారితోడ నిష్టవినోద సంభాషణములతో వాసముఁజేయుచుండియొక్కనాడు వారల యంతఃపురములనున్ను వుద్యానవనములనున్ను వేడుకతో చూచుచునయ్యుద్యానవనములో పువ్వులుఁగోయుచుండునట్టి యా పాలవ్యాకులమువారికన్యకలను చూచి వారి సౌందర్యలావణ్యంబులచేత మోహించి పరవశంబైన చిత్తంబుతోడ తన విడిదికరిగి పాలవ్యాకులమువారి వయోవృద్ధులను పిలిపించి మిక్కిలి గౌరవించుచు ప్రియవచనంబులుపలికి మీ కన్యకలను మాకు వివాహంబుచేసి

యివ్వవలయునని యడుగుటయు వారు మంచిమాటలతోడనే బహువిధంబులగు ధర్మంబులు సెప్పియొప్పఁజెప్పిరిగాని యప్పాపాత్ముఁడమ్మాటలకు సమ్మతించక పెక్కువిధంబులగు నయభయవాక్యంబులచేత వారలను బెదరించి యిప్పటికిన్ని వారు సమ్మతిపడకుండుటయు మిక్కిలి నిర్బంధము చేయసాగెను.

అప్పుడు వారు బలవంతుడైన యా నవాబుతోడ విరోధము చేసుకొనుటకు భయపడి యాతనిం జూచి అయ్యా మా కులమువారినందరినిన్ని చేర్చి యాలోచించుకొని పిదపనీ కార్యముయొక్క నిశ్చయము నెఱింగించెదమని చెప్పి యందరున్ను లేచిపోయి యొక్క యేకాంతస్థలంబున తమవారి పెద్దలనందరినిన్ని చేర్చి యాలోచించి యందరు నొక్కటే యభిప్రాయముగా నీ కార్యము నీరీతిగా చేసి తప్పించుకొనవలయునని యుపాయంబు నిర్ణయించుకొని మరునాడా నవాబుయొక్క విడిదికి వచ్చి తగురీతిగా మాటలాడి అయ్యా మీరు గొప్ప ప్రభువులు మీ యాజ్ఞనతిక్రమించుటకు మేమెంతటి వారము మీ యిష్టముఁ మేరకు మేమందరమున్ను సమ్మతించినాము అయతే మా కులాచారము మేరకు శుభముహూర్తమును నిర్ణయించుకొని యా ముహూర్తమునందు వివాహముచేసి యిచ్చెదము అనుటయు వీరికిఁగల దైవసహాయ బలంబువల్ల వాడమ్మాటలను నమ్మి సంతోషించి అయ్యా మీ యిష్టముమేరకు ముహూర్తమును నిశ్చయించుకొని శీఘ్రంబుగా మా కెఱింగింపుడని చెప్పెను.

పిమ్మట వారలాక్షణంబున తమ పురోహితులైన వాజసనేయ బ్రాహ్మణులకు రహస్యంబుగాఁ దమయభిప్రాయంబు నెఱింగించి యచ్చోటికిఁ దోడ్కొనివచ్చి సముచితాసనంబునందుఁ గూర్చుండ నిచ్చి యప్పురోహితులంజూచి అయ్యా వివాహముహూర్త లగ్నంబు నిశ్చయింపుడనుటయు వారలు ముహూర్తమునుచూచుచు నెలదినములకు వెనుక పరిశుద్ధలగ్నము వున్నదని యేర్పరచిరి. ఆ వెనుక నందరున్ను పురోహితుల వాక్యంబులకు సమ్మతించి యా ముహూర్తమునందు వివాహము జరిగించేలాగున నేర్పరచుకొనిరి.

అంతట నవాబు మిక్కిలి సంతోషము నొంది తన మనంబునందు నేనీ ముహూర్త దినంబు సమీపించునంతలో నా రాజధానికరిగి బహువిధవిచిత్ర వస్త్రభూషణ పరిజన పరివారాది వైభవంబుతో నిచ్చటికి వచ్చి చేరవలయునని నిశ్చయించి పాలవ్యాకులము వారి సెల్ల సగౌరవంబుగా వీడ్కొని తన పట్టణంబునకేగెను.

ఆ వెనుక నీ పాలవ్యాకులమువారు తమ జనులందరినిన్ని సమస్తవస్తువాహనంబులతోడ ప్రయాణముచేసి ముందుపోవుచుండుమని యాజ్ఞాపించి కొందరుమాత్రమచ్చ

టనే నిలచియుండి యా ముహూర్త దినమునకుముందు నవాబువచ్చి చేరునంతలో గ్రామము నగరు కొలువుకూటమునందు కడకున్న సెల్లికాయలు పరచి వాటిపైన మంచి మంచి రత్నకంబళ్లు జముకాణములు యివి పరచి దిండ్లువుంచి ఎల్లప్పుడు నడవులయందు దిరుగుచుండునట్టి వేటకుక్కల నా కొలువుకూటము నాలుగుమూలలయందున్ను చిన్నచిన్న గూటములుకొట్టి వాటియందా కుక్కలను సన్నటి త్రాళ్లచేతఁగట్టి తమయందటి నగళ్లవాకిండ్లున్ను తెరచివేసి తామచ్చోటినుంచి వెడలి యతిశీఘ్రప్రయాణంబుగాఁదమ జనసమూహంబుతోడఁగలసుకొని యందరున్ను రేయింబవలు నెడతెగని ప్రయాణంబుగా నడచుచు చనిచని తుంగభద్రానదీతీరంబుఁజేరిరి.

ఆ సమయంబునందానది యపరిమితంబుగా ప్రవహింపుచుండుటనుచూచి పాలవ్యాకులమువారందరు మిక్కిలి పరితాపమును బొంది దుఃఖింపుచు నానదికి పెక్కువిధంబులైన పూజలు గావించి దీపారాధనలు చేసి యనేకవిధంబులుగా ప్రార్థించి యా రాత్రియుపవాసంబుగా పండుకొని నిద్రించగా నానదివారల స్వప్నమునందు స్త్రీరూపంబుతో వచ్చి నాకు నరబలియిచ్చితిరేని మీరందరున్ను సుఖముగా నదిని దాటిపోవచ్చునని చెప్పి యంతర్ధానమైపోయెను.

అంతట వారు మేల్కొని తమ పరిజనులు భృత్యులు మొదలుగాగల సమస్త జనులనున్ను బంధుజనులనున్ను నొకచోటఁజేర్చి యా స్వప్న వృత్తాంతంబునందరికిం జెప్పి మన జనులిందరిలో నీనదికి తనదేహమును బలియిచ్చి యీ సమస్త జనులనున్ను సంరక్షించి పుణ్యలోకమును పొందఁగోరునట్టి పుణ్యాత్ముండెవ్వడేని యుగలండేని వాడి కార్యంబునకుత్సహించి యభయంబివ్వతగును అనియందరికిన్ని వినునట్లుగాఁజెప్పుటయు వారలందఱిలో, యొలకతోటి వాడొకడులేచి నిలుచుండి నేనీ కార్యంబునకు మనఃపూర్తిగా సమ్మతించినాడనని చెప్పి స్నానముచేసి విభూతిధరియించి పరమేశ్వరుని పాదంబులను స్మరియింపుచు నానదీతీరంబునకువచ్చినిలచి వాడిగల కత్తిచేత తన శిరస్సును ఛేదించుకొనుటయు ఁదత్క్షణంబునందానదినుంచి యొక దివ్యవిమానముతోడ దేవదూతయొకడువచ్చి యామాలవానికి దివ్యదేహంబిచ్చి యా విమానమునందు కూర్చుండఁ బెట్టుకొని స్వర్గలోకంబునకుఁగొనిపోయెను.

తరువాత తుంగభద్రానదీ ప్రవాహంబులో (మద్ది-మారెడు-కానుగ-బూరగ-తంగేడు) *ఇవి అడ్డపడినందున ప్రవాహంబునిలచి త్రోవవిడుచుటయు పాలవ్యాకులమువారి సమూహమంతయు నానదిని దాటి యావలగట్టు చేరి బహుదూరము చని యొక్క కొండకోనలో విడిసెను. వెంటనే యానది మరల మునుపటివలెనే ప్రవహింపుచుండెను.

* ఈ వృక్షములను యిందువల్లనే పాలవ్యాకులమువారు యెంగిలిగాని కాలుగాని తగలనివ్వరు పొయ్యిలో కాల్చరు.

అంతలోనక్కడున్న నవాబుమితిలేని యాటాటోపంబుతోడ శ్రీశైలము వారియెల్ల యొద్దికివచ్చినిలచి యచ్చటనెకవిశాలమైన చదరపుభూమిలోఁదన పరివారములనెల్ల విడియునట్లాజ్ఞాపించి తాను తనయిష్టబంధువులు మిత్రులు మంత్రులు ఈ మాత్రము మితజనులుగా వెడలి పట్టణంబులోపల ప్రవేశించి పాలవ్యాకులమువారి జనులెవ్వరి నిన్నిఁగానక వారలకొలువుకూటములోపలికి పోవుచు నచ్చటపరిచియుండు రత్న కంబళ్లు నెల్లికాయలచేత జారుచుండుటనుచూచి యిట్లుజారుటకు కారణమేమని శోధించుచుండునంతలోనక్కడ కట్టియుండినట్టి కుక్కలు వీరలఁజూచినమాత్రమున కరాళించుచు నాచచ్చుడు త్రాళ్లను త్రెంచుకొనివచ్చి వీర్లపైనపడి కరవసాగెను. అప్పుడువీర్లు మూలమూలలకు పరుగులెత్తఁబోయి జారిపడి కాళ్లు చేతులయందు గాయములుతగిలించుకొని కుక్కలచేత కరువఁబడి కూతలుపెట్టుటయు వారిభటులు పరుగెత్తివచ్చి తమచేతికత్తులచేత నా కుక్కలనునరికిరి. తరువాత నవాబుయొక్క జనులందరున్ను ఈ సమాచారమువిని పట్టణములోపల ప్రవేశించి నవాబుసమీపంబునకు చేరునంతలోనతడున్ను పలుఁదెరంగులగు చికిత్సలచేత గాయములనొప్పిని కొంత పరిహారముఁజేసుకొనుచు తనసైన్యంబులెల్ల యుద్ధసన్నద్ధంబులై వచ్చునట్లాజ్ఞాపించి తత్కాలంబునందచ్చట సిద్ధముగానుండు పరివారములోడ వెడలి యతిశీఘ్ర ప్రయాణంబుగా తుంగభద్రా నదీతీరంబుఁజేరి రెండుప్రక్కలగట్టులదరకు వ్యాపించి ప్రవహింపుచున్న యానదినిచూచి పాలవ్యాకులమువారలీనదినిదాటి యెక్కడికి పోగలరని పలుకుచు. నా దిక్కుకడకున్ను వెదకిచూచి వారుపోయినదోవను తెలుసుకొనజాలక మనోదుఃఖముచేతఁ బరితపించుచు నచ్చటచ్చట తనసైన్యములను కావలిపెట్టి యెన్నటికైనను వ్యాకులమువారినెల్ల నిర్మూలముచేయుదునని తలంచుచు మరలి తన పట్టణంబునకు పోయెను.

అంతనిక్కడ పాలవ్యాకులమువారున్ను తుంగభద్రానదియొక్క దక్షిణపు గట్టున బహుదూరమునందు తమసైన్యములనెల్ల విడియునట్లుగా దిట్టముఁజేసి యేటి గట్టుకు వేగులవారిని పంపించి వారివల్ల నావలిగట్టున నవాబుసైన్యము వచ్చుటయు కడకున్ను వెదకి మరలి పోవుటయునెఱింగి తాము మెల్లమెల్లన సుఖప్రయాణముగా హంపి విరూపాక్షమునకు సమీపమందుండు విజయనగరము వచ్చిచేరిరి.

అప్పుడు శాలీవాహన శకసంవత్సరంబులు ౧౨౭౦-అగునని యెడి ప్రభవ నామ సంవత్సరమునందు ఆ విజయనగరమున హరిహరరాయలవారు దొరతనము చేయుచుండిరికాఁబట్టి వారీపాలవ్యాకులమువారి సమూహమునుచూచి మీరెవ్వరు యెందుండి యెక్కడికి పోవుచున్నారు అని తన మంత్రులచేతనడిగించుటయువారు తాముప్రౌఢదేవరాయలచేత, ఆదరించి నిలుపఁబడిన పాళెగార్లుఅని వినయముతోడఁ దెలియఁజెప్పిరి. అదివిని హరిహరరాయలువారు మిక్కిలి సంతోషములో వారినంద

రినిన్ని మిక్కిలి ప్రీతిపూర్వకముగా గౌరవించి మీరు మా పెద్దలచేతనాదరింపఁబడిన వారుకాఁబట్టి మాకుస్వజనులతో సమానులని ప్రియవాక్యంబుల (గొనియాడి తన సైన్యములకు వారిని సేనాధిపతులుగా నేర్పరచిరి. అంతట వారలే వేళలందున్ను రాయలువారియొద్ద మిక్కిలినమ్మకముగా కావలికాచుకొనుచుండగానీ పాలవ్యాకుల మువారందరివిషయములోనున్న ఆ హరిహర రాయలువారు మిక్కిలిసంతోషించి వార లందరికిన్ని వేరువేరుగా కొంత § (పాళెము)ల నిచ్చుటయు వారలాపాళెముల యందు ధర్మముదప్పక దొరతనముఁ జేయుచుండిరి. ఇట్టి పాలవ్యాకులమువారి కందరికిన్ని పూర్వము హస్తినాపురమునుంచివచ్చుటవల్ల (హస్తినాపురమువారనిన్ని) పిదప శ్రీశైలమునుంచి వచ్చుటవల్ల (శ్రీశైలమువారనిన్ని) పేర్లు యేర్పడెను.

---

§ ఆంధ్రశబ్ద రత్నాకరనిఘంటువులో { ౧-పాళెము అనగా చిన్నపట్టణము,

ఉదాహరణము—యయాతిచరిత్ర ౧-వ ఆశ్వాసము,

సీసపాదము—మూడుపాళెములు తెంపునగెల్చి పాదలుజా
బిల్లితాలుపు వెల్లుబీరమెంత.

సద్య ౨-పాళెమనఁగా=వండు.

ఉదాహరణము—ఉత్తరరామాయణము ౨-వ ఆశ్వాసము,

ఉత్పలమాల—అలముసేయవచ్చెరిపు
డంచొకయంచుకవాడెరింగినన్।
శూలముకేలనేమరడు
సుస్మదినెస్మదినుంచిదవ్వులన్।
పాళెముడించియెక్కడవు
బాణకృపాణధనుర్ధరుండవై।
యాలవణుండుప్రోల్వ్రడలి
నప్పడెకప్పముగొప్పతూపులన్॥

మరియొకయుదాహరణము-ఉత్తరరామాయణము ౬-వ ఆశ్వాసములోరంభా రావణ సంవాదమునకుముందు రంభ, రావణసైన్యమునుఁజూచిచెప్పుట.

కందపద్యము—కనియిదిరావణసైన్యము లనితెల్పివయస్యఁజూచియసురులుమూర్ఖుల్।
జనరాదీతెరువునిక జనదగుగిరిమీదమనకుసఖియరాయనుమన్॥

కందపద్యము—అలలనామణియసురుల పాళెములకుకొంతదొలగిపావననందా।
కూలంకషయవ్వలిదరి కేళీవనిజొచ్చెనిజసఖీరత్నముతోన్॥

వారిలో అగ్గితిమ్మానాయనివారు శాలీవాహన శకసంవత్సరంబులు ౧౨౫౦ అగునేటి ప్రభవసం॥లో, ఆహరిహరరాయలువారియొద్ద ౫-వేలపౌజుకు సరదారుగా (దొరగా)నుండగానొకప్పుడు ఓరుగంటి ప్రతాపరుద్రుని వెనుకటివారు హరిహర రాయలువారిమీదికి యుద్ధానికివచ్చినప్పుడు వారిని జయించినందున ఆ రాయలు వారు వీరికి ; వంకిణీ నారాయణాంకమొదలైన కొన్నిబిరుదులిచ్చిరి.

తరువాత ఆ హరిహరరాయలువారు చంద్రగిరి, వేలూరు యీ ప్రాంతములకు వచ్చియుండినపుడు చంద్రగిరి వేలూరు యీ మధ్య మహదరణ్యముగా వుండినందున ఆయరణ్యములలో అనేకకిరాతకులుచేరి మార్గములయందు జనులు నడవకుండానున్ను వేలూరు షహరులో మిక్కిలి యుపద్రవములున్ను చేయుచుండినందున అప్పుడా యగ్గితిమ్మానాయనివారికి ఆయరణ్యములోనుండునట్టి (గుడిపాల) ప్యారకూరు, వెదురుగొండ ఈ మూడు తాలూకాలున్ను, యిందులోచేరిన అరణ్యములతోడ ఆబాదుచేయించుకొని సర్వజహగీరుగా అనుభవించుకొమ్మని ఆరాయలువారు పరవానా యిచ్చియున్నప్రకారం రాయమన్వంతరం అంత్యమువరకు సుమారు ౩౨౫ సంవత్సరముల పర్యంతం,

౧-అగ్గితిమ్మానాయనివారు
౨-అక్కప్పనాయనివారు
౩-దేవినాయనివారు
౪-పాపానాయనివారు
౫-వీరప్పనాయనివారు
౬-యర్రమనాయనివారు

వీరలాగ్గురున్ను వంశపరంపరగా ఆ గుడిపాలలోవుండి మార్గజనులను చక్కగానడిపించుచూ సంరక్షణ చేసుకొని ఆ మూడు తాలూకాలున్ను సర్వజహగీరుగా అనుభవించుచూ వచ్చిరి.

వీరిలో నాల్గవవారైన పాపానాయనివారికి వెంకటప్ప నాయనివారనియు పేరుకలదు.

వీరు మొగరాలతిమ్మినాయనివారి సహోదరియగు భద్రమ్మను వివాహముచేసుకొని కృష్ణదేవరాయలువారియొద్ద మిక్కిలి నమ్మకముగానుండినందున ఆ రాయలువారు అధిక సంతోషముతో వీరికి బంగారువంటివారని పేరుపెట్టిరి.

పిదప కొంతకాలమునకు ఓఢ్రదేశపురాయలు చంద్రగిరికోటను, ముట్టడించినపుడు ఈ వెంకటప్పనాయనివారనే పాపానాయనివారున్ను § మొగరాల తమ్మినాయనివారున్ను ఆఓఢ్రదేశపురాయలను జయించుటకుపాయంబు నాలోచించి మయకమును కలుగజేయునట్టి పదార్థములను పాలలోకలిపి ఆపాలును గొల్లలచేతనిచ్చి శత్రువుల శిబిరములోనికి తీసుకొనిపోయి విక్రయించమని పనుపగా ఆ సేనాజనులు యీ పాలునుతీసి త్రాగి మయకముతోనుండిరి. అంతట వీరలిద్దరున్ను ౩౦౦, ౪౦౦, మందిసైనికులయొద్ద ఆయుధములు దాచబడిన కసువుమోపులను యిచ్చి హెచ్చువెలచెప్పి రాత్రివరకు అచ్చటనే కాలముగడుపుచుండుమనియు తాము చేయుగుర్తులను తెలుసుకొని యుద్ధముచేయమనియు వారికిచెప్పిపనుపి తాము పశువులకొమ్ములకు నూనెతడిపిన గుడ్డలుచుట్టి, కొమ్ములు, తుడుములు, తప్పెట్లు మొదలగు అనేకవాద్యములను సిద్ధముగావుంచుకొని ఆ పశువుల కొమ్ములకు అర్ధరాత్రిలో నిప్పువెలిగించి వాద్యములతో పశువులతోలుకొని శత్రుసైన్యములమీదికిపోగా ముందు కసువుమోపులు యెత్తుకొనిపోయియుండినవారు, ఆ కసువుమోపులలోని ఆయుధములను తీసుకొని శత్రువులను నరకనారంభించిరి, అంతట పశువులను తోలుకొని అనేకసేనాసమేతముగా, తమ్మినాయనివారున్ను, వెంకటప్పనాయనివారున్ను, శత్రుసైన్యములందు ప్రవేశించి యుద్ధముచేయగా శత్రువులు నలుదిక్కుల పరువులిడిరి. అప్పుడు వార్లను వెంబడించిపోయి, ఓఢ్రదేశపురాయలను నరికి శిరస్సును చేతపట్టుకొని మరునాడువుదయానకు కృష్ణదేవరాయలవారికి చూపగా వారుమిక్కిలి సంతోషముతో మీకేమికావలయునో కోరమని యడిగిరి. అప్పుడు మొగరాలతమ్మినాయనివారు అతిసుందరియగునొక రెడ్డికూతురినిన్ని తిరుపతి సమీపమందుండు మల్లవరమను గ్రామమునున్ను అడగగా ఆప్రకారం యిచ్చినదిగాక,

౧-(గండభేరుండపక్షి) చెక్కినచేతికడియము
౨-గుఱ్ఱము తలపైనకట్టే బంగారుతో చేయబడిన సింహలలాటము
౩-బంగారు యెరుకులబుట్ట
౪-గుఱ్ఱము కడుపుక్రిందకట్టే బొడ్డుఘంట
౫-కత్తిపిడికివేసే పక్షిపువ్వు వీటినిచ్చెను.

---

§ మొగరాల తమ్మినాయనివారు వనమూలికలయొక్క ప్రభావమును దెలుపునట్టి శాస్త్రములను తెలిసినవారుకాబట్టిమయకముగల పదార్థములను పాలలో కలిపి, ఆ పాలును శత్రువులశిబిరమునకు విక్రయించను పంపినారు.

వెంకటప్పనాయనివారనే పాపానాయనివారికి

౧-కళిశపాక
౨-పోళూరు
3-ఆరణి
౪-పాలనాటు అగరం ఈ గ్రామములున్ను,

తలరుమాలుకట్టే ౧-వంకిణీనారాయణవంకి
౨-కలికితురాయి
3-సింహ లలాటము
౪-తలగుడ్డకుకట్టే చీరపెంచ ఈ బహుమానములున్ను యిచ్చిరి,

ఎఱ్ఱమనాయనివారు చనిపోయినపిమ్మట శాలీ॥ 1575-వ సంవత్సరములో వారికుమారులలో ౨-వవారైన అణ్ణప్పనాయనివారు పేరకూరుతాలూకా సర్వ జహగీరుగా అనుభవిస్తూవచ్చిరి.

ఆ సంవత్సరంలోనే ‡ మొగలాయి ప్రభుత్వము మహమ్మదు పాదుషాహా యిలాఖా వజీరురాజేసుల్తాన్ అబ్దుల్లాకుదుప్షాహావారు ప్రభుత్వమునకువచ్చి శాలీ వాహన శకాబ్దం 1595 వరకు యేలిన 21 సంవత్సరములలో సదరు పేరకూరు తాలూకా పాళ్యం మజుకూరుకు నజరు సంవత్సరం 1-కి పళ్లిపట్టు 3125 వరహాలు మొకరూరుచేసిరి,

పిమ్మట శాలీవాహన శకం॥ 1596 మొదలు 1609 వరకు వజీరు హసన్ఖు దుష్షాహావారు ప్రభుత్వంచేసిన సంవత్సరములు 14,

అంతు ప్రభుత్వాలు 2కి 35 సంవత్సరములవరకున్ను

అణ్ణప్పనాయనివారు 11 సంవత్సరములు.
వారికుమార్లు తిమ్మప్పనాయనివారు 16 సంవత్సరములు.
కొండమనాయనివారు 8 సంవత్సరములు,

ఈ ముగ్గురున్ను సదరు నజరు రూకలుచెల్లించుకొని అనుభవిస్తూవచ్చినారు.

పిమ్మట శాలీవాహన శకం॥ 1610 మొదలు 1629 వరకు అవుద్గాహానిజా మత్ దువలావారియిలాఖా నవాబు జులుపుఖార్ ఖాన్ సాహేబులవారు యేలిన యేండ్లు 20.

‡ ఈ మొగలాయి వంశమున్ను నాల్గవభాగంలోనే వివరించియున్నది.

శకాబ్దం 1630 మొదలు 1641 వరకు నవాబు దావూదుఖాన్ సాహేబు లవారు యేలినయేండ్లు 12,

అంతు యేండ్లు 32లో

కొండమనాయనివారు 3 సంవత్సరములు,

వారికుమార్లు బంగారునాయనివారు 29 సంవత్సరములు నజరు చెల్లించు కొని అనుభవించినారు,

పిమ్మట శాలీవాహన శకం 1642 మొదలు 1651వరకు నవాబు సాదుతుల్లా ఖాన్ సాహేబులవారు యేలినయేండ్లు 10.

ఈ సాదుతుల్లాఖాన్ సాహేబులవారు శాలీవాహనశకాబ్దం 1642-వ సం వత్సరములో చెంజి దేశింగురాజులో యుద్ధానికి పోవునపుడు ఆ బంగారునాయని వారు తనఫౌజును కూడా తీసుకొనిపోయి యుద్ధంచేసి జయించినప్పుడు ఆ బంగా రునాయనివారికి.

చిత్తూరు తాలూకాకుచేరిన మొటుకూరువగైరా గ్రామములున్ను.
సాత్గడు తాలూకాలోని నాయకనేరికిచేరిన గ్రామములున్ను.
చిత్తూరు తాలూకాలో సుంకంలోని కాలుభాగమున్ను యిచ్చి
ఈ పాళ్యమును సంస్థానము అనిన్ని.

ఈ బంగారునాయనివారికి రాజా బహద్దూరుఅనే బిరుదున్ను, ఆ సాదుతు ల్లాఖాన్ సాహేబులవారు యిచ్చినారు,

పిమ్మట బంగారునాయనివారు తనపేరట పాళ్యం కట్టించుకొని సదరు తాలూకాలున్ను కావిలీలున్ను సుంకాలున్ను అనుభవిస్తూవచ్చినారు,

పిమ్మట యీ సాదుతుల్లాఖాన్ సాహేబులవారు ఏలినయేండ్లు 10,

శాలీ॥ శకం॥ 1652 మొదలు 1654 వరకు నవాబు దోస్తల్లీఖాన్ సాహే బులవారు యేలిన యేండ్లు 3,

శాలీ॥ శకం॥ 1655 మొదలు 1657 వరకు నవాబు సబ్దరల్లీఖాన్ సాహే బులవారు యేలినయేండ్లు 3.

శాలీ॥ 1658 మొదలు 1659 వరకు మహమ్మదు సైదుఖాన్సాహేబులవారు యేలినయేండ్లు 2,

శాలీ॥ 1660 మొదలు 1669 వరకు నవాబుఅనువర్దీఖాన్ సాహేబులవారు యేలిన యేండ్లు 10.

అంతు ప్రభుత్వాలు 5-కి యేలినయేండ్లు 28-కి

రాజా బంగారునాయనివారు బహదూర్ వారు 1 వంవత్సరం.

రాజా వెంకటప్పనాయనివారు బహదూర్ వారు 5 సంవత్సరములు.

రాజా వీరప్పనాయనివారు బహదూర్ వారు 6 సంవత్సరములు.

రాజా చంద్రశేఖరనాయనివారు బహదూర్ వారు 9 వంవత్సరములు.

రాజా వెంకటవీరప్పనాయనివారు బహదూర్ వారు 7 సంవత్సరములు.

ఈ అయిదుగురున్ను పైకనిన నజరు చెల్లించుకొని అనుభవిస్తూవచ్చినారు.

శాలీ॥ శకం॥ 1670 మొదలు 1716 వరకు నవాబు వాలాజావారి తమ్ములు నశీరజ్దౌలావారు యేలిన యేండ్లు 47లో ముందు యిస్తూవుండిన నజరు పేష్కేస్తుగా మొకదూరు చేసినమేరకు సం॥రం మార్చి సం॥రం పల్లిపట్లు 1562½-వరహాలు మేరకు వారి ప్రభుత్వం 47 సం॥రములు.

శాలీ॥ శకం॥ 1717 మొదలు 1722 వరకు నవాబు ఉమదత్తులుమరావారు యేలినయేండ్లు 6 అంతు సంవత్సరములు 53 వరకు.

రాజా వెంకటవీరప్పనాయనివారు బహదూర్ వారు 23 సం॥రములు.

† రాజా చంద్రశేఖరనాయనివారు బహదూర్ వారు 30 సం॥రములు.
పైకనినమేరకు పేష్కేస్తి చెల్లించి అనుభవిస్తూవచ్చిరి.

శాలీ॥ శకం॥ 1723కు సరియైన క్రీస్తుపుట్టిన 1801 సం॥రం ఆగస్టు నెల 21 తేది ‡ కంపెనీవారి స్వాధీనం చేసుకున్నారు.

---

† ఈ రాజా చంద్రశేఖరనాయనివారు బహదూరువారు అన్నదానమునకు పాతేరు అను గ్రామమును దానంచేసి శ్లో॥ శ్రీచంద్రశేఖరో రాజా। స్వసత్రంపరిపాలయన్। పాతేరనామకంగ్రామం। ధారాపూర్వంప్రదత్తవాన్। అని శాసనములు వేయించి శాలీ॥ శకం॥ 1732కు సరియైన 1810 సం॥రం జూలై నెల 3-వ తేది కాలంచేసినారు.

‡ కంపెనీవారి మన్వంతరము ౪-వ భాగంలో వున్నది.

పిదప క్రీస్తుశకం ౧౮౦౨-వ సంవత్సరమునందు పాళెములు జప్తీఅయినవి. అదిమొదలు రాజా చంద్రశేఖర నాయనివారు బహదూర్ వారి కుమార రాజా పెద్ద రామప్పనాయనివారు బహదూర్ వారి కాలము కడవరకున్ను జప్తీలోనే యుండినవి.

పిమ్మట ౧౮౨౯-వ సంత్సరము నవంబరు నెల ౨౧-తేది రాజా పెద్దరామప్ప నాయనివారుబహదూర్ వారి కుమార రాజా రామదాసప్పనాయనివారుబహదూర్ వారు రాజ్యాభిషిక్తులై రొంపుచెర్లపాళెము పాళేగారువారగు బాలకృష్ణమనాయని వారి 3-వ కుమార్తెయగు నాగమ్మగారు ౪-వ కుమార్తెయగు అక్కమ్మగారు వీరి నిద్దరినిన్ని వివాహము చేసుకొనిరి.

పిదప కొన్నిదినంబులకు వీరలిద్దరున్ను సంతతిలేకనే కాలధర్మమును పొందిరి.
అనంతరము ఆరాజా రామదాసప్పనాయనివారు బహదూర్ వారు
పులిచెర్ల పాళెము వెంకటప్పనాయనివారి కుమార్తెయగు సుబ్బమ్మగారినిన్ని,
నెల్లిపట్లపాళెము కుమారనాయనివారి జ్యేష్ఠకుమార్తెయగు వెంకటమ్మగారినిన్ని,
౧౮౪౧-వ సంవత్సరం సెప్టెంబరు నెల ౨-తేదికి సరియైన ప్లవనామసంవత్సర శ్రావణబహుళ ౮-బృహస్పతివారమునాడు వివాహము చేసుకొనిరి.

వీరిలో సుబ్బమ్మగారికి
- చంద్రశేఖరనాయనివారు
- పెద్దరామప్పనాయనివారు
- సుబ్బరామప్పనాయనివారు
- కుమారసామి నాయనివారు
- ముద్దు శివరామదాసప్పనాయనివారుఅని పేరుగల
- ౫-మంది కుమారులున్ను నలుగురు కుమార్తెలున్ను కలిగిరి.

వెంకటమ్మ గారికి
- ఇప్పుడు పాళెగారు వారుగానుండు శేషమనాయనివారనే (శేషాచలపతిరాజులుంగారు)
- వెంకటప్పనాయనివారు
- ఎదురుగొండ ముద్దురామప్పనాయనివారు అని పేరుగల
- ముగ్గురు కుమారులున్ను ముగ్గురు కుమార్తెలున్ను కలిగిరి.

అనంతరము ఆరాజా రామదాసప్పనాయనివారు బహదూర్ వారు బంగారు రాజ్యమును ధర్మమార్గమున పాలించుచు శివపూజాధురంధరులై అష్టైశ్వర్య సంపదలు కలిగియుండి క్రోధన సంవత్సర మాఘబహుళవిదియునాడు శివపదమునొందిరి.

పిదప వారి 3-వ భార్యయగు సుబ్బమ్మగారి పెద్దకుమారులగు చంద్రశేఖర నాయనివారు రాజ్యాభిషిక్తులై పుల్లూరుపాళెం రామప్పనాయనివారి జ్యేష్ఠభార్యయున్ను ※ రాజారామదాసప్పనాయనివారు బహదూర్ వారి తాతగారికి కూతురి

※ రాజారామదాసప్పనాయనివారు బహదూర్ వారి తాతగారికూతురిబిడ్డలసంగతి ౫౦-వ పుటలోవున్నది.

బిడ్డయగు చిన్నఅమ్మణిగారి కుమార్తెయున్ను అయిన వన్నూరమ్మగారి కుమార్తెయగు బంగారమ్మను ప్రజోత్పత్తినామసంవత్సర ఆశ్వయుజమాసములో వివాహముచేసుకొని ప్రభుత్వము చేయుచుండిరి.

ఇట్లుండగా బంగారుపాళెమునకు చేరిన మొగిలియను హరిహరక్షేత్రమునందు జరుగునట్టి మహాశివరాత్రి మహోత్సవనిమిత్తముగా ప్రజోత్పత్తినామసంవత్సర మాఘబహుళ చతుర్దశినాడు రాజా-రామదాసప్పనాయనివారు బహదూర్‌వారి కుటుంబము వారందరున్ను ఆ హరిహరక్షేత్రమునకు పోయియుండిరి.

అప్పుడు రాజా రామదాసప్పనాయనివారు బహదూర్‌వారి జ్యేష్ఠ కుమారులున్ను ఇప్పటి పాళెగారువారున్ను అయిన శేషమనాయనివారనే (శేషాచలపతి రాజులుంగారు) తమ అంతస్థుకుతగని మర్యాదలుకొన్ని యచ్చట జరిగినందువల్ల, పిమ్మట స్వల్ప కాలములోపలనే అనగా ఆంగీరసనామ సంవత్సర చైత్రశుద్ధ ౮-గురువారమునాడు పగలు ౩-ఘంటలకు బంగారుపాళెము అనే రామప్రసన్నేశ్వరపురమును విడచి వెడలి మొగిలికిపోయి శుక్రవారమునాడు శ్రీ మొగిలి కామాక్షీదేవికి అర్చనలుచేయించి తనకు బంగారురాజ్యము లభించునని పుష్పమువడసి శనివారము మధ్యాహ్నమచ్చోటినుండివెడలి కుడిపాలపాళెం పాళెగార్ సుబ్బరామప్పనాయనివారియొద్దకు పోయిచేరిరి.

పిమ్మట కడపజిల్లాను చేరిన ఘట్టుపాళెములో పాపానాయనివారి భార్యయున్ను ※ రాజా రామదాసప్ప నాయనివారు బహదూర్‌వారి తాతగారికి కూతురిబిడ్డయగు పెద్దఅమ్మణిగారి కుమార్తెయున్ను అయిన సుబ్బలక్ష్మమ్మగారి కుమార్తెయగు వెంకటసుబ్బమ్మగారిని ఆ శేషమనాయనివారనే శేషాచలపతిరాజులుంగారికి ఇచ్చి వివాహముచేయునట్లు నిశ్చయింపబడి కడపజిల్లా కడపపట్టణమునకు పశ్చిమము ౫-మైళ్లదూరమునుండు కొత్తపేటయను గ్రామమునందు ఆంగీరసనామసంవత్సర భాద్రపదశుద్ధ తదియతోచేరిన గురువారమునాడు వివాహమహోత్సవము జరిగినది.

※ రాజా రామదాసప్ప నాయనివారు బహదూర్‌వారి తాతగారైన రాజాచంద్రశేఖరనాయనివారికి నాగమ్మగారు అని కుమార్తెయుండెను ఆమెను మొగరాలపాళెం పాళెగార్ చెన్నప్పనాయనివారికి యిచ్చియుండిరి. ఆనాగమ్మగారికి పెద్దఅమ్మణిగారు చిన్నఅమ్మణిగారు అని యిద్దరు కుమార్తెలుకలిగిరి. వారల నిద్దరనిన్ని (కుడిపాల) అను గుడిపాటిపాళెంపాళెగార్ వారగు శేషమనాయనివారికియిచ్చియుండిరి.

వీరలిద్దరిలో

పెద్దఅమ్మణిగారి కుమార్తె సుబ్బలక్ష్మమ్మగారు. వీరిని ఘట్టుపాళెములో పాపానాయనివారికి యిచ్చియుండిరి.	చిన్న అమ్మణిగారి కుమార్తె వన్నూరమ్మగారు. వీరిని పుల్లూరుపాళెం రామప్పనాయనివారికి యిచ్చియుండిరి.

ఈ వివాహమునకు కుడిపాలపాళెం పాళెగారువారైన సుబ్బరామప్పనాయనివారున్ను పులిచెర్లపాళెం పాళెగారువారైన వెంకటతిమ్మప్ప నాయనివారున్ను కుటుంబసమేతముగావచ్చి వివాహమువాతృత్రమును జరిపించి పిదప కడపపట్టణమునకు సమీపమునయుండు పుష్పగిరిస్వామిని సేవించి యుత్తరపినాకినీ మహానదీ దర్శనముచేసి తమతమ రాజ్యంబులుచేరిరి.

పిదప బంగారు శేషమనాయనివారనే శేషాచలపతి రాజులుంగారు కొన్ని దినంబులాకొత్తపేటలోనుండి మరల గుడిపాలపాళెమునకు వచ్చిచేరి రాజారామదాసప్పనాయనివారు బహదూర్‌వారి కుమారులలో తాము సర్వజ్యేష్ఠులు కాబట్టి తమకు బంగారురాజ్యము లభించవలయుననిన్ని సర్కారుస్టాంపు కట్టి వ్యాజ్యమాడుటకు తనకు ధనసహాయములేదనిన్ని మొదటవ్యాజ్యము ప్రారంభించిరి.

ఈ వ్యాజ్యము కుంభకోణమునుంచి చిత్తూరిలోవచ్చియుండిన హైకోర్టువక్కీలు బి. యె బి. యెల్. అయ్యాసామయ్యగారివల్ల ౧౮౭౫-వ సంవత్సరం అక్టోబరు నెల ౨౧-తేదిన చిత్తూరుజిల్లా న్యాయస్థానమున సి. జి. ప్లమ్మరు దొరగారివద్ద దాఖలుచేయబడినది. అప్పుడా న్యాయాధిపతిగారు స్టాంపుకుపైకమునిచ్చి వ్యాజ్యము తేవలయునని యావ్యాజ్యమును తోసివేసిరి.

ఆ వెనుక ౧౮౭౬-వ సంవత్సరం ఆగష్టునెల ౪-వ తేదికి సరియైన ధాతృనామసంవత్సర శ్రావణశుద్ధ ౧౪-శుక్రవారం వరలక్ష్మీవ్రతమునాడు రాజా రామదాసప్పనాయనివారు బహదూర్‌వారి ౩-వ భార్య కుమారులగు చంద్రశేఖరనాయనివారి భార్య బంగారమ్మగారు ఋతుమతికాకనే కాలముచేసిరి. పిదప ఆదినమునకు ౨౫-వ దినమైన ౧౮౭౬-వ సంవత్సరం సెప్టంబరునెల ౨-తేది ఆ చంద్రశేఖర నాయనివారున్ను కాలధర్మమునొందిరి.

పిమ్మట వారితమ్ములగు పెద్దరామప్ప నాయనివారు పాళెమును స్వాధీనముచేసుకొనగా వీరికన్నైన రాజా రామదాసప్పనాయనివారు బహదూర్‌వారి ౪-వ భార్య కుమారులున్ను సర్వజ్యేష్ఠులున్ను ఇప్పటి పాళెగారువారున్ను అయిన శేషమనాయనివారనే శేషాచలపతి రాజులుంగారు వయోజ్యేష్ఠత్వమువల్ల బంగారు రాజ్యమునకు తాము ముఖ్యబాధ్యులని ముందు ౧౮౭౫-వ సంవత్సరం అక్టోబరునెల ౨౧ తేది చిత్తూరుజిల్లా న్యాయస్థానమున దాఖలుచేయబడి ఆ న్యాయాధిపతిగారివల్ల తోసివేయబడిన వ్యాజ్యమునకు స్టాంపుకట్టి పైకనిన హైకోర్టువక్కీల్ బి. ఎ. బి. యల్. అయ్యాసామయ్యగారివల్ల చిత్తూరు సీవిల్ కోరటులో ౧౮౭౬-వ సంవత్సరం సెప్టంబరు నెల ౧౬-తేది ౨౪-వ నెంబరు వ్యాజ్యమువేసి పాళెమును సీవిల్ కోర్టువారి స్వాధీనముగానుండునట్లు చేయించిరి.

పిదప ఈ వ్యాజ్యములో ౧౮౭౭-వ సంవత్సరం మార్చినెల ౨౯-వ తేదికి సరియయిన ఈశ్వరనామ సంవత్సర చైత్రశుద్ధ చిత్రాపూర్ణిమ గురువారమునాడు

మధ్యాహ్నం ౧౨-ఘంటలకు శేషమనాయనివారనే శేషాచలపతిరాజులుంగారు బంగారు పాళెమునకు బాధ్యులని సీవిల్ జడ్జి సి. జి. ష్ణమరుధారగారు తీర్పుచేసిరి.

పిదప పైకనిన పెద్దరామప్పనాయనివారు చెన్నపురి హైకోర్టులో అప్పీలు చేయుగా ౧౮౭౭-వ సంవత్సరము నవంబరు నెల ౯-తేది గురువారమునాడు చిత్తూరు జిల్లాకోర్టు తీర్మానమునే హైకోర్టువారున్ను స్థిరపరచిరి.

అందుపైన శేషమనాయనివారనే శేషాచలపతిరాజులుంగారు బంగారు రాజ్యమును న్యాయాధిపతులవల్ల స్వాధీనపరచుకొనిరి.

పిమ్మట పెద్దరామప్పనాయనివారు ఇంగ్లాండు అను ద్వీపమునకు ముఖ్యపట్టణమున్ను ఇండియా చక్రవర్తినీ శ్రీరాణీగారి రాజధానియున్ను అయిన లండనుపట్టణములోనుండు శ్రీచక్రవర్తినీగారి ప్రీవీకౌన్సల్ సభలో అప్పీలుచేయగా అచ్చటను న్ను ౧౮౮౦-వ సంవత్సరం నవంబరు నెల ౧౧-వ తేది మదరాసు హైకోర్టుతీర్పునే ఆసభవారు ఖాయపరచినారు.

అది మొదలు ఈబంగారుపాళెమును బంగారురాజా రామదాసప్పనాయనివారు బహదుర్ వారి జ్యేష్ఠకుమారులైన బంగారు ముద్దుశేషమనాయనివారనే శేషాచలపతి రాజులుంగారు యెదురులేని శాశ్వతైశ్వర్యముతో పరిపాలించుచున్నారు.

పిమ్మట వీరు ప్రమాదినామసంవత్సర భాద్రపదబహుళ ౧౩-శనివారమునాడు తిరుపతి శ్రీ వేంకటరమణస్వామివారికి ప్రార్థనలు చెల్లించుటకుగాను సూటిబీగాలతోడ ప్రయాణము వెడలి అమావాస్యనాడు కొండయెక్కి శ్రీస్వామివారిని సేవించి ప్రార్థనలు చెల్లించి ఆకాశగంగ గోగర్భము ఈ తీర్థములయందు స్నానముచేసి క్షేత్రపాలశిలాదర్శనము చేసుకొని శ్రీస్వామివారి దర్శనము చేసుకొనుచు మూడుదినములా దివ్యక్షేత్రవాసము గావించి దిగువతిరుపతికివచ్చి అచ్చట శ్రీగోవిందరాజస్వామివారినిన్ని శ్రీరామస్వామివారినిన్ని సేవించి తిరుచ్చానూరు అను శ్రీశుకపురమునందు పద్మావతీదేవియని పేరుగల అమ్మవారిని సేవించి అచ్చటినుంచి వెడలి తమరాజధానికివచ్చిచేరిరి.

పిదప తారణసంవత్సరాశ్వయుజ మాసంబున హంపివిరూపాక్షమని పేరుగల మహాక్షేత్రయాత్రార్థముగా వెడలి యద్దివ్యక్షేత్రమునకుపోయి శ్రీస్వామివారిని సేవించి తుంగభద్రా నదీస్నానముచేసి మాతంగ మాల్యవంత హేమకూట ఋశ్యమూక పర్వతములనుమాచి పంపాసరోవర మానస సరోవరంబులను పుణ్యతీర్థములందు స్నానముగావించి • వాలిభండారము వాలికాష్ఠము శ్రీ విద్యారణ్యస్వాములవారు ప్రభుత్వముచేసిన రాజధానియగు విజయనగరము ఇట్టి విశేషస్థానములెల్ల వీక్షించి తారణసంవత్సరాశ్వయుజ శుద్ధ దశమీదినంబున శ్రీవిరూపాక్షస్వామివారి శమీపూజ నోత్సవంబును సేవించి మరలి తమ రాజధానికి వచ్చిచేరిరి.

ఆవెనుక కొన్నిదినంబులకు వీరి ప్రథమభార్యగారయిన వెంకటసుబ్బమ్మగారు కాలధర్మమునొందినందువల్ల ద్వితీయవివాహము చేసుకొనవలసినదిగా తటస్థించినది.

అప్పుడు కల్లూరుపాళెమునకుచేరిన పాపిరెడ్డివారిపల్లె యినాముదార్ వారసింహరాజుగారి కుమార్తెయగు ❁ లక్ష్మమ్మగారుఅనే కన్యకను ఆ బంగారు ముద్దుశేషాచలపతి రాజులుంగారు వివాహము చేసుకొనునట్లుగా యోచనచేసి ఆ పాపిరెడ్డిపల్లెలో పార్థివనామ సంవత్సరాషాఢశుద్ధవిదియ సోమవారమునాడు రాత్రి ౯-ఘంటలకు పండ్లు పసుపుయిచ్చి వివాహ నిశ్చయముగావించిరి.

అటుపిమ్మట పెద్దలవల్ల వివాహముహూర్తము నిశ్చయింపబడి బంగారుపాళెమునకు చేరిన దాసరేపల్లెయను గ్రామంబున పార్థివనామసంవత్సర శ్రావణశుద్ధపాడ్యమి బుధవారమునాడు రాత్రి ౧౨-ఘంటలకు వివాహమహోత్సవము మిక్కిలి విభవముతో జరిగినది.

బంగారుపాళెము పాళేగార్ వారగు శేషమనాయనివారనే
శేషాచలపతి రాజులుంగారు కుటుంబసమేతముగా కాశీయాత్రచేయుట.

పిమ్మట కొన్నిదినములు బంగారు పాళెమునకుచేరిన వెంకటగిరిలో వాసము చేయుచుండి సర్వధారినామసంవత్సర ఫాల్గుణబహుళ పాడ్యమి భానువారమునాడు రాత్రి ౧౨-ఘంటలకు అచ్చటినుంచి శ్రీ కాశీయాత్రార్థముగా వెడలి చిత్తూరులో తాము స్వయముగా నివేశనముకొని నూతనముగా కట్టించియుండు స్వర్ణమహల్ అను మందిరంబునందు ప్రవేశముగావించి కొన్నిదినంబు లచ్చట వాసముచేసి అచ్చటినుంచి తిరుపతికిపోయి రేణిగుంటలో రైలెక్కి గుంతగల్లుకుపోయి యొకరాత్రి యచ్చోట వసియించి మరునాడు రైలెక్కి బళ్లారిజిల్లా మార్గముగా హొసపేటలో, రైలుదిగి అచ్చట దైవరహితంబైన యనంతశయనదేవాలయముయొక్క గొప్పగోపుర

❁ బంగారు ముద్దుశేషాచలపతిరాజులుంగారి ద్వితీయ భార్యగారైన
(బంగారు లక్ష్మమ్మగారి) వంశక్రమము.

కొంపుచెన్నపాళెం బాలకృష్ణమనాయనివారికి ఎల్లమ్మగారనే భార్యయుండిరి వారికి ౭-మంది కుమార్తెలు కలిగియుండిరి. వారలలో ౩-వ కుమార్తెయగు నాగమ్మగారినిన్ని ౪-వ కుమార్తెయగు అక్కమ్మగారినిన్ని బంగారురాజా రామదాసప్పనాయనివారు బహదుర్ వారికి యిచ్చియుండిరి. మొదటి కుమార్తెయగు చెన్నమ్మగారిని చట్టేవారిపాళెములోయిచ్చియుండిరి. ఆ చెన్నమ్మగారికి అయిదుమంది కుమార్తెలు కలిగియుండిరి. వారలలో కొండమ్మగారని పేరుగల మొదటికుమార్తెను కల్లూరుపాళెంపాళేగార్ వారైన కదిరీపతిరాజులుంగారికి యిచ్చియుండిరి ఈ కదిరీపతిరాజులుంగారి కుమారులు యిప్పటి పాళెగార్ వారయిన అహోబలరాజులుంగారు మరియు ఆచెన్నమ్మగారి రెండవకుమార్తెయగు పాపమ్మను గానుగచింతపాళెములోనున్ను ౩-వ కుమార్తెయగు వెంకటమ్మగారిని ముదుపుగుంటపాళెములోనున్ను ౪-వ కుమార్తెయగు మంగమ్మగారిని దొడ్డిపల్లెపాళెములోనున్ను ౫-వ కుమార్తెయగు బాలమ్మగారిని పాపిరెడ్డివారిపల్లె యినాముదార్ వారసింహరాజుగారికిన్ని యిచ్చి వివాహముచేసియుండిరి ఈ బాలమ్మగారికుమార్తెగారు (బంగారు లక్ష్మమ్మగారు.)

ముకు వీక్షింపుచు ఆ గ్రామమునందు నిలచి స్నానదేవపూజాది నిత్యకృత్యములు నెరవేర్చుకొని భోజనానంతరంబు నందచ్చటినుంచి ౬-మైళ్లదూరమునందుండు హేమకూటంబను పర్వతంబును చూచుటకై సపరివారంబుగా విజయంబుచేసి యాపర్వతంబుపైన వేంచేసియుండు వినాయకుని సేవించి దానికిచేరినట్లుగా వుత్తరదిక్కున నుండు హరిహరక్షేత్రంబగు ※ హంపివిరూపాక్షంబను దివ్యక్షేత్రమందు స్వామి వారిని సేవించి యారాత్రి యచ్చోట వాసముచేసిరి.

మరునాడుదయమున నిత్యకృత్యములను నెరవేర్చుకొని యాదేవాలయమునకు సమీపంబుననుండు మాల్యవంతమని పేరుగల పర్వతంబుపైకి దయచేసి యచ్చట శ్రీ రామలక్ష్మణులు వాలిని సంహరించిన వెనుక వర్షాకాలము ౪-మాసములు వసింపుచుండిన స్థలమున్ను దైవరహితమైన యొక దేవాలయమున్ను చూచి పర్వతము నుండిదిగి అచ్చోటికి ఉత్తరదిక్కునందొక మైలుదూరంబున పూర్వము విద్యారణ్య స్వాములవారు ప్రతిష్ఠ్యముచేయుచుండి ఇప్పుడు పాడుపడియుండు విజయనగరమను పట్టణమున్ను దానిచుట్టు కోటయున్ను ◎ విద్యారణ్యస్వాములవారి మందిరమున్ను ఆమాల్యవంతపర్వతమునకు తూర్పు కొంతదూరమునందుండు మాతంగ పర్వతమున్ను చూచి మరియు మాల్యవంతమున కుత్తరముగా కొంతదూరంబున విఠ్ఠల దేవునియాలయంబును రాతిరథంబును దానికి తూర్పుగా సమీపంబుననుండు వాలికోష్టంబును వీక్షించి హంపివిరూపాక్ష దేవాలయమున కుత్తరదిక్కున ప్రవహింపుచుండు తుంగభద్రానదియందు స్నానంబుచేసి యాదినంబచ్చట క్షేత్రవాసముగావించి మరుదినము ప్రాతఃకాలంబున యెప్పటియట్ల నిత్యకృత్యంబులు నెరవేర్చుకొని తుంగభద్రానదిలోదిగి ఋశ్యమూక పర్వతముయొక్క పశ్చిమభాగమున వెడలి ప్రదక్షిణముచేయుచు మరల తుంగభద్రానది శాఖనుదాటి సర్వధారిసంవత్సరఫాల్గుణ అమావాస్య పుణ్యకాలంబున పంపాసరోవరమానస సరోవరంబులలో స్నానాది కృత్యంబులుగావించి కిష్కింధపర్వతమునకు దక్షిణమార్గముగా వెడలి ఆనగొంది సంస్థానమార్గంబున తుంగభద్రాసంగమ స్థానమందు పడవయెక్కి వెంకటాపురంబను గ్రామమువద్ద గట్టుచేరి వాలికోష్టమును చూచి విరూపాక్షమునకువచ్చి విరోధినామ సంవత్సరము సంవత్సరాదిపండుగనాడు స్వామినిసేవించి యచ్చట ౩-దినంబులు క్షేత్రవాసముగావించిరి.

పిమ్మట ౪-వదినంబున మరల హొసపేటకువచ్చి రైలెక్కి రాయచూరు మార్గముగా శోలాపూరుచేరి యచ్చటికి సుమారు ౬-మైళ్లు దూరమునందుండు

※ హంపి విరూపాక్షస్వామి దేవాలయమునందు బిష్టప్పయ్య గోపురమని యున్నది. ఆగోపురమునడుమ క్రిందినుండి పైవరకు నొకబిలమున్నది ఆ బిలములో పలనే గోపురముపైవరకు యెక్కిపోవుటకు పొందికగా మెట్టికలు కట్టియున్నవి.

◎ విద్యారణ్యస్వాములవారి మందిరంబునకు భానవాల్ దొర యాశ్రమంబనియు పేరుగలదు.

పాండురంగవిఠోబాస్వామి దర్శనముచేయుచు ౫-దినములుండి పునహాపట్టణమార్గముగా బొంబాయిపట్టణముచేరి యాపట్టణవైభవమున్ను సముద్రములో గొప్ప పర్వతములు తెలియుచుండుట, సముద్రము అలలులేకయుండుట, యిట్టి విశేషములున్న చూచుచు ౫-దినములుండి కల్యాణిమార్గముగా నాసికజిల్లాచేరి నాసికపట్టణమునకున్ను పంచవటికిన్ని మధ్య ప్రవహించుచుండు గోదావరీనదిలో స్నానముచేసి పంచవటిగ్రామమునకు నొకమైలుదూరమున శ్రీరాములవారు సీతాలక్ష్మణసమేతులై వాసముచేసిన పంచవటీ (అనగా ౫-మఱ్ఱిచెట్లుగల) క్షేత్రమున్ను అచ్చోటికి పడమట కపిలానదీ గోదావరీనదీ నీటి సంగమస్థానంబున లక్ష్మణ స్వామివారు శూర్పణఖకు ముక్కు చెవులు కోసిన స్థానమున్ను పంచవటిగ్రామమునకు వెలుపల సీతాదేవిని రావణుడు యెత్తుకొనిపోయిన స్థలమున్ను అచ్చటికి తూర్పుగా ౨-మైళ్లదూరమున సీతాదేవి స్నానముచేయుచుండిన సీతాసరస్సున్ను పంచవటికి ౧౨-మైళ్లుదూరంబుననుండు త్రియంబకమను శివక్షేత్రమున్ను ఇచ్చట గోదావరిపుట్టిన స్థలమున్ను సేవించి సీతాసరస్సుకు ఉత్తరమున ౨-మైళ్లదూరముననుండు జైనదేవాలయమును చూచి పంచవటీక్షేత్రంబునందు ౧౨-దినంబులు వాసముజేసిరి.

పిదప అచ్చటినుంచి వెడలిఖాండవనంబను పట్టణంబునకుపోయి యచ్చట ౨-దినములుండి వెడలి జబ్బల్‌పూరుచేరి యాపురంబునకు దక్షిణదిక్కునందు ౫-మైళ్లదూరముననుండు నర్మదానదియందు స్నానముగావించి యాజబ్బల్‌పూరిలో ౫-దినములుండి యచ్చటినుంచి రీవాపట్టణమార్గముగా ప్రయాగక్షేత్రమునకుపోయి ధారాగంజియను పట్టణములో దిగి యాపట్టణంబునకతి సమీపంబున ప్రవహింపుచుండు శుద్ధగంగయందున్ను గంగా యమునా సరస్వతీ ఈ ౩-మహా నదులున్ను చేరునట్టి త్రివేణీ సంగమస్థానమునందున్ను స్నానంబుగావించి అలహాబాదుకోటలో పల మఱ్ఱిచెట్టువద్దనుండు సరస్వతీతీర్థమున్ను పట్టణవైభవమున్ను చూచుచు ౬-దినంబులు ప్రయాగ క్షేత్రవాసంబుగావించి యచ్చటినుంచి వెడలి శ్రీకాశికి పోవుచు నప్పట్టణంబునకు తూర్పు ౩-మైళ్లదూరమునుంచి తెల్లటిపర్వతమువలె కనుపించుచుండునట్టి శ్రీకాశీపట్టణమును దర్శనముచేసుకొనుచు గంగానదినిదాటి విరోధిసంవత్సర వైశాఖశుద్ధ త్రయోదశీ సోమవారమునాడు మధ్యాహ్నము ౧౪-ఘంటలకు శ్రీకాశీపట్టణముచేరిరి.

ఆనంతరము అద్దివ్యక్షేత్ర దర్శనంబున సంతుష్టచిత్తులై గంగాస్నానముచేయుచు శ్రీవిశ్వేశ్వరవిశాలాక్షీరామలక్ష్మణసీతా దివ్యాలయములనున్ను జ్ఞానవాపీతీర్థమున్ను సేవింపుచు మరియును మహోన్నతముగా వేంచేసియుండునందికేశ్వరుని సేవించి శ్రీఅన్నపూర్ణాఢుండీగణపతి వీరిదివ్యాలయములనున్ను సేవించి ఆయాదేవాలయములయందు స్వామివారిని పరమానందంబుతో దర్శనవందనాదులుగావించుకొనుచు కృతార్థులైఢుండీగణపతి దివ్యాలయమునకు పడమటిదిక్కు నందొక మైలుదూరంబునందుండు పాతగంగనున్ను అచ్చటికి నిఋఋతిదిక్కున శ్రీబదరీనారాయణాశ్రమమునకు పోవు

నట్టి మార్గమున్ను సేవించి వక్రతుండగణపతి సురాభాండేశ్వర కాలభైరవుల దర్శనంబుగావించి కాలభైరవసూత్ర కంకణంబు ధరియించి పిమ్మట దండపాణిదర్శనంబును కేదారేశ్వర దర్శనంబునుగావించి హరిశ్చంద్రఘట్టమునం దారాజు కావలియుండిన యొక చిన్నమిద్దెనున్ను కాశికిదక్షిణంబుననుండు శ్రీరామదేవాలయంబున్ను చూచి పడవయెక్కి వ్యాసకాశికిపోయి స్వామిదర్శనము చేసుకొని మరల కాశికివచ్చి యచ్చటనుంచి రైలెక్కి డెనపూరికిపోయి రాత్రి యచ్చోటవసియించి మరునాడుదయమున రైలెక్కి పాటలీపురమార్గముగా గయాక్షేత్రమునకుపోయి ఫల్గునీ తీర్థస్నానము అష్టగయాశ్రాద్ధము ఇవిగావించి ప్రేతపర్వతముపైన నొకబండయందు వెంట్రుకలావుతోనుండు బంగారురేఖలపైన పితరులకు పిండదానంబుగావించి రామపర్వతము మధువనము కోలాహలపర్వతము వీటినిచూచుచు రామగయ భీమగయ కాకబలి వీటియందున్న అక్షయవటంబను మఱ్ఱిచెట్టుక్రిందనున్న శ్రాద్ధంబులుగావించి ౧౬- విష్ణుపాదములయందున్న బ్రహ్మతీర్థమువద్దనున్న పిండదానంబులుగావించి గయావళి బ్రాహ్మణులకు తృప్తిగావించి యద్దివ్యక్షేత్రంబునం దారుదినంబులు క్షేత్రవాసముచేసిరి

ఆ వెనుక పునహామార్గంబుగా పాటలీపురంబు (అనగాపాట్నా) నుంచి బ్యాంకిపూరికిపోయి రాత్రి యచ్చటనుండి మరునాడుదయమున రైలెక్కి ౯-ఘంటలకు మరల కాశీపట్టణముచేరి ౧౬-దినంబులు కాశీవాసముగావించి యచ్చటినుంచి నయనీయను పట్టణంబునకువచ్చి శుద్ధగంగయెత్తుకొని రీవా జబ్బల్‌పూరు నరసింగపూరు బుసావర్ మన్మూరు డాండు వాడి ఈమార్గముగా కృష్ణానదికివచ్చి స్నానంబుచేసి రాయచూరు కడప ఈమార్గముగా తిరుపతిలో రైలుదిగి యచ్చనుటించి బండిత్రోవన చిత్తూరువచ్చిచేరిరి.

సురాభాండేశ్వరుండొక యీడిగస్త్రీనిచూచి మోహించి బ్రాహ్మణరూపంబుతోదాని వెంటతగిలి చనిదాని ఇంటిలోనుండిరి. అప్పుడుదానిమగడు తలుపుతట్టగానది స్వామివారిని యొకకల్లుకుండలో దాచిపెట్టెను ఇందువల్ల వీరికి సురాభాండేశ్వరుండని పేరుగలిగెను. స్వామిదాగియుండిన కల్లుకుండ ౮-అడుగుల యెత్తున్ను సుమారు ౫-గజముల చుట్టుకొలతయున్ను పైభాగమున ద్వారముపైన మూతయున్ను కలిగి యిప్పటికిన్నివున్నది.

కాలభైరవాలయంబునకు రాత్రికాలంబున మహా మునులు వచ్చుచున్నారు ఇందుకు దృష్టాంతము సాయంకాలమందచ్చట వస్త్రములను పరిచియుండియుదయమునచూచితే ఆవస్త్రములపైన ఋషుల అడుగులున్ను పాదధూళిన్ని వుండును.

దండపాణిదర్శనము చేయునప్పుడచ్చటి బ్రాహ్మణుడొక గుడ్డతిరితో వీపునకొట్టుచున్నాడు.

బ్రహ్మతీర్థమువద్ద బ్రహ్మయాగముగావించిన స్థలమున్ను యాగపశువుకట్టిన యూపస్తంభమున్ను వున్నది.

అనంతర మచ్చటనుంచి తమ పాళెములోనుండు మొగిలియను మహాస్థలంబునకుపోయి శ్రీమొగిలీశ్వరస్వామివారికిన్ని శ్రీకామాక్షీదేవికిన్ని గంగాతీర్థంబుచేత మహాభిషేకంబుచేయించి కృతార్థులై మరల చిత్తూరుచేరి పరమానందంబుతో తమనివాసస్థానంబగు స్వర్ణమహల్ అను దివ్యభవనంబునందు సుఖముగా వాసముచేయుచుండిరి.

బంగారుపాళెం పాళేగారువారగు శేషమనాయనివారనే శేషాచలపతి రాజులుంగారు కుటుంబసమేతముగా రామేశ్వర యాత్రచేయుట.

పిమ్మట ఖరనామసంవత్సర ఫాల్గుణబహుళ పాడ్యమినాడు రాత్రి విదియ ఘడియలలో శ్రీరామేశ్వర యాత్రార్థముగా వెడలి చిత్తూరులో రైలెక్కి తిరుణామలకుపోయి యరుణాచలస్వామి దర్శనముచేసుకొని యచ్చటినుంచి శ్రీరంగమునకుపోయి శ్రీకావేరీమహానదీ స్నానంబుగావించి శ్రీరంగనాథస్వామివారినిన్ని శ్రీజంబుకేశ్వరస్వామివారినిన్ని శ్రీరయూరునాచ్చారు అనే అమ్మవారినిన్ని సేవించి మధురకుపోయి మీనాక్షీదేవిని సేవించి మానమధుర తిరుపవనము పరమగుడి యీమార్గముగా దేవిపట్టణముచేరి మహోదధియను సముద్రంబున స్నానంబుగావించి నవపాషాణంబుల పూజగావించి శ్రీరాముల సేవించి యచ్చట శ్రీరామనాథపురము రాజాగారు సత్కారపూర్వకంబుగానిచ్చిన దివ్యకుసుమాహారంబులగైకొని రాత్రి ౯-ఘంటలకు ¶ఓడయెక్కి పేకువఝామున ౮-ఘంటలకు పాంబన్ చేరి యచ్చటి పుణ్యతీర్థంబులయందు స్నానంబులుగావించి రామనాథపురము రాజాగారు పనుపిన మేనా

¶ ఇచ్చట ఓడయెక్కినప్పుడు జరిగిన విశేషమేమనగా,

శ్రీవారు యాత్రవెడలిపోవునప్పుడు మార్గములో మానమధురకు అవల (కాశీనుంచి రామేశ్వర యాత్రార్థముగా వచ్చిన) గోపాల బ్రహ్మచారి అను బ్రాహ్మణుడొకడు మార్గవశంబుగా తటస్థించి శ్రీవారిని అనుసరింపుచు కూడా నేవచ్చెను. ఆ బ్రాహ్మణుడు ఈ దినం వీరలతోకూడా ఓడయెక్కుటకు యత్నించి తాను పడవలోనిలచి తనచేతవుండిన గంగబిందెను ఓడలోపెట్టి ఓడను పట్టుకొని యెక్కుటకు యత్నపడగా తాను నిలచియుండిన పడవవెనుకకు పోయినందున నిలువనాధారముతప్పి సముద్రములోపడెను. అప్పుడు శ్రీవారు ఓడలోవుండినందున ఓడనుపట్టుకొనియున్న (ఆ బ్రాహ్మణుని) చెయ్యివొకచేతనున్ను పైనచెప్పిన గంగబిందె మరియొకచేతనున్ను పట్టుకొని బ్రాహ్మణుని సముద్రమునుంచి యెత్తి ఓడలోపలికి తీసుకొనిరి. ఆ సమయమందు ఒకచేతి గంగబింద భారమువుండినందువల్ల ఈ బ్రాహ్మణుని వొంటిచేతితో యెత్తడం అసాధ్యముగానుండెను. అప్పుడెవరో వొకపురుషుడు తమతోకూడా సహాయమువుండినట్లు శ్రీవారికితోచినది పిమ్మట అచ్చటవుండిన పరిజనులను విచారించగా మేమెవరున్ను తమకు సహాయమురాలేదని చెప్పిరి కాబట్టి ఆపురుషుడు పురాణ పురుషుడని నిశ్చయించ తగియున్నది.

లలో కుటుంబసమేతముగా రామేశ్వరమునకుపోయి యచ్చట పుణ్యతీర్థస్నానంబు గావించి రామలింగస్వామివారికి గంగాభిషేకంబుగావించి యచ్చట నుండి రామనాథపురము రాజాగారు సత్కారపూర్వకంబుగా నిచ్చిన దివ్యకుసుమహారంబులనైకొని మరియు నచ్చటగల పుణ్యస్థలంబులందెల్ల తీర్థస్నానంబుగావించి ధనుష్కోటికి పోయి ౩-రాత్రులు క్షేత్రవాసంబుచేసి రత్నాకరమహోదధులను సముద్రములందు స్నానంబుచేసి సేతుమృత్తికను యెత్తుకొని మరల రామేశ్వరముచేరి నాగప్రతిష్ఠ చేసి ప్రయాణము వెడలి ఊరికి వెలుపలనుండు విఘ్నేశ్వరుని సేవించి యచ్చటనుంచి పాంబన్ మార్గముగా వెత్తిలైమంటపము చేరి యచ్చటినుంచి దర్భశయనమునకువచ్చి శ్రీసీతాలక్ష్మణసమేతులగు శ్రీరామచంద్రస్వామివారిని సేవించి యచ్చట మరల శ్రీరామనాథపురము రాజాగారు సత్కారపూర్వకముగానిచ్చిన దివ్యకుసుమహారంబులన్గైకొని రత్నాకరంబను సముద్రంబునందుస్నానంబుగావించి రామనాథపురంబునకువచ్చి రాజా భాస్కరసేతుపతిగారినిచూచి చిత్రాపూర్ణమనాడు వాడుక ప్రకారముగా బ్రాహ్మణులపానకపూజచేసి వచ్చినమార్గముననే మరలిమధురచేరి స్వామినిన్ని అమ్మవారినిన్ని సేవించి శ్రీరంగమునకువచ్చి కావేరిస్నానంబును శ్రీరంగనాథస్వామిదర్శనంబును గావించి చిదంబరక్షేత్రంబుచేరి స్వామిసేవయును చిదంబరదర్శనంబును గావించి రైలుమార్గముగానే చిత్తూరుచేరి తమపాళెములోనుండు మొగిలియనుమహాక్షేత్రంబునకరిగి యచ్చట శ్రీమొగిలీశ్వరస్వామివారికి యభిషేకంబును అర్చనలును గావించి సేతుమృత్తికను కృష్ణయ్యయనునొక్క బ్రాహ్మణునిద్వారా కాశికిపనుపి యా బ్రాహ్మణునకు భోజనాదులకుగాను నెలనెలకు పంపుచు నిత్యంబును గంగాస్నాన విశ్వేశ్వర అన్నపూర్ణావిశాలాక్షీ దర్శనపూజనాదులు చేయుచు కాశీవాసము చేయుచుండు నట్లు యేర్పాటుచేసి కృతార్థులై పరమానందంబుతోడ ప్రభుత్వసంపదను కొదువలేక యనుభవింపుచున్నారు.

మరియు కొచ్చి మహారాజాగారు కాశియాత్రార్థముగా విజయము చేసియుండి మరలి వచ్చునప్పుడు అనగా ౧౮౯౩-వ సంవత్సరము మార్చినెల ౧-తేదికి సరియైన నందననామ సంవత్సర ఫాల్గుణబహుళ ౬-బుధవారమునాడు వారికిగాను వేలూరికి తమయొక్క ౭-గుఱ్ఱములబండిని పనుపి వారిదర్శనముగావించి పిమ్మట ౧౮౯౫-వ సంవత్సరము డిశెంబరు నెల ౬-తేదికి సరియయిన మన్మథనామ సంవత్సర మార్గశిర బహుళ ౫-శుక్రవారమునాడు బంగాళా పెద్దగవర్నరువారు (గవర్నరుజనరలు) వారి దర్శనముచేసి తరువాత పైనచెప్పబడిన కొచ్చిమహారాజాగారికి అనంతరము కొచ్చి దేశపురాజ్యాధిపత్యమును వహించియుండు మహారాజా రామవర్మగారిని ౧౮౯౭-వ సంవత్సరము జనవరి నెల ౨-తేదికి సరియయిన దుర్ముఖిసంవత్సర మార్గశిరబహుళ చతుర్దశినాడు చెన్నపురిలో దర్శనముచేసి వారివల్ల అప్పటప్పుడు యోగక్షేమపత్రికలు చెందుచున్నారు.

ఇట్లుండఁగా బంగారురాజా రామదాసప్పనాయనివారు బహదుర్ వారి ౩-వ భార్య కుమారులలో ౫-వ వారగు ముద్దు శివరామదాసప్పనాయనివారు బంగారుపాళెమును భాగించవలయునని వీరిపైన అనగా బంగారుపాళెం యిప్పటి పాళెగార్ వారగు ముద్దుబంగారు శేషాచలపతిరాజులుంగారు వారిపైన చిత్తూరు న్యాయస్థానములో ౧౮౮౭-వ సంవత్సరము అసల్ నెంబరు ౨౩-గల వ్యాజ్యము వేయగా ఈపాళెము భాగార్హమైనదికాదని ఆక్టింగు చిత్తూరుడిస్ట్రిక్టు జడ్జీగారగు ఏ. వెంకటరమణపాయిగారు ౧౮౯౦-వ సంవత్సరము అక్టోబరు నెల ౨౬-తేది తీర్మానము గావించిరి. అదిమొదలు ఈ ముద్దుబంగారు శేషాచలపతి రాజులుంగారువారు అఖండైశ్వర్యముతో ప్రభుత్వముచేయుచున్నారు.

౪౬-వ పుట మొదలు యిదివరకుగల సంగతులు మాత్రం క్రొత్తవి.

ఇదివరకు పాలవ్యాసులమువారి వంశావళియందు మూడవభాగము సంపూర్ణము.

లలో కుటుంబసమేతముగా రామేశ్వరమునకుపోయి యచ్చట పుణ్యతీర్థస్నానంబు గావించి రామలింగస్వామివారికి గంగాభిషేకంబుగావించి యచ్చట మరల రామనాథపురము రాజాగారు సత్కారపూర్వకంబుగా నిచ్చిన దివ్యకుసుమహారంబులగైకొని మరియు నచ్చటగల పుణ్యస్థలంబులందెల్ల తీర్థస్నానంబుగావించి ధనుష్కోటికి పోయి ౩-రాత్రులు క్షేత్రవాసంబుచేసి రత్నాకరమహోదధులను సముద్రములందు స్నానంబుచేసి సేతువృత్తికను యెత్తుకొని మరల రామేశ్వరముచేరి నాగప్రతిష్ఠ చేసి ప్రయాణము వెడలి ఊరికి వెలుపలనుండు విఘ్నేశ్వరుని సేవించి యచ్చటినుంచి పాంబన్ మార్గముగా వెత్తిలైమంటపముచేరి యచ్చటినుంచి దర్భశయనమునకువచ్చి శ్రీసీతాలక్ష్మణసమేతులగు శ్రీరామచంద్రస్వామివారిని సేవించి యచ్చట మరల శ్రీరామనాథపురము రాజాగారు సత్కారపూర్వకముగానిచ్చిన దివ్యకుసుమహారంబులంగైకొని రత్నాకరంబనుసముద్రంబునందుస్నానంబుగావించి రామనాథపురంబునకువచ్చి రాజాభాస్కరసేతుపతిగారినిచూచి చిత్రాపూర్ణమనాడు వాడుకప్రకారముగా బ్రాహ్మణులపానకపూజచేసి వచ్చినమార్గముననే మరలిమధురచేరి స్వామినిన్ని అమ్మవారినిన్ని సేవించి శ్రీరంగమునకువచ్చి కావేరీస్నానంబును శ్రీరంగనాథస్వామిదర్శనంబును గావించి చిదంబరక్షేత్రంబుజేరి స్వామిసేవయును చిదంబరదర్శనంబును గావించి రైలుమార్గముగానే చిత్తూరుచేరి తమపాళెములోనుండు మొగిలియనుమహాక్షేత్రంబునకరిగి యచ్చటశ్రీ మొగిలీశ్వరస్వామివారికి యభిషేకంబును అర్చనలును గావించి సేతువృత్తికను కృష్ణయ్యయనునొక్కబ్రాహ్మణునిద్వారా కాశీకిపనుపి యాబ్రాహ్మణునకు భోజనాదులకుగాను నెలనెలకు పనుపుచు నిత్యంబును గంగాస్నాన విశ్వేశ్వర అన్నపూర్ణావిశాలాక్షీ దర్శనపూజనాదులు చేయుచు కాశీవాసము చేయుచుండునట్లు యేర్పాటుచేసి కృతార్థులై పరమానందంబుతోడ ప్రభుత్వసంపదను కొదువలేక యనుభవింపుచున్నారు.

మరియు కొచ్చి మహారాజాగారు కాశీయాత్రార్థముగా విజయముచేసియుండి మరలి వచ్చునప్పుడు అనగా ౧౮౯౩-వ సంవత్సరము మార్చినెల ౨-తేదికిసరియైన నందననామ సంవత్సర ఫాల్గుణబహుళ ౬-బుధవారమునాడు వారికిగాను వేలూరికి తమయొక్క ౮-గుర్రములబండినిపనుపి వారిదర్శనముగావించి పిమ్మట ౧౮౯౪-వ సంవత్సరము డిశెంబరునెల ౬-తేదికి సరియయిన మన్మథనామ సంవత్సర మార్గశిర బహుళ ౧-శుక్రవారమునాడు బంగాళా పెద్దగవర్నరువారు (గవర్నరుజనరలు) వారి దర్శనముచేసి తరువాత పైనచెప్పబడిన కొచ్చిమహారాజాగారికి అనంతరము కొచ్చిదేశపురాజ్యాధిపత్యమును వహించియుండు మహారాజా రామవర్మగారిని ౧౮౯౭-వ సంవత్సరము జనవరినెల ౨౧-తేదికి సరియయిన దుర్ముఖిసంవత్సర మార్గశిరబహుళ చతుర్దశినాడు చెన్నపురిలో దర్శనముచేసి వారివల్ల అప్పుడప్పుడు యోగక్షేమపత్రికలు చెందుచున్నారు.

ఇట్లుండగా బంగారురాజా రామదాసప్పనాయనివారు బహదుర్ వారి ౩-వ భార్య కుమారులలో ౧-వ వారగు ముద్దు శివరామదాసప్పనాయనివారు బంగారుపాళెమును భాగించవలయునని వీరిపైన అనగా బంగారుపాళెం యిప్పటి పాళెగార్ వారగు ముద్దుబంగారు శేషాచలపతిరాజులుంగారు వారిపైన చిత్తూరు న్యాయస్థానములో ౧౮౯౭-వ సంవత్సరము అసల్ నెంబరు ౨౩-గల వ్యాజ్యము వేయగా ఈపాళెము భాగార్హమైనదికాదని ఆక్టింగు చిత్తూరుడిస్ట్రిక్టు జడ్జీగారగు ఏ. వెంకటరమణపాయిగారు ౧౮౯౯-వ సంవత్సరము అక్టోబరునెల ౨౬-తేది తీర్మానము గావించిరి. అదిమొదలు ఈ ముద్దుబంగారు శేషాచలపతి రాజులుంగారువారు అఖండైశ్వర్యముతో ప్రభుత్వముచేయుచున్నారు.

౮౯-వ పుట మొదలు యిదివరకుగల సంగతులు మాత్రం క్రొత్తవి.

ఇదివరకు పాలవ్యాసులమువారి వంశావళియందు మూడవభాగము సంపూర్ణము.

౫౮-వ పుట మొదలు చెప్పబడునట్టి కులాచారక్రమములు మన్నెబడివార్లకున్ను దొడ్డిబడివార్లకున్ను ఒకటిగానే వున్నవి.

౬౨, ౬౭ ౬౮ పుటలలో దొడ్డిబడివార్లకు కొన్నిసంగతులు హెచ్చుగావున్నవి

శబ్దరత్నాకరమను ఆంధ్రనిఘంటు ప్రకారము మన్నెబడివారు దొడ్డిబడివారు అను పదములకు అర్థము.

మన్నెము=సన్మానించి యిచ్చిన కొంత భూభాగము; బడి=క్రమము.

మన్నెము + బడి=మన్నెబడి=సన్మానించియిచ్చిన కొంతభూభాగము, క్రమముగాగల,

మన్నెబడివారు అనగా సన్మానించి యిచ్చిన కొంత భూభాగము వంశక్రమముగా గలవారు,

దొడ్డిబడివారు సమూహ క్రమముగలవారు అనగా సైన్యముగావుండువారు,

(౧) చేరువకాడు=ఒక సమూహమునకధిపతి.

చంద్రాంగద చరిత్రము=౨-వ ఆశ్వాసము.

తే॥ గీ॥ చెంచుచేరువకాడొకండువచ్చి నృపతికి కానుకలిచ్చి నిలిచె.

ఇది మొదటి అర్థము.

(౨) చేరువకాడు=సేనాధిపతి.

రామాభ్యుదయము=౪-వ ఆశ్వాసము.

గీతము॥ కలరువాకిట్టి చేరువకాండ్రుదేవ-ఇది=౨-వ అర్థము,

ఆంధ్రపద పారిజాతము అను శుద్ధాంధ్ర-నిఘంటు-ప్రకారము

మన్నెబడివారు-అనుపదమునకు అర్థము

మన్నె+బడి=మన్నెబడి-అనగా-ప్రభువుయొక్క క్రమము లేక దిట్టము.

మన్నె=ప్రభువు

బడి=క్రమము, దిట్టము.

మన్నెబడివారు { ప్రభువుయొక్క క్రమముగలవారు
లేక దిట్టముగలవారు,

శ్రీరస్తు.

పాలవ్యాకులమువారనే క్షత్రియులయొక్క కులాచారక్రమము.

వీరికి తిరుపతి వెంకటరమణస్వామి వారున్ను,
కర్నూలు జిల్లాలోవుండు శ్రీశైలము మల్లికార్జునస్వామివారున్ను } కులదైవములు.

వీరు మారియమ్మనుకూడా పూజించవలసినది.

తిరుపతి దేవాలయమునందు జరుగు బ్రహ్మోత్సవమునకుపోయి అచ్చటస్వామివారికి నైవేద్యములు చేయించవలసినది.

శ్రీశైలము మల్లికార్జున స్వామివారి మహాశివరాత్రి వుత్సవదినమందు అందరున్ను పొక్కప్రొద్దువుండి రాత్రిజాగరణ చేయవలసినది. మరునాడు వుదయమున

బియ్యము	టెంకాయలు	సాంబ్రాణి	ఆకులు
కందిపప్పు	అరటిపండ్లు	వక్కలు	దక్షిణ

వీటిని తీసుకొని దేవాలయమునకు పోయి అర్చకునివద్ద యివ్వవలసినది. అతడు వీటిని దేవునికి నైవేద్యముచేసి వీరికందరికిన్ని తీర్థము, ప్రసాదము, నైవేద్యముచేసిన యన్నము పుష్పములు టెంకాయచిప్పలు వీటిని యివ్వవలసినది.

మారియమ్మ పూజావిధానము.

ఈ పూజచేయుటకుముందుదినము వస్త్రములను చాకలవానికి వేయవలసినది. అతడావస్త్రములను చలవచేసి ఆదినం సాయంకాలమే తెచ్చి యివ్వవలసినది. మరుదినము వుదయమున యిల్లును పేడతో శుద్ధిచేసి ప్రతియింటిలోనున్ను పొక్కప్రొద్దు!వుండగల పురుషుడుగాని స్త్రీగాని స్నానముచేసి చలువవస్త్రములను కట్టుకొని పేడతో అలికిన పుటికలో కొంచెము విభూతిచల్లి అందులో

బియ్యము శేర్లు ౨	టెంకాయలు	పుష్పములు
కందిపప్పు శేరుకాలు	అరటిపండ్లు	కర్పూరం-సాంబ్రాణి
పాలు-పెరుగు	పసుపు	వక్కలు-ఆకులు
నెయ్యి-బెల్లము	గంధపొడి	బియ్యపుపిండిదివ్వెలు

వీటినిపెట్టుకొని కొత్తకుండలు యెత్తుకొని మారియమ్మగుడికి పోవలసినది. వీరిబంధువులున్ను స్నానముచేసి కూడా పోవలసినది. పిమ్మట వీరు తీసుకొనిపోయిన

బియ్యము	పప్పు	బెల్లము	పాలు	నెయ్యి	పెరుగు

వీటిని పూజారివద్ద యివ్వవలసినది. అతడాబియ్యమును వండి అన్నమును ఆకులో

వుంచి దానిపైన పాలు, నెయ్యి, పెరుగు వీటిని వేసి యాదేవతకు నైవేద్యము ఇవ్వగా ఆ మ్రొక్కుబడ్దివుండువారు

పసుపు టెంకాయ కర్పూరము వక్కలు ఆకులు
గంధపొడి అరటిపండ్లు సాంబ్రాణి పుష్పములు

వీటిని పూజారివద్ద యివ్వవలసినది.

పిమ్మట అతడు ఆ దేవతకు సాంబ్రాణిధూపము వేసి టెంకాయకొట్టి దాన్నిన్ని అరటి పండ్లనున్ను యెదటపెట్టి పూలతో అలంకరించి కర్పూరహారతియిచ్చి ఆ టెంకాయ చిప్పలు, అరటిపండ్లు, వక్కలు, ఆకులు, వీటిని నైవేద్యముచేయవలసినది. తరువాత మ్రొక్కుబడ్దు వుండువారు ముందుచెప్పిన బియ్యపుపిండి ప్రమిదలు రెంటియందున్ను నెయ్యివత్తులువేసి దీపము వెలిగించి దానికి పూలు అలంకారముచేసి ప్రమిదలకు పసుపు కుంకుమపెట్టి ఆ దీపములను దేవత యెదుటవుంచి దండము పెట్టవలసినది. పిమ్మట చిన్నప్రమిదను పూజారికియిచ్చి పెద్దప్రమిదనున్ను నైవేద్యాన్నమునున్ను మ్రొక్కుబడ్దువుండువారు తీసుకొనిపోయి ఆ యింటివారందరున్ను ఆయన్నము భుజించవలసినది.

ఇంతవఱకు మారియమ్మ పూజావిధానము ముగిసెను.

వీరికి బ్రాహ్మణులు గురువులు.

అచ్యుతగోత్రమువారిగురువులు-వారిశిష్యులయొక్క భుజములయందు చక్రాంకితముచేసి వారికి రామమంత్రమునున్ను దేవుని ధ్యానముచేయు క్రమమున్ను వుపదేశించి తులసిపూసల జపమాల యివ్వవలసినది.

సదాశివగోత్రమువారియొక్క గురువులు శివపంచాక్షరీ మంత్రమునున్ను దేవునిధ్యానముచేయు క్రమమునున్ను వుపదేశించి విభూతి రుద్రాక్షజపమాల ఇవి యివ్వవలసినది.

బిడ్డపుట్టినప్పుడు చేయవలసిన క్రమము.

బిడ్డపుట్టినవెంటనే ఆ కుటుంబమునకు చేరినవారందరున్ను ౧౧-దినములు పురుడువుంచవలసినది. ఈ ౧౧-దినములున్ను ఆ ప్రసవించిన స్త్రీనిన్ని బిడ్డనున్ను ప్రత్యేకమైన యింటిలో వుంచవలసినది. ౧౧-వ దినమందు ఆ పురుటింటినిన్ని తలుపునున్ను పేడనీళ్లతో కడిగి (అలికి) గోడలకు సున్నముపూసి వాటిపైన ఆవు పంచితమునుచల్లి గుడ్డలను చాకలవానికివేసి స్నానముచేసి వేరే వుతికిన గుడ్డలనుకట్టుకొని బాలింతనున్ను బిడ్డనున్ను స్నానముచేయించి చలువ వస్త్రములనిచ్చి యింటికి పిలుచుకొని పోవలసినది.

పిమ్మట పురోహితుడువచ్చి పుణ్యాహవాచనమున్ను హోమమున్ను చేయవలసినది.

తరువాత ఆ బిడ్డయొక్క తండ్రి-బిడ్డకు నామకరణముచేయవలసినది.
తరువాత ౬-౭-౯ ఈ నెలలలో గురువుదేవరపెట్టి చెవులు కుట్టవలసినది.
౩-వ సంవత్సరములో పుట్టు వెంట్రుకలు తీయవలసినది.
గురువుదేవర పెట్టుక్రమము వివాహమునకు పూర్వం ౬౦-వ పుటలో వ్రాసియున్నది.

వివాహ నిశ్చితార్థము.

పెండ్లికావలసిన పడుచును రజస్వలకాక ముందుగాని వెనుకగాని వివాహము చేయవచ్చును.

వివాహ నిశ్చితార్థమునకుగాను పెండ్లికొడుకుయొక్క తల్లితండ్రులుగాని బంధువులుగాని పెండ్లికొమార్తెయింటికి

పసుపు చీర వక్కలు పూలు టెంకాయలు
కుంకుమ రవికె ఆకులు పండ్లు శనగపప్పు

ఇవి తీసుకొని ప్రయాణమై పోవునపుడు శకునము చూడవలసినది.

కాకి యెడమపార్శ్వమునుండి కుడిపార్శ్వమునకు పోయినా }
గరుడపక్షి కుడిపార్శ్వమునుండి ఎడమపార్శ్వమునకుపోయినా } మంచిది.

ఇందుకు వ్యతిరిక్తముగాపోతే కానిది.

మంచి శకునముగాని చెడ్డశకునముగాని కాకుండినను పెండ్లికూతురి యింటికి పోవచ్చును.

అచ్చట పెండ్లికూతురి యింటివారు యెదురుగావచ్చి వీరిని మర్యాదగా పిలుచుకొనిపోయి అందరున్ను తూర్పుముఖముగా కూర్చున్నతరువాత వారువచ్చిన కార్యమును పెండ్లికూతురి యింటివార్లకు తెలియజేయవలసినది.

అప్పుడు దక్షిణదిక్కున గౌళి పలికెనేని పెండ్లి కుమార్తెను యిచ్చి వివాహముచేయుటకు నిశ్చయించవచ్చును.

ఉత్తరమునందు పలికినను }
ఎచ్చటా పలకకుండినను } కన్యకను యివ్వకూడదు.

దీపము పెద్దదిగాను
ప్రకాశింపుచువుండిన } మంచిది.

దీపము చిన్నదిగాను
కాంతిహీనముగాను వుండిన } కారాదు.

ఇట్లు శకునములు చూడవలసినది.

శకునము మంచిదిగానున్నయెడల తెచ్చిన వస్తువులను పెండ్లికూతురికి యిచ్చి నిశ్చితార్థము జరిపించవలసినది.

నిశ్చితార్థకాలమందు తాంబూలములు యిచ్చు క్రమము.

౧-విఘ్నేశ్వర తాంబూలము.
౨-హరిహరాదుల తాంబూలాలు రెండుతట్టలలోయెత్తి వ్రుకేతూరి యిచ్చేది.
3-ఆచార్యులవారి తాంబూలము.
౪-పురోహితుల తాంబూలము.

౫-మతత్రయ తాంబూలము { శైవ, వైష్ణవ, మాధ్వ } మత బ్రాహ్మలకు ముగ్గురికిన్ని 3-తట్టలలో వ్రుకేతూరి యిచ్చేది.

౬-ప్రభువారి తాంబూలము.
౭-సభా తాంబూలము.

మాల-బలిజవారికి
సాలు-కాపవారికి } 2-తట్టలలో ఇద్దరికి వ్రుకేతూరి యిచ్చేది.

అటుపిమ్మట వచ్చినవారికి విందుచేయవలసినది.

వెనుకనెుక మంచిముహూర్తము నిశ్చయించుకొని బంధువులందరుచేరి పురోహితుని రప్పించి లగ్నపత్రిక యేర్పాటు చేయవలసినది.

వివాహమునకు పూర్వంగురువుదేవరవుంచు క్రమము.

ఆదివారము, గురువుదేవర వుంచవలసినది.

ఈ దినం వుదయాన మఱ్ఱిచెట్టుకు వ్రుక్కప్రొద్దు చెప్పగలందులకు స్థళనిర్దేశనానకు పోవునపుడు కావలసిన వస్తువులు

టెంకాయలు ౨	బెల్లం వీశ 3	శీకాయి పలం ౨
సాంబ్రాణి పలం ౫	పసుపు పడి ౧	మంచినూనె పడి ౨
కర్పూరము పలం ౨	కుంకుమ పలం 3	కానుక అణా ౧

బండారుపెట్టెవుండె స్థానానకు పొయ్యేది

మంచి నూనె పలం ౧	వస్త్రం ౧-కి అణాలు ౬	టెంకాయి ౧
శీకాయి పైసులు ౮	కానుక అణా ౧	పూజకుటెంకాయ ౨
పెట్టెక్రిందికి బియ్యంపళ్లు ౨	కలశంలోకి బియ్యంపడి ౧	కానుక అణా ౧

మేళం వురమలనుద్దెల పంబలవార్లు పూజార్లు సొంతగాడు ౧ ఏకాదశరుద్రులు చుట్టు ౧౦౧, పిళ్లారితోకోట

విభూతిపండ్లు ౧౦ రెండుఅణా రూకలు ౫ పాదకానుక అణా ౧

ఇందుకుముందు పార్శ్వం దక్షిణపార్శ్వం లింగాకారం దక్షిణరూక ౧
ఇందుకు తూర్పుసమీపములో మహా విష్ణువు దక్షిణరూక ... ౧
ఇందుకు ఉత్తరం కూర్మావతారం దక్షిణరూక ౧
ఇందుకు తూర్పుభాగం బ్రహ్మకుండం దక్షిణరూక ౧

నాకంగా ౪ శిలలు.

పసుపు పైసులు 3, కుంకుమ పైసులు 3.

ఇందుకు దక్షిణపార్శ్వం సమీపములో రుద్రపాదాలు
పసుపు పై. 3, కుంకుమ పై. 3, దక్షిణ రూక ౧.

ఇందుకు తూర్పు మొగసాల పోతురాజు
పసుపు పై. 3, కుంకుమ పై. 3, దక్షిణ రూక ౧.

ఇందుకు దక్షిణ మొగసాల ద్వారపాలకులు
పసుపు పై. 3, కుంకుమ పై. 3, దక్షిణ రూక ౧.

ఇందుకు ఉత్తర మొగసాల ద్వారపాలకులు
పసుపు పై. 3, కుంకుమ పై. 3, దక్షిణ రూక ౧.

పుట్టకాడ అమ్మవారికి
పసుపు పై. 3, కుంకుమ పై. 3, దక్షిణ రూక ౧.

అటుకులు పై.	3	టెంకాయ	౧	వడపప్పుపడి	4
బొరుగులు	3	కిచ్చిలివగైరాపండ్లు		పచ్చిపిండిపడి	౧
శెనగలు	3	అరటిపండ్లు	౧౨	నూలుకండె	౧
బెల్లము	3	నిమ్మపండ్లు	3		
ఖర్జూరపుపండ్లు ౬		నానబియ్యం పడి ౧			

స్నానానంతరం చేయవలసిన పని.

తళిగ దీపాలకు నెయ్యివీశ ౧	పూలు యేదినున్సైనా వుండవచ్చును
వత్తులకు నూలుకండె ౧	పొంగలి బియ్యం పళ్లు ౭
వక్కలు పలం ౪	పుట్టకాడికి బియ్యంపళ్లు ౫
ఆకులు కవిళె ౪	అభిషేకానికి తేనెపలం ౨
సాంబ్రాణి కడ్డు ౧౨	పెరుగు పళ్లు ౨ పాలు పళ్లు ౩

గురప్పణివద్దికి చెవ్వుకోయక వాతలువేయని మేకపోతు ౧
పుట్టకాడికి పొట్టేలి ౧
మొగసాలవద్దికి వచ్చినప్పుడు హారతిగూక ౧
ఇల్లుచేరిన పిమ్మట పూజటెంకాయ ౧

మరుదినం నగిరిపిల్లకాయనొకడు వొక్కప్రొద్దువుండి వుదయాన మరుతళిగ వేయవలసినది.

అప్పట్లో టెంకాయలు ౨, సాంబ్రాణిపలం ౪, నెయ్యిపలం ౧, వక్కాకు అణా ౪, కర్పూరం పలం ౭, బెల్లముపలం ౨, పెరుగుపడి ౪, దక్షిణఅణా ౧ పిమ్మట పూజార్లకు బహుమతి అంపకం చేయవలసినది.

వివాహక్రమము.

పెండ్లికూతురు శుక్రవారం వొక్కప్రొద్దువుండి ముత్తైదువలకు పెట్టవలసినది.

పెండ్లికొమారుడు శనివారమునాడు వొక్కప్రొద్దు వుండి గరుడస్తంభము నువుంచి వెంకటేశ్వరస్వామివారికి తళిగవేశి పెండ్లివస్త్రాలు ఆభరణములు అచ్చట వుంచి పూజచేసి ధూపదీపనైవేద్యములుయిచ్చి కర్పూరహారతియిచ్చి గోవిందనామ స్మరణచేయుచు దాలదాసులు సహా వొక్కప్రొద్దు తీర్చుకొని పిదప నలుగులు బెట్టి వివాహముజరుగుచోటికి ప్రయాణమైపోయి పెండ్లిజరుగు గ్రామమునకు వెలుపల నిలువవలసినది.

అప్పుడు ఆ వూరులోని పెండ్లిపెద్దలు మంగళవాద్యములతో యెదురువచ్చి పానకము తాంబూలము పూలు గంధము మొదలైనవి పెండ్లివార్లకుయిచ్చి వార్లను మంగళవాద్యములతో మర్యాదగా పిలుచుకొనివచ్చి వీర్లకుగా ౧౨ స్తంభముల పందిలివేసి మధ్యపెండ్లి అరుగువేసియుండు విడిదియింటిలో నిలిపి భోజనతాంబూలములు అమర్చవలసినది.

పిమ్మట ఆ విడిది ఇంటిలోనే క్షత్రియ ఆగమప్రకారముగా ఉపనయనము జరిపించవలసినది.

పిదప పెండ్లికొడుకువార్ల బంధువులలోగాని పెండ్లికూతురివార్ల బంధువులలోగాని వొకరిని పిలుచుకొనితొలి నలుగుకుముందుగా

౨౮ వక్కలు	౨౮ పసుపుకొమ్ములు	౩ టెంకాయలు	కర్పూరము
౨౮ ఆకులు	౨౮ కజ్జాయములు	౧ పడిబియ్యము	సాంబ్రాణి

వీటిని తీసుకొని వుల్లిడపట్టుకొని వురముల మద్దెల డిండిమలు మొదలైనవాటితో వూరివెలుపలవరకుపోయి పాలకంబములకు పోవువార్లను పంపించివచ్చేది.

అడవికిపోయినవారు పాలమానికిపూజించి అమానిలో ౨౮ కొమ్మలున్ను
వెలగకు పూజించి ఆమానిలో ౨౮ కొమ్మలున్ను
వెదురుకు పూజించి వెదురుచిబ్బెలు ౨౮

ఈ 3 దినుసులున్ను దినుసుకు ౨ వంతున ౬ కట్టలుగా కట్టుకొనివచ్చి వూరిబైట వొక పరిశుద్ధస్థలమున వుంచుకొని వుండవలసినది.

పెండ్లివారు-పెండ్లికొడుకుపెండ్లికూతురుయిండ్లలో పెండ్లి అరుగుపైన వొక పడిబియ్యంవేసి ఆ బియ్యముపైన పీటవేసి పెండ్లి అరుగుపైన నాలుగుప్రక్కలలోనున్న దీపస్తంభములువుంచి తొలుత పెండ్లికొడుకు విడిదిలోనున్న పిదప పెండ్లికూతురి విడిదిలోనున్న తొలినలుగుబెట్టి ముందుగా పెండ్లి కొడుకును సంబంధించిన బంధుజనులనందరనిన్ని పిలుచుకొని స్వజాతివారిచేతనే వుల్లిడపట్టించుకొని

వొకచెంబుతోనీళ్లు	టెంకాయ	పువ్వులు
కొంచెముపాలు	సాంబ్రాణి	౧౨ వక్కలు ౧౨ ఆకులు
నెయ్యి	కర్పూరము	పసుపుదారము

వీటిని తీసుకొని ఆ పాలకంబములు వుంచియుండు చోటికిపోయి ఆ కొమ్మలకు పసుపుదారముచుట్టి పూజచేసి ధూప దీప నైవేద్యములిచ్చి ఆకొమ్మలను స్వజాతివారే తీసుకొనివచ్చి ఆ పెండ్లిపందిలిలోని స్తంభములకు పాల వెలగ వెదురు ఈ మూడుదినుసులకు మూడువంతున ౧౨ స్తంభములకు కట్టేది.

3 పసుపుకొమ్ములు వొక గుడ్డలోకట్టి పెండ్లితిన్నెకు ఈశాన్యమునయుండు స్తంభమునకు ఆ వస్త్రమునుచుట్టేది.

ఇదేప్రకారం పెండ్లికుమార్తె పందలిలోనున్న పాలస్తంభములు కట్టవలసినది.

పైన వ్రాసినప్రకారమే స్వజాతివారలచేత వుల్లిడపట్టించుకొనిపోయి తోరణముతెచ్చి పెండ్లి అరుగుకు ఈశాన్యమూల పెండ్లి పందలికి కట్టవలసినది.

పిదప పెండ్లికొడుకు విడిదిలో నలుగుబెట్టి స్వజాతివారలచేత వుల్లిడపట్టించుకొని ౫ మంది ముత్తైదువుల పిలుచుకొని

ఒకరూక	సాంబ్రాణి	౧౨ కజ్జాయాలు
3 శేర్లబియ్యము	పువ్వులు	తళిగఅన్నము
టెంకాయ	౧౨ వక్కలు	ధోవతిఅంగవస్త్రము
కర్పూరం	౧౨ ఆకులు	ఒకచెంబునీళ్లు

ఇవి తీసుకొనిపోయి అరివేణికి పూజించి కొత్తవస్త్రములుకప్పి పెండ్లికూతురి అరివేణిగావుంటే చీర రవికెపెట్టి ధూపదీపనైవేద్యములుయిచ్చి ఆరూక-బియ్యము వక్కలు-ఆకులు-కుమ్మరవానికిచ్చి ఆయరివేణి స్వజాతివారే యెత్తుకొనివచ్చి పెండ్లిపందలిలో యీశాన్యమూల వుంచవలసినది.

అప్పుడు ఒక ముత్తైదువ కుండయెత్తుకొనిభావికిపోయి నీళ్లు తెచ్చి అరివేణి కొత్తకుండలో నీళ్లు పోసి రెండుకుండలపై మూకుళ్లుపెట్టి నూనేవేసి దీపము పెట్టి రెంటిలోనున్న పసుపుకలిపిన అన్నమువేసి ఒకదారములో,

నిమ్మపండ్లు	గాజులు	పసుపుకొమ్ము
కజ్జాయములు	చెవులాకుచుట్టలు	తమలపాకులు

వీటినికూర్చి ఈ అరివేణి కుండమీదివరకు వచ్చునట్లు వ్రేలాడ కట్టవలసినది.

ఇదేప్రకారముగా పెండ్లి కూతురివిడిదిలోనున్ను చేయవలసినది.

పిమ్మట మూడవనలుగుబెట్టి స్నానము చేయించి మరలపీటపైన కూర్చుండబెట్టి కాళ్లగోళ్లనలుగుపెట్టి మంగలవానికి పెండ్లికుమారుని పందిలిలో మంగలిగిన్నెలో పాలున్ను పెద్దరూక అనేరెండు అణాలున్ను వేసి ఇదిన్ని తలరుమాలయున్ను మంగలవానికిచ్చేది-వాడే తలఅంటేది.

పిమ్మట బావమరిదివచ్చి చేతుల బొటనవ్రేళ్లు రెండున్ను చేర్చి నూలుదారంచుట్టి చేతులలో చారెడు బియ్యము వుంచి అన్నము ప్రమిదచేసి నెయ్యివేసి చేతిలో పెట్టి వత్తివెలిగించి పెండ్లి కుమారుని నాలుగు పక్కలవుంచియుండు దీపస్తంభములకు మూడుచుట్లు నూలు దారముచుట్టేది.

మంగలవాడు ఆదారమును కత్తరించి లోపలవచ్చి బొటనవ్రేళ్లకు కట్టియుండు దారమును కత్తరించి ఆచేతిలోవుండు అన్నంవుంటను తీసుకొనిపోయిన వెనుకస్నానము చేయించేది.

ఇదేప్రకారం పెండ్లికొమార్తె విడిదిలోనున్ను చేయవలసినది.

అయితే మంగలదానికి చీర-రవికె-గిన్నెలోపాలున్ను చిన్నరూక అనే నాలుగు దుడ్లున్ను పెండ్లి కూతురి పందిటిలో యివ్వవలసినది.

పెండ్లికొడుకు స్నానముచేసి వస్త్రాభరణములు ధరించుకొని

క్రొత్తధోవతి	చొకంగుడ్డ	భాషికము
అంగవస్త్రము	కాలిమించులు	కంకణము
రుమాల	కంటెబొట్టు	విల్లునంబులు

ఇవితీసుకొని వీరులబ్రాయను వెడలునప్పుడు పెండ్లి యింటిలో అరివేణివద్ద పూజచేసి యాటనుకొట్టి దానిగుండెకాయతీసుకొని వూరివెలుపట ఒకచదరమైన స్థలములో చుట్టుతెరపట్టి లోపల శుద్ధిచేసి నీళ్లుచల్లి పసుపు, బొగ్గు, యిటికరాయి, ముగ్గురాయి, తంగేడియాకులు ఈ ౫-దినుసులున్ను వేరువేరుగా పొడిచేసుకొని యీ పొళ్లతో చక్రమువేసి ధూపదీపనైవేద్యములిచ్చి యాటగుండెకాయకాల్చి దాన్నిన్ని కజ్జాయములున్ను నిమ్మపండ్లున్ను నైవేద్యము పెట్టి టెంకాయ కొట్టి నైవేద్యముయిచ్చి తెరబైటినుంచి అంబు చేతికితీసుకొని కిలారించుతూ ఒకమనిషి అంబునువింట సంధించి తెరకు తూర్పుదిశనుంచి తెరలోపలికి చూపగా లోపల నుండువాడు నిమ్మపండు అంబుకు కుచ్చియివ్వవలెను.

పిదప విల్లునంబు ధరించినవాడు వీరుల గుడికి ఒకచుట్టు బలితిరిగి మద్దెలకానిచేత నిమ్మపండు యివ్వవలసినది.

పిమ్మట దక్షిణదిశకువచ్చి అంబునులోపలికి యివ్వగా కజ్జాయమును అంబుకు కుచ్చి యివ్వవలసినది.

మరల ఒకచుట్టు బలితిరిగి ఆ కజ్జాయమును మద్దెలకానికియిచ్చి మూడవతూరి పడమటిప్రక్కనలోపలికి అంబును చూపగా యాటగుండెకాయను ఆ బాణమ్మునకు కూర్చి యివ్వవలసినది.

మరల ఒక్కచుట్టు బలితిరిగి ఆ గుండెకాయ మద్దెలకానికి యిచ్చి వీరుల పూజకుతెచ్చినదుత్తయున్ను తాంబూలమున్ను కజ్జాయములున్ను టెంకాయ ఒప్పలున్ను మద్దెలవానికి యిచ్చేది.

అప్పుడు మద్దెలకాడు యీ వంశమును పొగడవలసినది.

ఇది ౭౧-వ పుటలోవున్నది.

పిమ్మట అచ్చటినుంచి కొత్తవస్త్రములు, భాషికము, కంకణము, కాలిమించులు వీట్లను ధరించుకొని వుల్లిడవాద్యములులేక యింటికివచ్చేది.

ఇదే ప్రకారం పెండ్లికొమార్తెకున్ను చేయవలసినది.

పిదప పెండ్లికూతురి పందిటిలో మల్లయ్యకొండ సింహాసనమువేసి వినాయక పూజచేసి ఆ సింహాసనముపైన వక్కలు ఆకులువుంచి వధూవరుల తల్లితండ్రులుగాని

సహోదరులుగాని వారికి ముఖ్యమైన బంధువులుగాని వొకరికొకరు యెదరెదురుగా కూర్చుండి తాంబూలాలు మార్చుకొనేది.

పిమ్మట తాంబూలాలు యిచ్చు క్రమము.

మొదట వినాయకుని తాంబూలము.

౨-హరిహరాదుల తాంబూలము.

3-ముప్పదిముక్కోటి దేవతల తాంబూలము.

౪-ఆచార్యులవారి తాంబూలము,

౫-ఇంద్రిమల్లినాయడు కామమల్లినాయని తాంబూలము.

౬-ఆరాజ్యమేలు ప్రభువు తాంబూలము.

౭-బంధువులు పెద్దమనుష్యుల తాంబూలము,

౮-చాలు, మూల, తాంబూలములు,

౯-ఇతరుల తాంబూలములు,

ఈ ప్రకారం తాంబూలములు యిచ్చినపిదప పెండ్లికొమారుడు భాషికను కంకణములతో బంధుసమేతముగా మరియొక ప్రదేశమున కూర్చుండి అచ్చటినుంచి పెండ్లికొమార్తెవిడిదికి తమబంధువులవల్ల అరణముగా యివ్వబడిన

ఆభరణములు	టెంకాయలు	జిలకర మిర్యాలు	వక్కలు
వస్త్రములు	కొబ్బెరగిన్నెలు	పసుపు	ఆకులు
బియ్యము శేరు ౧	ఖర్జూరపుకాయలు	తెల్లగడ్డలు	భాషికము

వీటిని తీసుకొని మంగళవాద్యములతో పెండ్లికొమార్తె విడిదికిన్ని పెండ్లికుమారుని విడిదికిన్ని మూడుమార్లుకంత నడిచేది, మూడవతూరి పెండ్లికూతురివిడిదిలోయిచ్చేది.

పిదప పెండ్లికుమారుడు వినాయకపూజచేసి పెండ్లికూతురివిడిది పందిటివద్దికి వచ్చినిలువగా పెండ్లికూతురి సహోదరీలు పువ్వులు, గంధము, తాంబూలము ఇవి తీసుకొనివచ్చి పెండ్లికుమారినికిచ్చి ఆతనివల్ల బహుమానములు పొందవలసినది.

అంతట పెండ్లికొడుకు పందిటిలోనికిపోగా పురోహితుడు ఆ పందిటిలో పెండ్లియరుగుమీద పెండ్లికుమారుని నిలువబెట్టి అతనికి అడ్డముగా వొకగుడ్డను తెర పట్టవలసినది. పెండ్లికూతురికి వస్త్రాభరణములు అలంకరించి తల్లిగాని సహోదరీలుగాని ఆ పెండ్లికూతురి వొడిలో

బియ్యము	ఖర్జూరపుకాయలు	పసుపు కుంకుమభరిణె
టెంకాయలు	వక్కలు ఆకులు	దువ్వెన

వీట్లను వొడిబాలుకట్టి ఆ పెండ్లి అరుగుమీదికి పిలుచుకొని రావలసినది,

ఇచ్చటనాంది జరిపించేది.

పిమ్మట కన్యాదానముచేసి తాంబాళములో బియ్యముపోసి ఆ బియ్యముపైన టెంకాయవుంచి దానిపైన పెండ్లికుమారుని యింటి మంగళసూత్రమువుంచేది. ఇదే ప్రకారం పెండ్లికొమార్తెయింటి కన్యాదానంబొట్టున్ను తాంబాళములోవుంచి యీ రెండుతట్టలకున్ను కర్పూరహారతియిచ్చి అచ్చటవచ్చియుండు సభవారియొద్దకు తీసుకొనిపోయి అందరున్ను బొట్టును తాకినతరువాత యీ తట్టలను వధూవరులకు మూడు ప్రదక్షిణములు త్రిప్పి పెండ్లికొడుకువద్దికి తేవలసినది,

పిదప పెండ్లికొడుకు పెండ్లికూతురి యెడమకాలి బొటమన వ్రేలిపైన తన కుడికాలి బొటమనవ్రేలినివుంచుకొని కన్యాదానంబొట్టును పురోహితునివల్లతీసుకొని పెండ్లికూతురిమెడకుకట్టి పిదప తనబొట్టునుకట్టి తెరగుడ్డ తీసివేసి తలంబ్రాలు బియ్యమును వొకరితలమీద వొకరువేయవలసినది,

అంతనాపురోహితుడు యిద్దరికిన్ని కొంగుముళ్లు వేసినపిమ్మట వధూవరులు పెండ్లిపీటపైన పెండ్లికొడుకు కుడిభాగమునన్ను పెండ్లికూతురు యెడమభాగమున నున్ను కూర్చొనగా సభవారిలోతొలుత బ్రాహ్మలున్ను పిదప బంధువులున్ను తలంబ్రాలు వేసినతరువాత ఫలదానములుయిచ్చి చదివింపులు జరిపించవలసినది.

పిదప పెండ్లికొడుకు తనకుడిచేతిచిటికెనవ్రేలితో పెండ్లికూతురి కుడిచేతిచిటికెన వ్రేలుకూర్చుకొని పెండ్లిచవికెకు మూడుమార్లు ప్రదక్షిణముచేసి అరుంధతీ దర్శనము చేసుకొని యింటిలోపలికిపోయి కూర్చున్న తరువాతనొకగిన్నెతో నెయ్యి తేనె చెక్కెర అరటిపండు పాలు వీటిని వొకరియెంగిలియొకరికి కలియునట్లు మూడుమార్లు తాపించవలసినది,

ఆవల పెండ్లికుమారుని విడిదికిపోయి యీ విడిదిలో జరిగినప్రకారము మలి ముహూర్తము జరిపించవలసినది. పిదప పెండ్లికొడుకు పెండ్లికూతురు స్నానముచేసి నలుగుబెట్టుకొని గ్రామానికివెలుపలయుండు పుట్టవద్దికి మంగళవాద్యములతో వుల్లి డపట్టించుకొని, తొల్లిక, అయిదుతట్టలలో

పాలు	కర్పూరము	టెంకాయలు
నెయ్యి	పసుపు	పుష్పములు
సాంబ్రాణి	కుంకుమ	నూలుకండె

వీట్లను ముత్తైదువులచేత యెత్తించుకొని ఆ పుట్టవద్దికిపోయి నూలుదారమును పుట్టకు 3-చుట్లుచుట్టి పాలు నెయ్యి పుట్టలోపోసి ధూపదీపనైవేద్యములిచ్చి పెండ్లికొడుకు ఆ పుట్టను తొల్లికతో తొవ్వవలసినది. పెండ్లి కుమార్తె ఆమంటిని పుటికెలో వేయవలెను,

పిమ్మట ఆ పుటికెను ముత్తైదువులచేత యెత్తించుకొని పందిలివద్దికివచ్చి ఆ మన్నులో నీళ్లువేసి కలిపి ౧౨ ముద్దలుచేసి పెండ్లికూతురివద్ద యివ్వగా ఆమె ఆ ముద్దలను ౧౨ పందిలి స్తంభములవద్ద పెట్టవలసినది. పెండ్లి కుమారుని చేతినుంచి తళిగ అన్నమును పెండ్లికొమార్తె తీసుకొని ప్రతిస్తంభమువద్దనున్న ఆ తళిగ అన్నముపెట్టి ధూపదీప నైవేద్యములిచ్చి (హరిరాణియను) అరివేణియొద్దకు పోయి కూర్చుండి, ముక్కర, వుంగరం, ఆయరివేణికుండలోవేసి వధూవరులు మూడుమార్లు యెత్తవలసినది. పిదప వారిద్దరున్ను వాటిని ధరించుకొనగా పెద్ద ముత్తైదువలు ఆ యరివేణి కుండలలో ౪-చిన్నకుండలను తీసుకొని ఆ పెండ్లియింటి వెనుక భాగమునకుపోయి చౌకముగావుంచి దీనిచుట్టూనూలుదారముకట్టి పెండ్లికొడుకునున్ను పెండ్లికూతురినిన్ని ఆకుండల మధ్యకూర్చుండబెట్టి తరువాత వారలకుముత్తైదువలునూనెతో తల అంటవలసినది.

అంతట పెండ్లికొడుకున్ను పెండ్లికూతురున్ను ప్రత్యేకముగా స్నానముచేసి పరిశుద్ధమైన వస్త్రములను కట్టుకొని పందిలికివచ్చి నామము పెట్టుకొనవలసినది.

దొడ్డిబడివార్లయిండ్ల ఆచారము,

పిదప పెండ్లికొడుకుతో కూడా కొందరు బంధువులున్ను స్నేహితులున్ను మంగళవాద్య సమేతముగా గ్రామముయొక్క వెలుపటి ప్రదేశమునకు రెండుయెద్దులు వొకనాగేలు ౯-దినుసుల ధాన్యములు సాంబ్రాణి టెంకాయ తాంబూలము ఇవితీసుకొనిపోయి అచ్చట ఆ యెద్దులను నాగేటికికట్టి కొంచెము నేలనుదున్ని ఆ నేలలో ౯-విధములైన ధాన్యములనువిత్తి దానిపైన కొంచెము నీళ్లుచల్లి టెంకాయ కొట్టి సాంబ్రాణి ధూపమువేసి దండముబెట్టి యింటికివచ్చి పెండ్లికూతురితో నేను నేలనుదున్నినాను. ఈ నాగేటినిన్ని నొగనున్ను యెత్తుకొమ్మని పెండ్లికుమారుడు చెప్పవలసినది. పెండ్లికూతురు ఆ నాగేటిని తీసుకొనిపోయి వొకతట్టుపెట్టవలసినది.

పెండ్లి కొమార్తెయున్ను యింకా కొందరు ముత్తైదువలున్ను వొకతట్టలో వక్కలాకులు కర్పూరము సాంబ్రాణి టెంకాయ నానబియ్యము బెల్లము వీట్లనున్ను మరియొకతట్టలో

వడ్లు	కందులు	వులవలు
సజ్జలు	పెసలు	ప్రత్తిగింజలు
అనుములు	వుద్దులు	రాగులు

ఈ ధాన్యములనున్ను వుంచుకొని ఈ రెండు తట్టలున్ను బావియొద్దకు తీసుకొనిపోయి వినాయకునిపెట్టి కొంచెము నేలను శుద్ధిపరచి యీ నవధాన్యములు చల్లి టెంకాయకొట్టి ధూపదీప నైవేద్యములిచ్చి ఆ నానబియ్యము బెల్లము టెంకాయ వీట్లను బిడ్డలకందరికిన్ని పెండ్లికుమార్తె యివ్వవలసినది.

ఉరముమీద రూక ఆడించేపద్ధతి.

పెండ్లి పందిటిలో పడిబియ్యము విస్తరాకులోపోసి దానిపైన వురమువుంచి వురముపైన కొంచెము బియ్యముపెట్టి దానిపైన తలక్రిందికివుండేలాగు రూకపెట్టి ఆ వురములకు సమీపముగా మద్దెలకాడు మద్దెలవాయిస్తే ఆ రూకయెగిరి తలపైకి పడితే ఆడబిడ్డ తలక్రిందికివుండి యెగురుతూవుంటే మొగబిడ్డ, ఆరూక బియ్యము అచ్చటకొట్టిన టెంకాయ ఇవి మద్దెలకానికి యిచ్చేది, ఈ ఆచారములు దొడ్డిబడివార్ల యిండ్లలోమాత్రము జరుగుచున్నది.

ఆ రాత్రి మెరవణి క్రమము,

పెండ్లి కుమారుడు వొక గుర్రముమీదనున్ను పెండ్లికూతురు బండిలోగాని మేనాలోగాని కూర్చునివెడలగా వారితోకూడా వారితల్లితండ్రులు బంధువులు స్నేహితులు అందరున్ను వెడలి మంగళవాద్యములు బోగమువార్లు బాణబిరుసులు మొదలైనవాటితోకూడా గ్రామదేవతయొక్క దేవాలయమునకుపోయి అచ్చట టెంకాయ సాంబ్రాణి కర్పూరము వక్కలాకులు వీటిని ఆ దేవతకు నైవేద్యముచేసి దండము పెట్టి యింటికి మరలి రావలసినది,

పెండ్లి కొమార్తెకు యౌవనమువచ్చియుంటే ఆ రాత్రే గర్భాధాన ముహూర్తము జరిపించవచ్చును,

ప్రథమ రజస్వల అయినప్పుడు జరగవలసిన క్రమము,

ప్రథమ రజస్వల అయిన ౫-దినములవరకు కన్యపడుచులచేత నలుగుపెట్టించి పిదప ౧౧-దినములవరకు సమస్త ముత్తైదువలున్ను నలుగుబెట్టి ౧౧-వదినమందు యింటిలోపలికి పిలుచుకొనేది.

మలిసమర్తకు యిదేప్రకారముగాచేసి ౯-వ దినమునందు యింటిలోపలికి పిలుచుకొనవలసినది,

౩-వ సమర్తకున్ను యిదేప్రకారముగా జరిపించి ౫-వ దినమునందు యింటిలోపలికి పిలుచుకొనవలసినది.

గర్భాధానక్రమము

గర్భాధానమునకు మంచిలగ్నము యేర్పాటుచేసుకొని ఆ దినమునందు భార్యాభర్తలను పీటమీద కూర్చుండబెట్టి నలుగుపెట్టి తలయంటి స్నానముచేయించి నూతన వస్త్రములుకట్టి పీటమీద కూర్చుండబెట్టి పురోహితునివల్ల పుణ్యాహవాచనము మొదలైన కార్యములు జరిపించి నలుగులుపెట్టి రాత్రి పడకయింటికి పంపించవలసినది.

గర్భము ధరించినది మొదలు యేడవనెలలో ఆదివారమునాడు ఎరసానిదేవర పెట్టవలసినందుకు కావలసిన సామానులు,

బియ్యము పళ్లు	౨	పెరుగు పడి	౪	అరటిపండ్లు	౮
కందిబేడలు పడి	|	పాలు పడి	|	ఖర్జూరపు పండ్లు	౮
నెయ్యి పలము	౧	పూలు పైసు	౮	గాజులు	౮
నూనె స॥	౧	నల్లపూసలుసరాలు	౨	చెరుకుపండు పలము	౫
శీకాయి స॥	౧	చెవ్వాకులు	౨	టెంకాయ	౧
పసుపు స॥	౧	గందపొడి పలము	౧	కూతవేయని యెట్టి	
కుంకుమ స॥	౪	సాంబ్రాణి స॥	౧	కోడిపుంజు	౧
పోగుదారాలు పైసు	౩	కర్పూరం స॥	౧	గుడ్లుపెట్టే యెట్టి	
దారపుచుట్ట పైసు	౧	వక్కలు స॥	౧	పెట్టకోడి	౬
నిమ్మపండ్లు	౨	తమలపాకులు	౩౦	కోడిగుడ్లు	౨

క్రొత్తదుత్తకు పసుపుపూసి పోగుదారము పసుపుకొమ్ముకట్టి పొంగలిపెట్టేది,

పళ్యాలు తీంద్రాకులలో వేయవలశినది.

యరసానిదేవరచీర ౧, నల్లపోగులులేకుండా తెల్లపోగులు యఱపోగులు మాత్రం వుండేటట్టు నేయించి దేవరకు పెట్టవలశినది.

బిడ్డపుట్టినప్పుడు చేయవలశినక్రమము ౫౯-వ పుటలోవున్నది.

క్షత్రియులై యీ పాలవ్యాకులమువారు యిందులోవుండు కులాచారక్రమము తప్పక నడచిరేని దీర్ఘాయురారోగ్య పుత్రపౌత్రాది అష్టైశ్వర్యములుగలిగియుందురు,

వీరుల వ్రాసిన పిదప ఉరమల మద్దెలకాడు పొగడవలసిన రీతి.

సముద్రునిదేవియుప్పొంగి ముత్యమును బైటికితోసి ఆ ముత్యములో చంద్రగిరి మల్లయ్యను వుత్పత్తిచేసి సంరక్షణచేయడానికి మల్లయ్యకొండపైనవుండు యేడు శిరస్సులుగల ఆదిశేషునివద్ద ఆ బిడ్డనువొప్పించెను. పిమ్మట ఆదిశేషుడు కొమ్మతేనెలు తెచ్చి ఆ బిడ్డను ఆకలియైనప్పుడుపెట్టి సంరక్షణచేసి పెంచెను.

పిమ్మట చంద్రగిరి మల్లయ్యరాజ్యమేలుచు ఆదిశేషునికి సంవత్సరానికి వొక తూరి నల్లంచువేసిన కొత్తవస్త్రము, పాలు, బెల్లము, ఫలాహారములు సాంబ్రాణి ధూపదీప నివేదనములుయిచ్చి పూజింపుచుండెను

పిమ్మట ఆ చంద్రగిరి మల్లయ్య పెండ్లిచేసుకొనుటకు యత్నించి మద్దెల పురమ చేయించుటకుగాను యలకతోటివాని వెంటపెట్టుకొని పాలకొండకుపోయి నూనె పోసి గొడ్డండ్లునునుపెక్కనూరించి పాలుపోసి గొడ్డండ్లు పదునుగానూరించి యేదుము సాంబ్రాణి యేకదూపంవేయించి పందుము సాంబ్రాణి పారదూపంవేయించి దీప నైవేద్యములుయిచ్చి సాష్టాంగదండములు సరివొప్పగించి యలకతోటివానిచేత మాను గొట్టించి వుత్తరముపోయిన కొమ్మను వురమచేయించి మొందులుమానును మద్దెలచేయించి యెగిరిపోయినచెక్కలు చాగట్లు చేయించెను.

పిమ్మట శాస్త్రజ్ఞులు ఈ మూడుబిరుదులు నీకు తగునని చెప్పగా ఆ మద్దెలకు ఎడమదిక్కు వెండికరిణె కుడిదిక్కు బంగారుకరిణెవేసివాయించితే అది డుబ్బుడుబ్బు మనగా యీ మద్దెలవాగలేదని శాస్త్రజ్ఞులకు చూపించెను, అందుకు వారు మీరు వెండి బంగారు కలిగినదని ఆ కరిణెలు వేయించినావు, అట్లావేస్తే వాగదుఅని చెప్పి కుడితట్టు కూటికరిణె యెడమతట్టు సంకటికరిణె వేయమనిరి, ఆ ప్రకారం వేయగా బాగావాగినది. పిమ్మట ఆ వాద్యములతో పెండ్లిచేసుకొని సుఖముగా రాజ్యముచేయుచు క్షత్రియులైన పాలవ్యాకులమువారు పెండ్లిండ్లు చేయునప్పుడు ఈ వాద్యములు తప్పక వుండవలసినదని అనుజ్ఞయిచ్చెను,

అంభోధిరాజుయొక్క కుమారులగు ఋశ్యశృంగ వృషపర్వులు ఇద్దరున్ను జమదగ్నిమహామునీశ్వరుల ఆశ్రమమందుండగా ఆ మునీశ్వరుని యిష్టికామధేనువులు రెండున్ను కార్తవీర్యార్జునుని యుద్యానవనమునందు మేసినవని యారాజువిని వాటిని వెతకుచు ఆ జమదగ్నిమునీశ్వరుని యాశ్రమమార్గముగారాగా ఆ మునీశ్వరుడారాజును భోజనముచేయవలయునని నిలిపి ఇష్టికామధేనువులచేత నారాజుకు భోజనము లమర్పించగా ఆరాజు భుజించి సుఖాసీనుడైయుండ ఆ జంతువులే తమ వుద్యాన

వనము మేసినవనిచారులవలనతని కుమారులుతెలుసుకొని తండ్రివద్దనినావినక వాటిని కొనిపోయిరి. ఆ సమాచారమును పరశురాముడువిని కార్తవీర్యార్జునునిమీదికి యుద్ధానికిపోగాజమదగ్ని మహాముని పరశురామునికి సహాయముగా ఋశ్యశృంగ వృషపర్వులను ఇత్తిగర్భమందు ఇత్తిమల్లినాయడనియు కామధేనువు గర్భమందు కామ మల్లినాయడనియు పుట్టించగా వారులెక్కలేని పరివారముతోడ వుద్భవించి పరశు రాములతో కూడాపోయి యుద్ధముఁజేసి కార్తవీర్యార్జునుని సంహరించి ఇత్తికామ ధేనువులను జమదగ్ని మహామునీశ్వరుని యాశ్రమమునకు తెచ్చిరి.

అప్పుడా జమదగ్ని మహాముని వారలనుచూచి మీరు చక్రవర్తిని చంపినారు కాఁబట్టి ఆ పాపము తీరుటకుగాను తీర్థయాత్రచేసి రావలసినదని చెప్పిపనుపెను,

ఆ సమయమునందు జమదగ్ని మహామునిని కార్తవీర్యార్జునుని కొడుకులు చంపగా పరశురాములు వ్యాకులమువారితోడ తీర్థయాత్రచేసివచ్చి తండ్రి మరణ మునువిని మహాకోపముతో వ్యాకులమువారిని సహాయము వుంచుకొని క్షత్రియులను యిరువదియొక్కమారు నిర్మూలముచేసి తనకు సహాయముగానుండిన వ్యాకులమువారికి కార్తవీర్యార్జునుని రాజమందిరంబుననుండిన రాజకన్నెలనుయిచ్చి వివాహముచేసి ఆ హస్తినాపుర రాజ్యమునకు వీరలను పట్టాభిషేకముచేసి

స్వామిముద్రలు	పగులుదీవిటీలు
గండపెండారములు	డాకాలియంకుశము
ఉభయవింజామరములు	పవణముద్రలు
మోకాటిపంజులు	గండ్రగొడ్డలి

ఇవి మొదలైన బిరుదులు యిచ్చి మీరు విష్ణు ఈశ్వరులనిద్దరినిన్ని పూజింపుచు పెరటాశి శనివారములలో వొక్క ప్రొద్దువుండి శ్రీవెంకటరమణ స్వామివారికి తలిగ దీపారాధనలు సమర్పించవలయుననిన్ని కార్తీక సోమవారములు వొక్కప్రొద్దువుండి శ్రీపరమేశ్వరునికి తలిగదీపారాధనలు యివ్వవలయుననిన్ని ఇట్లు చేయనియెడల మీకు అన్నవస్త్రములకు తక్కువయగుననిన్ని మాయాజ్ఞమేరకు నడచినవారు ఆయురా రోగ్య ఐశ్వర్య పుత్రపౌత్రాదులతో శ్రేయోభివృద్ధిగా వుందురనిన్ని వుత్తరవు యిచ్చిరి.

పిమ్మట ఈ వంశపురాజులు పాలవ్యాకుల పట్టభద్రులని ప్రఖ్యాతివహించి యుండగా అప్పటి దేశాధిపతి దానినివిని సహింపక వారలనుచూచి మీదేహములో

నుంచి పాలుచూపితేనేగాని పాలవ్యాకులపట్ట భద్రులనేపేరు మీరువహించకూడ దని యాక్షేపించెను. అప్పుడు కామమల్లినాయడు తనచేతివ్రేళ్లనుంచి పాలుపిండి చూపగా ఆ దేశాధిపతిమెచ్చి మీకు ఈ బిరుదులు తగునని చెప్పి యనేక బహు మానములిచ్చెను.

పిదప కొన్ని దినములకు మ్లేచ్ఛులుదండెత్తిరాగా పాలవ్యాకులముహా రుతమ బంధు మిత్రులనున్న పదియారువేల కంపణమువారినిన్ని తోడ్కొని శ్రీశైలమునకు వచ్చిచేరిరి. అచ్చట ప్రౌఢదేవరాయలువారు వీరిని గౌరవించి ఇత్తివారికి శ్రీశైల ముతోచేరిన తొమ్మిదిలక్షల డెబ్బదివేల దేశములను యిచ్చిరి కామ వారికి పచ్చార్ల పట్టణముతోచేరిన మూడులక్షల రాజ్యములనిచ్చిరి అట్లుయిచ్చినా వీరలందురున్ను శ్రీశైలమునందే వాసముచేయుచు అచ్చట

నందుల మఠము	గవి మఠము
సారంగ మఠము	మహానందీశ్వరుని రుద్ర మఠము
తోట మఠము	యాగంటీశ్వరుని మహంతు మఠము
మూల మఠము	విరక్తుల మఠము

అను పేర్లుగల మఠములను కట్టించి రాజ్యముల నేలుచుండగా కొంతకాలమునకు కర్నూలు (కందనూరు) నవాబు యిచటికివచ్చి వీరికన్నెలను తనకిమ్మనియడుగగా వారలాసమయమునకు తగుమాటచెప్పి యతనిపంపి పిమ్మట తమ నగరుకొలువు కూట ములో వెల్లికాయలుపరచి వాటిపైన రత్నకంబళ్లు జముఖానములువేసి పెరుగుదిండ్లు పెట్టి వేటకుక్కలను సన్ననివారములతో నచ్చోటకట్టి తాము సమస్తజనులతో కూడా పట్టణమువిడచి వెడలి తుంగభద్రా నదీతీరముచేరగా ఆ నదిపూర్ణప్రవాహము పోవుచుండెను. అప్పుడువ్యాకులమువారు ఈ నదిని యెట్లుదాటుదుమని దుఃఖింపు చుండగా వీరల దుఃఖమునుచూచి యానది తనకు నరబలియిస్తే మార్గము చూపెదనని స్వప్నమందుచెప్పెను.

పిమ్మట నరబలి యిచ్చుటకుగాను వీరాలాలోచింపుచుండుటనుచూచి యెలక తోటివాడొకడు తన కొడుకులు వీరప్ప బీరప్ప అనువార్లను బలియిచ్చెను అప్పుడు వారల మొండెములు మాత్రము నదిలో కొట్టుకొనిపోయి తలలుకొట్టుకొనిపోక నిలు వగా మీరుయెందుకు నిలచియున్నారని పాలవ్యాకులమువారు అడిగిరి అందుకాశి రస్సులు మీరుమాకేమి యిచ్చెదరనియడిగినవి అదివిని పాలవ్యాకులమువారు మా కులమువారందరున్ను వివాహమునకు ముందు మీకు వీరుల పూజయనియెడుపూజ చేయుచున్నామని చెప్పగా ఆ శిరస్సులు నదిలోకొట్టుకొని పోయినవి.

పిదప ఆనది దారి యివ్వగా అందరున్ను సుఖముగాదాటి గట్టుచేరిరి మరల ఆ నదినిచూచి మాకుదోవవిడిచినట్లు మా పగవారికి దోవవిడువవద్దని పాలవ్యాకులము వారు ప్రార్థించగా ఆ నది యథాప్రకారముగా ప్రవహింపుచుండెను.

పిమ్మట పాలవ్యాకులమువారు పచ్చని పందిళ్లువేసి అమ్మవారికి గుడికట్టి గంగను నిలిపి మొక్కుబళ్లుతీర్చుకొని సుఖముగానుండిరట.

ఈ ప్రకారముగా పాలవ్యాకులమువారు అను
క్షత్రియులయొక్క వంశావళిక్రమము
ప్రచురింపబడినది.

END OF
TITLE